ముహూర్తం
శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధపాడ్యమి ఉ7.24 వరకు అనంతరం విదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.7.13 వరకు అనంతరం శ్రవణం; అమృతకాలం: మ.12.25 నుండి 2.10 వరకు; వర్జ్యం: రా.11.38 నుండి 1.24 వరకు; దుర్ముహూర్తం: మ.12.24 నుండి 1.12 వరకు మ 2.48 నుండి 3.36; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 63 • సంచిక: 359 • సోమవారం 7 జనవరి 2019 • విజయవాడ ✻ పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



పోలవరం నవయుగ రికార్డు!

• 13 గంటల్లో 17,929 క్యూ.మీ.ల కాంక్రీట్ • గంటకు 1,380 క్యూ.మీ.లు • చెమటోడుస్తున్న వేలాది మంది ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు • లక్ష్యం 28 వేల క్యూ.మీ.లు

3 లో

కమలనాథుల పన్నాగాలు పారవ్!

అవినీతికి కొమ్ముకాస్తున్న మోడీ

• మాటలు ఘనం.. చేతలు శూన్యం • ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారు • పెత్తందారీ పోకడలతో దేశం దివాలా • రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే యత్నం • లక్ష పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టాం • ప్రతి ఇంటికీ స్మార్ట్ ఫోన్ ఇస్తాం: సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు ప్రధాని మోడీ వైకాపా అధినేత జగన్, తెరాస అధినేత కేసీఆర్‌లతో కలసి కుట్రలు పన్నుతున్నారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వనని సీఎం చంద్రబాబు అన్నారు. నరేంద్ర మోడీ అత్యంత వైఫల్య ప్రధాని అని, అన్ని రంగాల్లో ఆయన పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు గుప్పించారు. ఇప్పటివరకు ఆయన చాలా మాటలు చెప్పారే కానీ వాటిలో ఏఒక్కటీ ఆచరణలోకి రాలేదని ఎద్దేవా చేశారు. నరేంద్ర మోడీ, అమిత్ షాలు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని, అసంబద్ధ ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని మండిపడ్డారు. ఆదివారం కృష్ణా జిల్లా పెనమలూరు మండల పరిధిలోని పునాదిపాడులో జరిగిన జన్మభూమి -మా ఊరు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ విధానాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్‌యాదవ్, బీఎస్‌పీ అధినేత్రి మాయావతిలు పొత్తుపెట్టుకుంటే అఖిలేష్‌యాదవ్‌పై పాత కేసులను తిరగతోడుతున్నారన్నారు. ట్రిపుల్ తలాక్‌ను ఉపయోగించి ముస్లిం వర్గాలను ఇబ్బంది పెట్టి అణగదొక్కే ప్రయత్నం బిజెపి చేస్తోందని ఆరోపించారు. మరో వైపు ప్రశాంత రాష్ట్రమైన కేరళలో కూడా అనవసంగా జోక్యం చేసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిప్పులు చెరిగారు. కోడి కత్తి పార్టీ టీడీపీ, ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో కూడా రాష్ట్ర హక్కును హరిస్తూ కేసును ఎన్ఐఏకు అప్పగించిందని మండిపడ్డారు. ఇదంతా తప్పుడు వ్యక్తులను కాపాడేందుకేనని విమర్శించారు. విజయ్‌మాల్యా, రాఫెల్ కుంభకోణంలో తమతప్పును కప్పిపుచ్చుకునే ➩ 2వ పేజీలో...

అధికార మార్పు అనివార్యం



వైకాపా, తెదేపాలకు గెలుపుపై నమ్మకం లేదు

• వ్యక్తి ఆధారిత పార్టీలు దెబ్బతినక తప్పదు • భావజాలంతో ఏర్పడిన పార్టీ జనసేన

3 లో

• యువతపైనే ఆశలన్నీ... • ఓర్పు, సహనమే మన బలం • ప్రజాదరణలో విజయాన్ని దర్శిస్తున్నా • అనంత, విజయనగరం జిల్లాల సమీక్షల్లో పవన్

అమరావతి, ఆంధ్రప్రభ : కులాల మధ్య సఖ్యత కోరుకుంటాను కనుకే కులాల గురించి తాను మాట్లాడినంత సూటిగా ఏ రాజకీయ నాయకుడు మాట్లాడలేదని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. తాను ఏ ఒక్క కులానికీ బందీని కానని చెప్పారు. ఆలోచింప చేయడమే రాజకీయాల లక్ష్యమని, ఆ దిశగా జనసేన కార్యకర్తలు పయనం సాగించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మన లక్ష్యం మార్పు తీసుకు రావడమేనని, పోరాటం ద్వారానే మార్పు సిద్ధిస్తుందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగా అధికారం రావచ్చని అన్నారు. జిల్లాల వారీ సమీక్షా సమావేశాల్లో భాగంగా ఆదివారం విజయవాడలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విజయనగరం, అనంతపురం జిల్లాల నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. విజయనగరం జిల్లా వెనుకబాటుతనానికి స్థానిక నేతలే కారణం..కేవలం ఇద్దరు వ్యక్తులు జిల్లాని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ప్రత్యర్థులను బలంగా విమర్శించండి కానీ, వారి కులాలను మాత్రం ప్రస్తావించకండి అని అన్నారు. జనసేన ➩ 3వ పేజీలో...

బాబు అవినీతి 6 లక్షల కోట్లు!


• నాలుగున్నరేళ్లలో దోపిడీ ఇది • ప్రజలకు వివరించి చెప్పండి • పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు • 'అవినీతి చక్రవర్తి' పుస్తకావిష్కరణ

ఇఛ్ఛాపురం(శ్రీకాకుళం), ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలలో రూ. 6,17,585.19 కోట్లు చంద్రబాబు, మంత్రులు, తెలుగుదేశం పార్టీ నాయకులు దోచుకున్నారని, ఈ విషయాన్ని ప్రజలకు పార్టీశ్రేణులు విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేత జగన్మోహనరెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్పయాత్ర శ్రీకాకుళం జిల్లాలో 33వ రోజు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జరిగింది. సోంపేట, కంచిలి మండలాలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఆదివారం ఉదయం లక్కవరం అడ్డురోడ్డు వద్ద శిబిరం నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభించారు. అక్కడనుంచి పలాస పురం, జింకిభద్ర, సోంపేట, ఇసుకలపాలెం అడ్డురోడ్డు, మండవల్లి అడ్డురోడ్డు, తలతంపర వరకూ పాదయాత్ర నిర్వహించారు. ఇసుకలపాలెం వద్ద జగన్ కంచిలి మండలంలోకి ప్రవేశించగా, కంచిలి మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం వైఎస్ జగన్ 10.5 కిలోమీటర్ల ➩ 2వ పేజీలో...



బహుదా నదీ తీరాన... స్మారక స్థూపం

9న ప్రజా సంకల్ప యాత్ర ముగింపు 2 లో





కమలం కమిటీలు

ఎన్నికలకు 17 బృందాలతో ఖరారు

• రాజ్‌నాథ్ మేనిఫెస్టో, జైట్లీ ప్రచారం • దత్తాత్రేయ, రామ్‌మాధవ్‌లకు చోటు

3 లో

బాబు అడుగుల్లో ఓటమి జాడలు!

• పుత్రరత్నం కోసమే ఆరాటం • పాలనలో వైఫల్యం వల్లే అసహనం • భాజపా నేతలపై దాడులకు యత్నం • ఇది మనకు దక్కిన తొలి విజయం • కాంగ్రెస్‌తో చేయి కలిపితే మసే • బూత్ కార్యకర్తలతో మోడీ



అమరావతి, ఆంధ్రప్రభ: భరత మాత సేవలో ఉండే బీజేపీ కార్యకర్తలను ఎవరూ భయపెట్టలేరని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం అనంత పురం, కర్నూలు, నర్సారావుపేట, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాల పోలింగ్ బూత్ కార్యకర్తలతో 'మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్' అనే కార్యక్రమం ద్వారా ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీ కార్యకర్తలను, నాయకులను ఉద్దేశించి బెదిరింపులు, దాడులను చేస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు. ఎప్పుడైనా ఎవరైనా తమతమ రంగాల్లో విఫలమవుతున్నప్పుడే అసహనానికి గురవుతున్నారన్నారు. ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు కూడా పరిపాలనలో విఫలమవడం మూలంగానే అసహనానికి గురై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇది ➩ 2వ పేజీలో...

బాబు అస్త్రాలకు మోడీ శస్త్రాలు

• కేడర్‌లో స్థైర్యం నింపేందుకు వ్యూహాలు • రాబోయే 3 నెలల్లో 25 భేటీలకు కార్యాచరణ • శ్వేతపత్రాల్లో ఆరోపణలకు జవాబులు రెడీ • కేంద్రం ఇచ్చిన నిధులపైనా వివరణ • మరోవైపు నమో యాప్‌తో నేరుగా సంభాషణ

2 లో



కాంగ్రెస్ కోట... నాలుగు స్తంభాలాట!

బరిలో సరి



• నందికొట్కూరులో చతుర్ముఖ పోటీ • పట్టు కోసం వైకాపా • వర్గ పోరుతో తెదేపా • పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఉబలాటం • అభ్యర్థి వేటలో జనసేన

3 లో





2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ఓట్లు 28.3 కోట్లు

• పోలింగ్‌కు దూరంగా ఉన్న ఓటర్ల సంఖ్య 28 కోట్లు • వలసలు, పట్టణ ప్రాంత ఓటర్ల నిర్లక్ష్యమే కారణం

నిండు ప్రజాస్వామ్యం... సగం తీర్పు!

నాలుగో వంతు ఓట్లతోనే కొలువుదీరుతున్న ప్రభుత్వాలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోకెల్లా అతిపెద్ద, శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశం మనది. 120 కోట్ల మంది జనాభాలో 83.4 కోట్ల మంది ఓటు హక్కు కలిగివున్నారు. దేశ అభివృద్ధికి, భద్రతకు, పౌరుల శ్రేయస్సుకు పాటుపడే సమర్ధవంతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకునే బాధ్యత వీరిదే. కానీ, వేర్వేరు కారణాలతో మూడింట ఒకవంతు వయోజనులు ఓటుకు దూరంగా ఉండిపోతున్నారు. మొత్తం ఓట్లలో వీరిసంఖ్య దాదాపు 28 కోట్లు. మిగతా రెండొంతుల ఓటర్లలో కొందరు జాతీయపార్టీలైన, కాంగ్రెస్, బీజేపీవైపు నిలుస్తుండగా, మిగతావారు ఇతర ➩ 5వ పేజీలో...



కమలనాథుల పన్నాగాలు పారవ్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం కేంద్రం చేస్తుందని ఆరోపించారు. కోడి కత్తి పార్టీ, టీఆర్ఎస్, మోడీ ఒక్కటేనని, వీరంతా రాష్ట్రంపై దాడికి ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతి దానికి ఏదో ఒక అడ్డంకి సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. చివరికి తన దావోస్ పర్యటనను సైతం రాజకీయం చేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఒక ముఖ్యమంత్రిగా పెట్టుబడులను ఆహ్వానించడానికి విదేశీ పర్యటన చేయడం తప్పా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రధాని మోడీ చెబుతున్న కో-ఆపరేటీవ్ ఫెడరలిజం అని దుయ్యబట్టారు. పెత్తందారీ విధానానికి తాము ఎప్పుడూ వ్యతిరేకమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. తప్పుడు వ్యక్తులు, తప్పుడు విధానాలతో రాష్ట్రాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని, అయితే వారి ఆటలు రాష్ట్ర ప్రజల ముందు సాగవన్నారు. రాష్ట్రాన్ని కరవు రహితంగా తీర్చిదిద్దేందుకు మహా సంగమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఐదు నదులను అనుసంధానం చేయడంతోపాటు పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి కరవును తరిమికొడతామని చెప్పారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే కృష్ణా జిల్లాలో ప్రతి ఏకరానికి నీరందుతుందన్నారు.

ప్రతి ఇంటికి స్మార్ట్‌ఫోన్

తర్వలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఒక స్మార్ట్‌ఫోన్‌ను అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రజలంతా టెక్నాలజీ సాయంతో ఇంటి నుంచే అన్ని సౌకర్యాలు, అవసరమైన పత్రాలు ఆన్‌లైన్‌లో పొందేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గతంలో పనులకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరుగుతూ ఉండే పరిస్థితితో పాటు అధికారుల నుంచి చీదరింపులను ఎదుర్కొనేవారని, ఇప్పుడు తమ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు.

లక్ష పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం

కృష్ణా జిల్లాలో లక్ష పేద కుటుంబాలకు లక్ష పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో పేదలందరికీ సొంత ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి పేదవాడు సొంతింటి కలను సాకారం చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అదే విధంగా ప్రతి ఇంటికీ కుళ్ళాయి అమరుస్తామని చెప్పారు. మరో వైపు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అన్న క్యాంటిన్ల ద్వారా పేదలందరికి నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలుష్యాన్ని పూర్తిగా అరికట్టేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువస్తున్నామని తెలిపారు. కృష్ణా జిల్లా తలసరి ఆదాయంతో పాటు మిగిలిన అన్ని విభాగాల్లో అగ్రప్రధాన ఉందని, బందర్ పోర్ట్, అమరావతి నిర్మాణం పూర్తి అయితే ఇంకా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనాడు పోలవరం నిర్మాణం ఆలస్యం అవుతుందన్న ఆలోచనతో పట్టిసీమను తీసుకు వచ్చామని, ఈ ప్రాజెక్టు వల్ల మూడేళ్ళలో రూ.45 వేల కోట్ల ఆదాయం రైతులకు సమకూరిందన్నారు. కాల్వగట్లపై ఇళ్ళు నిర్మించుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ అంశంలో వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. వారు కోరుకున్న ప్రదేశంలో ఇళ్లు నిర్మించి కేటాయించిన తరువాతే ఖాళీ చేపిస్తామని అప్పటివరకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణా జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎంపి కొనకళ్ళ నారాయణ, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు, వై.వి.బి.రాజేంద్రప్రసాద్, కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గద్దె అనురాధ, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిన్నీస్ బుక్‌లోకి పోలవరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు గిన్నీస్ రికార్డులోకి ఎక్కనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 24 గంటల్లో 28 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులను పూర్తిచేసి ఈ రికార్డును నెలకొల్పనున్నట్లు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా ఇంత తక్కువ సమయంలో కాంక్రీట్ పనులు సాగిన దాఖలాలు లేవన్నారు.



బాబు అస్త్రాలకు మోడీ శస్త్రాలు

● కేడర్‌లో స్థైర్యం నింపేందుకు వ్యూహాలు ● రాబోయే 3 నెలల్లో 25 భేటీలకు కార్యాచరణ ● శ్వేతపత్రాలలో ఆరోపణలకు జవాబులు రెడీ ● కేంద్రం ఇచ్చిన నిధులపైనా వివరణ ● మరోవైపు నమో యాప్‌తో నేరుగా సంభాషణ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో ఏపీలో బీజేపీని బలోపేతం చేయడంపై స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక సభలు, సమావేశాల ద్వారా పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపడంతోపాటు ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా వారిని కార్యోన్ముఖులను చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీపైన, ప్రధాని మోడీపైన చేస్తున్న విమర్శలపై ఆ పార్టీ నేతలు పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు. దీనికితోడు బీజేపీ అధిష్టానం కూడా ముఖ్యమంత్రి ఆరోపణలను పెద్దగా పట్టించుకోకపోవడం, సరైన సమాధానం చెప్పకపోవడం వంటి కారణాలతో ఆ పార్టీ కేడర్‌లో కొంత నైరాశ్యం నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్వయంగా ప్రధాని మోడీ రంగంలోకి దిగనుండటంతో మంచి స్పందన లభిస్తుందని ఆ పార్టీ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. మరో ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలకు స్వయంగా ప్రధానమంత్రే సమాధానం చెప్పేందుకు సిద్ధపడటంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం రానుందని ఆపార్టీ సీనియర్లు చెబుతున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏమేమి చేసిందో ప్రధానే స్వయంగా వివరిస్తారని వారు చెబుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలతో 90 రోజుల్లో కనీసం 25 సమావేశాల్లో పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పటికే జనవరి 6న ఒకసారి ప్రధాని కార్యకర్తలతో నమో యాప్ ద్వారా మాట్లాడిన సంగతి పాఠక విదితమే. ఈ నేపథ్యంలోనే ఆదివారం కూడా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల ప్రజలతో ప్రధాని నేరుగా మాట్లాడారు. ఇందులో ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అవినీతి, అక్రమాలను ఎండగట్టేందుకు ప్రధాని ప్రాధాన్యతనిచ్చారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఏవిధంగా దుబారా చేసిందో కూడా ప్రధాని వివరించనున్నారు. దీనికితోడు కాంగ్రెస్ పార్టీతో అనైతిక పొత్తుపైనా ప్రధాని కార్యకర్తలకు వివరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం అనంతపురం, కడప పార్లమెంట్ స్థానాల పరిధిలోని బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాలకు బీజేపీ కూడా విస్తృతమైన ప్రచారం కల్పిస్తోంది. తెలుగుదేశం పార్టీతో పొత్తు లేకున్నా తమ బలమేమిటో నిరూపించుకునేందుకు ఇదో చక్కటి అవకాశంగా వారు చెబుతున్నారు. అయితే, కేంద్రం నుండి తీసుకోవాల్సిన అన్నింటినీ తీసుకుని మోసం చేశారని చెబుతూ నిర్వహిస్తున్న ధర్మ పోరాట దీక్షలు అన్యాయమన్న భావన ఇప్పటికే బీజేపీ నాయకత్వం వ్యక్తం చేసింది. దీనికితోడు కేంద్రం అన్యాయం చేసిందంటూ ఆందోళనలు చేపడుతున్న చంద్రబాబు, గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రధాని మోడీని టార్గెట్‌గా చేసుకుని నిండు సభలో చంద్రబాబు చేసిన ప్రకటనలపై కూడా ఈ సమావేశాల సందర్భంగా చర్చించడం జరిగిందని బీజేపీ నేతలు చెప్పుకొస్తున్నారు. వాస్తవానికి జనవరి 6న ప్రధాని పర్యటన జరగాల్సి ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో అది వాయిదా పడింది. ఈ సమావేశాల నిర్వహణ కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు ఉపయోగపడుతుందని ఆ పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. అంతేకాకుండా 90 రోజుల్లో వివిధ సమావేశాల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి కేంద్ర నిధులను దుర్వినియోగం చేసి విడుదల చేసిన శ్వేతపత్రాలపై తాము ప్రతి పంచాయతీలోనూ వాటికి సమాధానం చెప్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని వివిధ ప్రచార మాధ్యమాల్లో కూడా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై చేసిన నిరాధారమైన ఆరోపణలపై ఈ 90 రోజుల కార్యాచరణలో వాటన్నింటికీ సరైన సమాధానం చెబుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ అంశంలో తాము గ్రామస్థాయికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా రాష్ట్రానికి ఎంతెంత నిధులను సమకూర్చింది, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా దుర్వినియోగం చేసింది అనే అంశాలను తీవ్రస్థాయిలో ప్రజలతో మమేకమై చర్చిస్తామన్నారు. ఈ విధానం కచ్చితంగా ఏపీలో పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ప్యాకేజీ అంగీకరించిన విధానం, పెద్ద నోట్ల రద్దును ఆయన స్వాగతించి ఆ తరువాత ఫిరాయించిన అంశం, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణంలో ఆయన చేసిన తాత్సారం, రాజధానిలో శాశ్వత భవనాల స్థానంలో తాత్కాలిక భవనాలు నిర్మించిన తీరు, హైకోర్టు ఏపీకి వచ్చిన తీరు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ఈ సమావేశాల్లో కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పురంధేశ్వరి అంశంపై చర్చ

కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి బీజేపీని వీడనున్నట్లు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. త్వరలోనే ఆమె వైకాపా తీర్థం పుచ్చుకునేందుకు అవకాశాలున్నాయని కూడా ఇదే సమయంలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కాగా, ఆమె సన్నిహిత వర్గాలు మాత్రం ఒకవేళ రాజకీయాల నుండి రిటైర్ అవ్వడమే తప్ప వేరే పార్టీలో చేరే అవకాశం ఏమాత్రం లేదని కొట్టిపారేస్తున్నారు. అయితే ఆమె బీజేపీని వీడటానికి ప్రస్తుతం ఏపీలో బీజేపీ అంత బలంగా లేకపోవడం, 25 పార్లమెంటు, 175 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులే లేకపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. దీనితోడు ప్రస్తుత ఎన్నికలు డబ్బుతో ముడిపడి ఉన్నందున ఆమె ఈసారి పోటీకి అంత ఆసక్తి కనబర్చడం లేదని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అయితే, అలాంటిదేమీ లేదని తాను బీజేపీలోనే ఉంటానని కూడా ఆమె స్పష్టం చేస్తున్నారు. 2014లో పార్టీ తరఫున రాజంపేట నుండి పోటీ చేయడంతో అది మరికొంత మంది ప్రస్తావిస్తున్నారు. కేవలం ఆమె పార్టీ మారే ఉద్దేశంతో ఉన్నందునే ఆమె ఈ విషయం బయటకు పొక్కకుండా ఈ విధంగా వ్యవహరిస్తున్నారని మరికొందరు చెబుతున్నారు. ఇదిలావుండగా ఆమె కుమారుడు దగ్గుబాటి హితేష్ రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. ఇది కూడా ఆమె నిర్ణయానికి ఒక కారణంగా కొంత మంది చెబుతున్నారు. ప్రకాశం జిల్లాలోని పర్చూరు నియోజకవర్గం నుండి ఏదో ఒక రాజకీయ పార్టీ నుండి హితేష్ పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నట్లు తెలుస్తోంది. పర్చూరు నియోజకవర్గం గతంలో ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావడంతో హితేష్ ఆ నియోజకవర్గం సెంటిమెంట్‌గా ఎంచుకున్నట్లు తెలిసింది.

ఓటమి జాడలు!

(మొదటి పేజీ తరువాయి)

మన తొలివిజయంగా భావించాలని సూచించారు. అయినా, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ కార్యకర్తలను ఎవరూ బెదిరించలేరని స్పష్టంచేశారు. ఎందుకంటే బీజేపీ కార్యకర్తలంతా దేశం కోసమే జీవిస్తున్నారని అన్నారు. వారి త్యాగాలు ప్రజలకు సుపరిచితమేనన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులను ఐనా వెన్ను చూపకుండా ఎదుర్కొనే శక్తి బీజేపీ నేతలకు, కార్యకర్తలకు ఉందని అన్నారు. కేరళకు చెందిన ఎంపీ మురళీధరన్ ఇంటిపై బాంబులతో దాడి చేశారని, ఐనప్పటికీ ఆయన ఈరోజున మనందరితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఉదావారణగా చెప్పారు. త్రిపురలో జీరో స్థాయి నుండి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే స్థాయికి ఎదిగామన్నారు. అక్కడ కమ్యునిష్టుల కబంధ హస్తాల నుండి ప్రజలను కాపాడేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలను ప్రజలు గుర్తించారన్నారు. అలానే ఏపీలో కూడా చరిత్ర పునరావృతం అవుతుందని, అందుకు బీజేపీ కార్యకర్తలు ధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు.

ఏపీలో ముఖ్యమత్రి చంద్రబాబు ప్రజలకోసం పనిచేయడం లేదని కేవలం తన కుమారుడు భవిష్యత్తుకోసం మాత్రమే పనిచేస్తున్నారంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడుకి పదవులిచ్చి ఎదుగుదల చేసుకున్నారని మండిపడ్డారు. కానీ బీజేపీ ఇటువంటి వాటిని సమర్థవంతంగా తిప్పికొడుతుందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్దే బీజేపీ విధానమన్నారు. భారత పార్లమెంటులో 60 శాతం మేర వెనుకబడిన, దళిత కులాకు చెందిన సభ్యులున్నారన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ నిరుపేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల పక్షానే నిలబడుతుందని చెప్పారు. ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అంటే పేదలు, బలహీన వర్గాలకు కృషి చేయడమేనని పేర్కొంటూ అది ఏపీ ముఖ్యమంత్రి దగ్గర కనిపించడం లేదన్నారు.

తక్కువ అంచనా వేయొద్దు

రాష్ట్రంలోని శాంతి భద్రతలు, కాకినాడలో బీజేపీ మహిళా కార్యకర్తపై సీఎం దురుసు ప్రవర్తనను గుర్తుచేస్తున్నాయని మోడీ తెలిపారు. కేరళలో కూడా బీజేపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని గుర్తుచేశారు. మళ్లీ మళ్లీ చెబుతున్నా..బీజేపీ కార్యకర్తలను తక్కువ అంచనా వేయవద్దని అంటూ తెలుగుదేశం పార్టీకి హెచ్చరికలు జారీ చేశారు. ఒక్కసారి బీజేపీ కార్యకర్త తలచుకుంటే గెలుపును ఆపటం ఎవరితరం కాదంటూ కార్యకర్తలను ఉత్తేజపరిచారు. పోలీసుల లాఠీలు, రాజకీయ విషయాలు బీజేపీ కార్యకర్తలను ఏ పరిస్థితుల్లోనూ ఏమీ చేయలేవని గుర్తుంచుకోవాలన్నారు. ఎప్పుడైతే దాడులకు దిగుతున్నారో అప్పుడే మనమంటే వారికి భయమనే అంశాన్ని మనం గుర్తుంచుకోవాలని స్పష్టంచేశారు. బీజేపీ కార్యకర్తలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం ఎప్పుడూ పనిచేయలేదన్నారు.

కానీ, ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిల్లో లేరన్నారు. రాష్ట్రంలో కుల రాజకీయాలు, అవినీతిని అంతమొందించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టి కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని ప్రధాని కోరారు. కేంద్రం నుండి డబ్బులు నేరుగా జిల్లాలకే వస్తున్నాయని స్పష్టంచేశారు. కానీ, ఏపీ ప్రభుత్వం ఏం చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుండి అధిక నిధులిచ్చామన్నారు. నిధులు ఇచ్చామేతప్ప వాటిని వాడారా అని కూడా తామెప్పుడూ రాష్ట్రప్రభుత్వాన్ని అడగలేదని తెలిపారు. ఇతర వేరే వాటికి ఖర్చు చేసినా వాటికి బిల్లులు సమర్పిస్తే వాటికి కూడా నిధులిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించే బాధ్యత బీజేపీ శ్రేణులదేనని పేర్కొన్నారు.

పాత్రికేయ వృత్తి ఎంతో గౌరవమైనదన్నారు. నిత్యం మనం నిర్వహించే మీడియా సమావేశాల్లో మన ఫోటోలకంటే ప్రజల సమస్యను ఎత్తిచూపడానికే ప్రాధాన్యమివ్వాలన్నారు.

20 వేల కోట్లు పంచేశారు?

రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ పార్టీతో తెలుగుదేశం పార్టీ చేతులు కలపడంవల్ల తెలంగాణలో ఏమి జరిగిందో అదే ఆంధ్రప్రదేశ్‌లో కూడా జరగబోతుందని మోడీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం కృషిచేస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా పది జాతీయ సంస్థలను ఏపీలో కేంద్రం ఏర్పాటుచేసిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతోందో తనకు తెలుసన్నారు. రాష్ట్రానికి తగిన సాయం అందిస్తున్నా చేయడంలేదని చెప్పడం తగదన్నారు. ఈ వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టేలా బూత్ స్థాయి నుండి ప్రజలకు వివరించాలని కోరారు. రెవెన్యూ లోటు, వనరుల కొరతను అధిగమించేందుకు రూ. 20 వేల కోట్ల వరకు కేంద్రంనిధులు విడుదల చేసిందన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అందలేదని చెబుతోందన్నారు. ఈ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్లిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన జిల్లాలఅభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు కేంద్రం ఇచ్చినట్లు చెప్పారు. వీటికి తగినట్లుగా వినియోగ ధృవపత్రాల (యూసీ)ను ఎందుకు ఇవ్వలేని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటివరకూ కేంద్రం రూ. 7 వేల కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఏపీ సక్రమంగా నిర్వహించలేకపోతున్నట్లు కాగ్ పేర్కొన్న అంశాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

జనవరి 9 అద్భుతాలకు నాంది!

● రామాయపట్నంలో పోర్టు శంకుస్థాపన ● విపక్షనేత రికార్డు స్థాయి పాదయాత్ర ముగింపు

అమరావతి,ఆంధ్రప్రభ: నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలో ఈనెల9వ తేదీ పలు అద్భుత ఘట్టాలు అవిష్కృతం కానున్నాయి. రాష్ట్రంలో కియోను మించిన భారీ పరిశ్రమ ఏర్పాటుతోపాటు ప్రకాశం జిల్లా కలలు కన్న రామాయపట్నం పోర్టు సాకారం కానుంది. వీటి ఆవిష్కరణతో ప్రకాశం జిల్లా రూపురేఖలే మారనున్నాయి. అదేరోజు విపక్షనేత చేపట్టిన సుధీర్ఘ పాదయాత్ర కూడా ముగియనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశంలోనే పెద్ద విదేశీ పెట్టుబడి అయిన కియో మోటార్స్ తరువాత ఇదే రెండో అతిపెద్ద పరిశ్రమ. రాష్ట్రానికి తలమానికంగా భావిస్తున్న ఆసియా పల్ప్ అండ్ పేపర్ పరిశ్రమ ఏర్పాటుకు ముందడుగు పడింది. ప్రకాశం జిల్లాలో భారీ కాగితపు పరిశ్రమను ఈ కంపెనీ ఏర్పాటుచేయనుంది. ఈనెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి - మా ఊరు కార్యక్రమం సందర్భంగా రామాయపట్నం సమీపంలో కాగితపు పరిశ్రమకు భూమి పూజ చేయనున్నారు.తొలిదశలో ఆసియా పల్ప్ అండ్ పేపర్ ఇండస్ట్రీ 28 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనుంది. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 15 వేల మందికి ఉపాధి కలుగనుంది. తాజాగా కాగితపు పరిశ్రమ ఏర్పాటుతో రైతుల్లో ఆశలు చిగురించాయి. సరుగుడు, సుబాబుల్ తోటలు పెంచేందుకు రైతులు తిరిగి ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్ర విభజన చట్టం హమీల అమలులో కేంద్రం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యంపై పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి సొంతగానే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నడుం బిగించారు. మరో కీలక అడుగు ముందుకేశారు. ప్రకాశం జిల్లాలో నిర్మించాలని భావిస్తున్న రామాయపట్నం ఓడరేవుకు కేంద్రం సహకరించకపోయినా స్వశక్తితోనే ఈ పోర్టును నిర్మించాలని సంకల్పించి జనవరి 9న శంకుస్థాపన చేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. రామాయపట్నం పోర్టు లాభనష్టాలపై మెసర్స్ రైట్స్ సంస్థ అధ్యాయనం చేసి లాభదాయకమేనని నివేదిక ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కేంద్రానికి పంపింది. నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి రాష్ట్రం అనేకమార్లు విజ్ఞప్తి చేసింది. రామాయపట్నం పోర్టు సమగ్ర నివేదిక తయారీని ప్రభుత్వం కాకినాడ పోర్టు డైరెక్టరేట్‌కు అప్పగించింది. అదేసమయంలో పోర్టుకు అవసరమైన వనరులు, నిధులు సమకూర్చే బాధ్యతను ఏపి మారిటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపి ఎంఐడిసిఎల్)కు అప్పగించారు. ఏపి ఎంఐడిసిఎల్ నిర్వహణ కోసం ప్రభుత్వం వంద కోట్లు కేటాయించింది.

ఓవైపు రాష్ట్రాభివృద్ధికి భారీ పరిశ్రమ, రామాయపట్నం పోర్టు ఏర్పాటుకు శ్రీకారం చుట్టనుండగా మరోవైపు రాజకీయ రంగంలో కూడా జనవరి 9కి ప్రాధాన్యత నెలకొంది. విపక్ష పార్టీ వైకాపా అధినేత జగన్ చేపడుతున్న ప్రజాసంకల్పయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుండటం విశేషం.

రూ.45 కోట్లతో కన్యకాపరమేశ్వరీ ఆలయ అభివృద్ధి

● 90 అడుగుల పంచలోహ విగ్రహం: మాజీ సీఎం రోశయ్య

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పశ్చిమ గోదావరిజిల్లాలోని పెనుగొండ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని రూ.45కోట్లతో అభివృద్ధి పరుస్తున్నట్టు మాజీ ముఖ్యమంత్రి , తమిళనాడు మాజీ గవర్నర్ కె.రోశయ్య తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రోశయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 90 అడుగుల అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విగ్రహ నిర్మాణానికే రూ.15కోట్లు వ్యయం కానుందన్నారు. అంతేకాకుండా 4వందల కిలోలతో అమ్మవారికి వెండి రథాన్ని కూడా నిర్మిస్తున్నట్టు తెలిపారు. పెనుగొండ కన్యకాపరమేశ్వరి అమ్మవారి అలయంలో ఆద్యాత్మిక కార్యక్రమాలే కాకుండా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు కూడా చేపట్టినట్టు తెలిపారు. అన్నికులాల వారికి ఇక్కడ అన్నదాన సత్రం, ఆస్పత్రిలో వైద్యసేవలు, వివాహాలకు మంగళ సూత్రాలు నూతనవస్త్రాలు అందించటం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే వాసవీ విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు కానుందని వెల్లడించారు. ఫిబ్రవరి14న అమ్మవారి పంచ కలశ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాష్ట్రాల నుంచి కూడా వైశ్యులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రోశయ్య విజ్ఞప్తి చేశారు. అఖిలభారత శ్రీవాసవి పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షులు డా.పి.ఎన్, గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి కె.ఆర్.కృష్ణ సతీష్ మూర్తి తదితరులు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు , కర్ణాటక సీఎం కుమారస్వామిగౌడ, మాజీ పీఎం దేవేగౌడ, తదితరులను ఆహ్వానించినట్టు తెలిపారు. 55కిలోల పంచలోహంతో 90అడుగుల ఎత్తున నిర్మిస్తున్న అమ్మవారి విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. ఫిబ్రవరి 11నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 16న వసంతోత్సవం వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు.



బాబు అవినీతి 6 లక్షల కోట్లు!



(మొదటి పేజీ తరువాయి)

మేర పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు వైకాపా నాయకులు చంద్రబాబు పాలనపై రూపొందించిన అవినీతి చక్రవర్తి (ఎంపరర్ ఆఫ్ కరప్షన్) పుస్తకాన్ని లక్కవరం శిబిరంలో జగన్మోహనరెడ్డి ఆవిష్కరించారు. గతసంవత్సరం నవంబర్ 30వ తేదీవకూ రాష్ట్రంలో 6.17 లక్షల కోట్ల రూపాయిలు అవినీతి జరిగిందంటూ, పూర్తి వివరాలను ఆపుస్తకంలో వైకాపా నాయకులు పొందుపరచారు. నాలుగున్నర సంవత్సరాలలో ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు, నిధులు విడుదల, వాటి వినియోగం, ప్రాజక్టుల అంచనాలు, రాజధాని భూసేకరణలో రియల్ దందాలు, రాజధాని తాత్కాలిక నిర్మాణాలలో అవినీతితో సహా అన్ని అంశాలను అవినీతి చక్రవర్తి పుస్తకంలో తెలియచేశారు. ఈసందర్భంగా జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ, ఈపుస్తకాన్ని సాధ్యమైనంత వరకూ ప్రజల్లోకి తీసుకుపోవాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా టిడిపి నాయకులుచేసిన దోపిడీని ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు దేనినీ వదలకుండా అన్నీ దోచుకున్నారని, వారి అవినీతి వల్ల రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందని జగన్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తమ్మినేని సీతారామ్, భూమన కరుణాకరరెడ్డి, పాలకొండ ఎంఎల్ఎ వి.కళావతి, మాజీ ఎంఎల్ఎ బి.అప్పల నాయుడు, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ శ్రీనివాసరావు, ఇఛ్చాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియాసాయిరాజ్, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి శాంతి తదితరులు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైసీపీలో పలువురు చేరిక....

పలాసపురం మీదుగా జింకిభద్ర అడ్డురోడ్డుకు జగన్ చేరుకున్న సమయంలో ఎల్ఎన్ పేట మండలానికి చెందిన మాజీ ఎంపీపీ శ్రీదేవి, సాంబశివరావుతో పాటు దాదాపు 500 మందివైకాపాలో జగన్ సమక్షంలో చేరారు. అనంతరం సోంపేట చేరుకున్న జగన్‌కు వైకాపా నాయకులు ఘనస్వాగతం పలికారు. సోంపేలో కూడా పలువురు తితిలీ తుపాన్ బాధితులు జగన్‌ను కలిసి తాము తుపాన్ కారణంగా ఎంతగానో నష్టపోయామని, అయినప్పటికీ తమకు పరిహారం ఇవ్వలేదని జగన్‌కు తెలిపారు. గ్రామాలలో జన్మభూమి కమిటీలు ప్రతి పనికీ లంచం అడుగుతున్నాయని వారు జగన్‌కు తెలిపారు. గ్రామంలోఎటువంటి అభివృద్ధి పనులు కూడా చేపట్టడంలేదని వారు వివరించారు. వైకాపా నాయకు జగన్ రాక సందర్భంగా సోంపేట పట్టణాన్ని పూర్తిగా బెలూన్లతో అలంకరించారు. జగన్‌నుపలువురు మత్స్యకార మహిళలు కలిసి వారిసమస్యలు తెలియచేశారు. చేపలు ఎండబెట్టుకునేందుకు ఓపెన్ బేస్‌మెంట్ కావాలని, తమకు ఇళ్లుకేటాయించాలని జగన్‌ను వారుకోరారు. ఎన్నో సంవత్సరాలుగా తాము కోరుకుంటున్న పెద్దబేలా రిజర్వార్ నిర్మాణ పూర్తిచేయాలని జగన్‌ను సోంపేట రైతులు కలిసి విజ్ఞపి చేశారు. ఈ రిజర్వాయర్ నిర్మిస్తే 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వారు జగన్‌కు తెలిపారు. తలతంపరలో బెంతు ఒరియాలు జగన్‌ను కలిసి ఈ ప్రాంతంలో పెద్దసంఖ్యలో ఉన్న తమకు కుల ధృవీకరణపత్రాలు ఇవ్వడంలేదని, దీనివల్ల విద్య,ఉద్యోగ రంగాలలో అవకాశం కోల్పోతున్నామని వారు జగన్‌కు తెలిపారు. మాణిక్యపురం వద్ద జగన్ పాదయాత్ర ముగించారు.. జగన్ పాదయాత్రలో కంచిలి, సోంపేట మండలాల వైకాపా కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎప్పటి మాదిరిగానే జగన్ పాదయాత్రంలో పలువర్గాల ప్రజలుసమస్యలు తెలియచేయడంతో పాటు యువకులు, మహిళలు జగన్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. జగన్ కూడా వారితో సెల్ఫీలు తీసుకున్నారు. పలువురు మహిళలు వారి పిల్లలను జగన్‌వద్దకు తీసుకువచ్చి వారిని ఆశీర్వదించమని కోరారు.

బహుదా నదీ తీరాన భారీ స్మారక స్థూపం

● పూర్తికావస్తున్న నిర్మాణ పనులు ● 9న ప్రజా సంకల్ప యాత్ర ముగింపు ● వైఎస్ జగన్‌చే పైలాన్ ఆవిష్కరణ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక ప్రజాసంకల్ప యాత్రకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనంగా ముగింపు చెప్పబోతుంది. పాదయాత్ర సంకల్పాన్ని చాటిచెప్పేలా చిరస్థాయిగా నిలిచిపోయేలా స్థూపాన్ని యుద్ధప్రాతిపదికన పార్టీ పూర్తిచేస్తోంది. పాదయాత్ర స్ఫూర్తిని, ప్రజలకిచ్చిన భరోసాలను గుర్తుచేస్తూ ఈ నిర్మాణం చేపడుతున్నారు. ఈనెల 9న పాదయాత్ర ముగింపు సందర్భంగా శరవేగంగా పనులు పూర్తవుతున్నాయి. శ్రీకాకుళం నుండి ఇచ్ఛాపురం వెళ్తున్న మార్గంలో జాతీయ రహదారికి ఆనుకుని ఎడమవైపున, అటువైపు బరంపురం నుండి వస్తున్నప్పుడు కుడివైపున 'బహుదానది' తీరాన ఈ స్థూపం నిర్మితమవుతుంది.

ఇచ్ఛాపురం పట్టణానికి 2 కి.మీ. ముందే ఈస్థూపం కనిపిస్తుంది. పాదయాత్ర చివరి రోజున వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ స్థూపాన్ని ఆవిష్కరించనున్నారు. వైయస్ రాజశేఖర రెడ్డి నిర్వహించిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర కూడా ఇచ్ఛాపురంలోనే ముగిసింది. దీనికి గుర్తుగా ప్రజాప్రస్థాన ప్రాంగణాన్ని నిర్మించారు. ఆతరువాత వైయస్ షర్మిల నిర్వహించిన మరో ప్రజాప్రస్థానం కూడా ఇచ్ఛాపురంలోనే ముగిసింది. దీనికి గుర్తుగా మరో స్థూపాన్ని నిర్మించారు. ఇప్పుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్ప పాదయాత్ర కూడా ఇచ్ఛాపురంలోనే ముగియనుండటం విశేషంగా మారింది.



మూడు అంతస్తుల లెక్కన, పునాది నుండి 88 అడుగుల ఎత్తులో ఈస్థూప నిర్మాణం జరుగుతోంది. పునాది నుండి స్థూపం బేస్ వరకూ 13 జిల్లాలను సూచిస్తూ 13 మెట్లను నిర్మించారు. నాలుగు పిల్లర్లపై 3 అంతస్థుల్లో స్థూపం ఉంటుంది.

మొదటి అంతస్తులో వైయస్ జగన్ పాదయాత్ర ఫోటోలను ఏర్పాటు చేస్తున్నారు. రెండో అంతస్తులో వైయస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర ఫోటోలు పెడుతున్నారు. చివరి అంతస్తు వృత్తాకార ఆకృతిలో నిర్మిం చారు. చివరి అంతస్తు డోమ్ నుండి 15 అడుగుల ఎత్తులో పార్టీ పతాకాన్ని ఏర్పాటుచేశారు. స్థూపానికి చుట్టూ ఉన్న ప్రహరీ గోడపై పాదయాత్ర విశేషాలు ఉండేలా ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.

134 నియోజకవర్గాల్లో పాదయాత్ర

పాదయాత్ర 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాల్లో జరిగింది. 341 రోజులపాటు జరిగిన ఈ పాదయాత్ర ఈనెల 9న 3,648 కి.మీ. పూర్తిచేసుకుని ఇచ్ఛాపురంలో ముగియనుంది. పాదయాత్ర 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాల్లోని 2,516 గ్రామాల్లో పూర్తికానుంది. ఈ సందర్భంగా 231 మండలాలు, 8 కార్పొరేషన్లు, 54 మునిసిపాలిటీల్లో 124 బహిరంగ సభలు నిర్వహించడంతోపాటు 55 ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు.

అధికార మార్పు అనివార్యం



(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ఓటు ద్వారా మార్పు తీసుకురావాలనుకుంటోంది..గానీ కులాల ద్వారా కాదు..ఇతర కులాల పట్ల సహనం, సంఘీభావం కలిగి ఉ ండాలి.. సమాజంలోని వ్యక్తులు అభద్రతా భావంతో గట్టిపడిపోయి ఉంటారు.. ఇటువంటి వ్యక్తులు ఉన్న సమయంలో పవర్ పాలిటిక్స్ వల్ల ఉపయోగం ఉండదు..సోషల్ ఇంజనీరింగ్ చేయాలి..అప్పుడే వారిలోని అభద్రతా భావం పోయి మన పోరాటంలో భాగంగా మారతారు.. రాజకీయాల్లో రాణించాలంటే నాయకులకు, కార్యకర్తలకు ఓపిక, సహనం అవసరం.. అవమానాలు కూడా ఎదురవుతూ ఉంటాయి. జయలలి త, మమతాబెనర్జీ లాంటి వాళ్లు ఎన్ని అవమానాలకు గురయ్యారో మనకు తెలుసు.. అటువంటి అవమానాలు తట్టుకునే శక్తి మనకు ఉండాలి.. తిట్లు, శాపనార్థాలు పెట్టే వారూ ఉంటారు.. వారిని చూసి కుంగిపోరాదు..నన్ను ఎవరు ఎన్ని తిట్టినా ముందుకు వెళ్తూనే ఉంటానన్నారు. లక్షలాది మంది జనం నా సభలకు వచ్చినా పొంగిపోను..అహంకారం మచ్చుకైనా నాలో రానివ్వను..జనసందోహాన్ని చూసి కృతజ్ఞతతో వొంగిపోతాను..సినిమాలో నటించేటప్పుడు అభిమాన సంఘాలు పెట్టలేదు.. ఎవరినీ నా సినిమా ఫంక్షన్లకు రమ్మని పిలవలేదు.. అయితే ఇప్పుడు మన ప్రాంతం కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం జనసేన పార్టీ పెట్టినందున మిమ్మలందర్నీ ఈ సమావేశాలకు ఆహ్వానించాను అని అన్నారు. భగవంతుడు నాకిచ్చిన గుర్తింపు మన రాష్ట్రానికి, దేశానికీ ఉపయోగపడితే అంతే చాలు.. మనమంతా ఒక ఆశయం కోసం పని చేస్తున్నాం.. ఆ ఆశయ సాధన కోసం త్యాగం చేయడానికి ముందు వరుసలో నేనున్నానని అన్నారు. 175 స్థానాల్లోనూ పోటీ చేస్తుందన్నారు. నాకు బలమైన విజయం కనిపిస్తోందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

మార్పుకు సమయం ఆసన్నమైంది..

చాలా మంది నీ బలం అంతా కోస్తా జిల్లాలోనే అంటూ నన్ను ఓ ప్రాంతానికి పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు..అనంత కవాతు అది నిజం కాదని రుజువు చేసిందన్నారు. గత నెల 2న జరిగిన జనసేన కవాతు చరిత్రలో మిగిలిపోతుందన్నారు. రాయలసీమలో సైతం జనసేనకు విశేష ఆదరణ ఉందని తెలియజేసిందన్నారు. అనంతపురం గొప్ప చైతన్యం ఉన్న జిల్లా. గొప్ప పేరున్న గ్రంథాలయాలతో సరస్వతీ నిలయంగా ఉన్న జిల్లాలో కాలక్రమేణా దౌర్జన్యం చేసే వారు పెరిగిపోయారు..అందరికీ అనంత పేరు చెప్పగానే ఫ్యాక్షన్ గుర్తుకు వస్తుంది..నాకు మాత్రం తరిమెల నాగిరెడ్డి గుర్తుకు వస్తారు.. అవకాశాలు లేనిచోట కసి ఉంటుంది.. ఆకలి ఉన్న చోట ఆలోచనలు ఎక్కువగా ఉంటాయి.. అటువంటి ఆలోచనలు ఎక్కువగా ఉన్న జిల్లానే మన అనంతపురం అన్నారు.

అనంతపురంలో నెలకొన్న కరవును ఒక్క రోజులో పరిష్కరించలేం..అంతా ఈ ప్రాంతాన్ని వెనుకబడిన జిల్లా అంటారు. నేనైతే రాజకీయ వెనుకబాటు తనం ఉన్న జిల్లా అంటాను.. అన్నారు. రాజకీయ వెనుకబాటు తనం వల్లే ఈ జిల్లాలో కరవు కదలకుండా మిగిలిపోయిందన్నారు. నీరే లేని ఇజ్రాయిల్ దేశం గొప్ప ఆలోచనలతో పుష్కలంగా పంటలు పండిస్తున్నప్పుడు అనంతలో మనం ఆ ప్రయోగం ఎందుకు చేయలేం పాలకులకు సంకల్పం లేకే దీనిపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఇవ్వడం అనే లక్షణం ప్రకృతిదయితే తీసుకోవడం మనిషి లక్షణంగా మారిపోయిందన్నారు.

అమరావతి, ఆంధ్రప్రభ: గెలవాలి అనే ఉద్దేశంతో పాలిటిక్స్‌లోకి రాలేదు.. వ్యవస్థను మార్చాలి అన్న ఉద్ధేశంతో పార్టీ పెట్టాను.. పార్టీ ఏర్పాటు చేసే సమయంలో పెద్దపెద్ద మేధావులు వస్తారన్న నమ్మకం పెట్టుకోలేదు.. కేవలం యువతను నమ్మాను.. యువత బాధలే..నా బాధలు..వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. అనంత, విజయ నగరం జిల్లాల సమీక్షలో ఆయన మాట్లాడుతూ, వ్యక్తి ఆధారిత పార్టీలైన తెదేపా, వైకాపాలు గెలుపు నమ్మకాన్ని కోల్పోయాయని అన్నారు. వ్యక్తి ఆధారిత పార్టీలు ఏదో ఒక రోజున దెబ్బతినక మానవు..

వైకాపా, తెదేపాలకు గెలుపుపై నమ్మకం లేదు

- వ్యక్తి ఆధారిత పార్టీలు దెబ్బతినక తప్పదు
- భావజాలంతో ఏర్పడిన పార్టీ జనసేన

బలీయమైన భావజాలంతో ఏర్పాటైన పార్టీలు చిరకాలం మిగిలిపోతాయన్నారు. అలాంటి పార్టీ జనసేన పార్టీ అన్నారు. అనంత ప్రజలు,యువత మార్పును బలంగా కోరుకుంటున్నారు..మార్పు వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. అవినీతి పార్టీలతో చేతులు కలపను అంటే కొందరు ఎక్కడ లేదు అవినీతి అని ప్రశ్నిస్తున్నారు..నేను మాత్రం అవినీతి రహిత రాజకీయాలే చేస్తానని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు.

పోలవరం నవయుగ రికార్డు

- 13 గంటల్లో 17,929 క్యూ.మీ.ల కాంక్రీట్
- గంటకు 1,380 క్యూ.మీ.లు
- చెమటోడుస్తున్న వేలాది మంది ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు
- లక్ష్యం 28 వేల క్యూ.మీ.లు



అమరావతి, ఆంధ్రప్రభ: దేశానికే గర్వకారణమైన బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టు ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కబోతున్న శుభగడియలు సమీపించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ స్వప్నాన్ని సాకారం చేయబోతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో అరుదైన ప్రపంచ రికార్డు ఆవిష్కరణకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కాంక్రీట్ పనుల్లో జాతీయ రికార్డు సృష్టించిన పోలవరం ప్రాజెక్టులో ప్రపంచ రికార్డు నమోదు చేసేందుకు ఆదివారం తెరతీశారు. ఇందుకు సంబంధించిన పనులను గిన్నిస్ బుక్ వరల్డ్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 8 గంటలకు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ పనులు సోమవారం ఉదయం 8 గంటల వరకు ఏకధాటిగా జరగనున్నాయి. భారీ యంత్రాలుతో కాంక్రీట్ వేసే పనులను ఆరంభించారు. ఈ క్రమంలో ఉదయం 8 -9 గంటల మధ్యలో 1275 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేశారు. 9-10 మధ్య 1340 క్యూబిక్ మీటర్లు, 10-11 గంటల మధ్య 1380 క్యూబిక్ మీటర్లు, 11-12 మధ్య 1420 క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ వేశారు. 5వ గంటల్లో మొత్తం 6,797 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేయడం గమనార్హం. గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించేందుకు రాష్ట్రప్రభుత్వం, కాంట్రాక్ట్ ఏజెన్సీ ఈ భారీ సవాల్‌ను స్వీకరించాయి. ఇప్పటికే 24 గంటల్లో 11,154 క్యూబిక్ మీ టర్ల కాంక్రీట్ పని చేసి, జాతీయ రికార్డును నెలకొల్పిన నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ఈసారి ఏకంగా ప్రపంచ రికార్డు సృష్టించబోతున్నదని అంతా సర్వత్రా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. ఈసారి 24 గంటల్లో 28వేలనుంచి 30వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి, గిన్నిస్ బుక్‌లోకి ఎక్కే ప్రయత్నం జరుగుతున్నది. గిన్నిస్ బుక్ ప్రతినిధి విశ్వనాథ్ ఆదివారం పనులను దగ్గరుండి పరిశీలిస్తూ నమోదు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు దుబాయ్‌లో నమోదైన రికార్డును అధిగమించేందుకు పోలవరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా 24 గంటల్లో 30వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసేందుకు కృషి చేస్తున్నామని నవయుగ కంపెనీ ఎండీ బి.శ్రీధర్ తెలపారు. కాగా స్పిల్ చానల్‌లో జరుగుతున్న ఈ పనులను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు చెందిన 24మంది నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. దుబాయ్‌లో ఒకటవర్ నిర్మాణానికి 2017 మే లో 36 గంటల్లో 21,580 ఘనపు మీటర్ల కాంక్రీట్ వేశారు. ఇప్పుడా ఆ రికార్డును పోలవరం లో అధిగమించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టులో 3 నెలలకిందట 24 గంటల్లో 11,158 ఘనపు మీటర్ల కాంక్రీట్ వేశారు. మళ్లీ గత నెలలో 11,289 ఘనపు మీటర్లకాంక్రీట్ వేసి, పాత రికార్డును అధిగమించారు. ఇప్పుడు ఏకంగా 30వేల ఘనపు మీటర్ల కాంక్రీట్ వేసి,ప్రపంచ రికార్డు సాధించేందుకు పనులు ప్రారంభించారు. ప్రతి 15 నిమిషాలకొకసారి కాంక్రీట్ ఎంత వేసింది గిన్నిస్ బుక్ ప్రతినిధులు రికార్డు చేస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి నారా చ ంద్రబాబు నాయుడు పనులను పర్యవేక్షించి,రికార్డు పనుల వివరాలను వెల్లడించనున్నారు.. సోమవారం ఉదయం 8 గంటల లోపు 28వేల క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ పనులు పూర్తి చేసి,గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాలనే ప్రయత్నం జరుగుతున్నది. ప్రపంచ రికార్డును ప్రాజెక్టు క్షేత్రంలోనే ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేశారు.

కానిస్టేబుల్ పరీక్షలు ప్రశాంతం

అమరావతి, ఆంధ్రప్రభ: కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షకు సంబంధించిన రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా పూర్తయ్యాయి. రాత పరీక్షలకు సంబంధించి మొత్తం 3 లక్షల 92 వేల785 హాల్ టికెట్లు జారీ చేశారు. అయితే రాత పరీక్షలను 3 లక్షల 46 వేల 284 మంగి రాశారు. 46 వేల 532 మంది పరీక్షలకు హాజరు కాలేదు. 88.16 శాతం మంది మాత్రమే పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 704 సెంటర్లలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్షలు జరిగాయి. 3045 వేలిముద్రల స్కానర్లు, 704 మంది ఐటి కోర్ టీమ్ సభ్యులు, 118 మంది బయోమెట్రిక్ ఇన్‌చార్జి అధికారులు, 28 మంది నోడల్ అధికారులు, వేలిముద్రల నిపుణుల విభాగం నుంచి 140 మంది అధికారులు రాత పరీక్షలకు సంబంధించి విధుల్లో పాల్గొన్నారని, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ కుమార్ విశ్వజిత్ తెలిపారు.

సీమ ప్రగతికి సరికొత్త 'రన్‌వే'

- ఓర్వకల్లు విమానాశ్రయం రెడీ
- రేపు ప్రారంభించనున్న సీఎం
- 2022 నాటికి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులతో అనుసంధానం
- సీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో విమానయానం కీలకం
- టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: విమానయాన రంగంలో పెట్టుబడులకు 2022 నాటికల్లా ఆంధ్రప్రదేశ్ తొలి గమ్యస్థానంగా మారనుందని, ఇందుకోసం పెద్ద ఎత్తున ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తద్వారా రాష్ట్రంలో 2022 నాటికి గణనీయమైన ఆర్థికాభివృద్ధితోపాటు ఉద్యోగాల కల్పన, ప్రజలకు ఆదాయం సమకూరనుందని పేర్కొన్నారు. వనరులు సమృద్ధిగా ఉన్న రాయలసీమ ప్రాంతంలో విమానాశ్రయాలను అభివృద్ధి చేయడం ద్వారా పరిశ్రమలు, ఆర్థికాభివృద్ధికి గమ్యస్థానంగా మారడం ఖాయమని సీఎం స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయం ప్రారంభాన్ని ఆ దిశగా వేస్తున్న భారీ ముందడుగుగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. చంద్రబాబు ఈనెల 8న ఓర్వకల్లు విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఈ సంద ర్భంగా ఆయన ఆదివారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విమానయాన రంగంలో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు కల్పించ డం ద్వారా 2022 నాటికి రాష్ట్రం నుండి ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ గమ్యస్థానా లకు నమ్మకమైన, నిరాటంకమైన వైమానిక అనుసంధానతను పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరకోస్తా జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనలో విమానయాన రంగానిది కీలక పాత్ర అన్నారు. విమానాశ్రయాలు అభివృద్ధికి కేంద్రాలుగా పని చేస్తాయన్నారు. రాష్ట్రం మొత్తం ఎయిర్ కనెక్టవిటీని పెంచడం ద్వారా తయారీ, పర్యాటకం, వ్యాపారాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలు వృద్ధి చెందుతాయన్నారు.

ఫలితంగా విమానాశ్రయ సమీప ప్రాంతాలు గణనీయంగా అభివృద్ధిలోకి వస్తాయని చెప్పారు. విమానయాన రంగం ఆర్థిక వృద్ధి ఫలితాలు సమాజంలో అన్ని వర్గాలకు ప్రత్యేకించి నిరుపేదలకు కూడా దక్కాలని..అదే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమ జిల్లాలను ఆధునిక, అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా మార్చడంలో ఓర్వ కల్లు విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ విమానాశ్రయం రాయలసీమకు జీవనాడిగా మారుతుందని చెప్పారు. ఈ ప్రాంతంలో విలువైన కనిజాలు, ఇతర సహజ వనరులు పుష్కలంగా ఉండటంతో ఖచ్చితంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో విజయవాడ, విశాఖపట్టణం, బెంగుళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు వెళ్లడానికి కర్నూలు జిల్లా వాసులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుందని తెలిపారు. విజయవనగరం జిల్లా భోగాపురం, నెల్లూరు జిల్లా దగదర్తిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, కుప్పంలో చిన్న విమా నాశ్రయం అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే వివిధ జిల్లా కేంద్రాల్లో హెలీప్యాడ్‌లను అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టు బడి ఉందని సీఎం మరోమారు పేర్కొన్నారు.


రాయలసీమను ఆర్థికాభివృద్ధి కేంద్రంగా మార్చ డానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలో కియామెటార్ కార్ల తయారీని ప్రారంభించిందన్నారు. ప్రతిష్ఠాత్మక కడప ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేశామని, కర్నూలు జిల్లాలో మెగా విత్తన పార్కు ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీమ ప్రాంతం నుండి కరవును పారద్రోలే లక్ష్యంతోపని చేస్తున్నామని వివరించారు.

ఇప్పటికే పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పని ప్రారంభిచామని చెప్పారు. పోతిరెడ్డి పాడు రెగ్యు లేటర్ ద్వారా కృష్ణా నీటిని రాయలసీమకు మళ్లించనున్నామ న్నారు. సాగునీటి కొరతను అధిగమించేందుకు కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

ఓర్వకల్లు విమానాశ్రయం గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు అని 1010 ఎకరాల్లో రూ. 110 కోట్ల వ్యయంతో ప్రభుత్వం దీన్ని రికార్డు స్థాయిలో 16 నెలల్లోనే పూర్తి చేసిందని ఇంధన శాఖ, ఐ అండ్ ఐ, ఏపీసీ ఆర్డీ ఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ వెల్లడించారు. ఈ విమానా శ్రయం 3సీ కేటగిరీలో ఉందని, ఏటీ ఆర్ - 72, బాంబార్డియర్ క్యూ - 400 వంటి భారీ కార్గో విమానాలను కూడా నిర్వహిం చే సామర్థ్యం ఉందని, 2 వేల మీటర్ల రన్‌వే ఉందని, విమా నాల పార్కింగ్‌కు 4 యాప్రాన్‌లు ఉన్నాయని వివరించారు.

బీజేపీవి నీచ రాజకీయాలు!

- దేశంలో అశాంతి సృష్టిస్తున్నారు
- జన్మభూమికి ప్రజాదరణ భేష్
- ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించండి
- టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: దేశంలో దుష్ట రాజకీయాలను కేంద్రంలోని అధికార బీజేపీ ప్రోత్సహిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. బిఎస్పీ, సమాజ్‌వాదీ పార్టీ నేతలు అఖిలేష్‌యాదవ్, మాయావతి సీట్ల సర్దుబాటు చేసుకుంటే ఆ మరుసటి రోజే సీబీఐని ఉసిగొలిపి పాత కేసులను తిరగతోడుతున్నా రని మండిపడ్డారు. పద్ధతి లేని రాజకీయాలకు ఎన్డీయే ప్రభుత్వం పాల్పడుతుందని దుయ్యబట్టారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లి లోని తన నివాసం నుంచి 5వ రోజు జన్మభూమి కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ బాంబు లు, దాడులు, అల్లర్లూ సృష్టిస్తూ ప్రశాంతమైన రాష్ట్రంలో అశాంతిని నెలకొల్పుతున్నారని బిజెపిపై మండిపడ్డారు. నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇవ్వకుండా ప్రజల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బి జె పి నేతలు పనులు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పనులు చేయమని అడిగినవారిపై కేసుల పేరిట బెదిరింపులకు దిగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటిని అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన పయనింప చేస్తున్నామని చెప్పారు. ధర్మం తమవైపే ఉందని, అందుకే జాతీయంగా, అంతర్జాతీయంగా అ వార్డులు రావడంతో పాటు సాను కూల ఫలితాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ ఆరో విడత జన్మభూమి కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం బాగా పెరిగిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగానికి సూచించారు. ఆదివారం కూడా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని, ఇది ఒక స్ఫూర్తిదాయక సమయం అన్నారు. సేవాధృక్పదంతో పనిచేస్తున్న ఉద్యోగులకు సంక్రాంతి పండుగకు మరో రోజు అదనంగా సెలవు ఇస్తామని ఆయన ప్రకటించారు. 4వ రోజు జన్మభూ మి - మా ఊరులో ప్రజల భాగస్వామ్యం బాగా పెరిగిందని, మండల కేంద్రాల్లో 7,18,000 మంది పాల్గొనగా

ప్రజల ఉత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గ్రామాల్లో 25,46,000 మంది పాల్గొన్నారని తెలిపారు. దాదాపు ఐదులక్షల మంది విద్యార్థులు, 40 వేల మంది ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారని వెల్లడించారు. ఇప్పటివరకు 1,38,408 అర్జీలు వచ్చాయన్నారు. తొలిరోజు కార్యక్రమంలో 20 లక్షల మంది పాల్గొంటే, 4వ రోజుకు ఆ సంఖ్య 30 లక్షలకు చేరిందన్నారు. సకాలంలో సమస్యల పరిష్కారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అమెరికా, చైనా, ఇండియాలే అగ్ర స్థానం ఉంటాయని చెప్పారు. ప్రపంచ స్థాయిలో తొలి రెండు స్థానాల్లో ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందన్న ఆశాభావాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. ప్రపంచానికి నమూ నాగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ప్రపంచం దృష్టంతా ఆంధ్రప్రదేశ్‌పైనే ఉందని, దేశానికే మార్గ దర్శకంగా నిలిచామన్నారు. ప్రజల సమస్యలను జన్మభూమి వేదికగా తెలుసుకుని వాటిని అక్కడిక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోట... నాలుగు స్తంభాలాట!

- నందికొట్కూరులో చతుర్ముఖ పోటీ
- పట్టు కోసం వైకాపా
- వర్గపోరుతో తెదేపా
- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఉబలాటం
- అభ్యర్థి వేటలో జనసేన

కర్నూలు, ప్రభ న్యూస్ బ్యూరో: ఎన్నికలకు గడువు సమీపిస్తుండంతో నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల వేటలో పడ్డాయి. వివిధ స్థాయిలో పనిచేస్తూ టికెట్ ప్రయత్నిస్తున్న ఆశావాహుల సంఖ్య నానాటికీ పెరుగుతోంతుండటంతో నందికొట్కూరు రాజకీయం చలికాలంలో మంటలు రేపుతోంది. 2009 వరకు కాంగ్రెస్, టీడీపీలే ఆధిపత్యం వహిస్తూ వచ్చినా, 2014లో అరంగ్రేటం చేసిన వైసీపీ ఇక్కడ పాగా వేసింది. ప్రస్తుతం నూతనంగా రంగ ప్రవేశం చేసి జనసేన వచ్చే ఎన్నికల్లో సత్తాచాటే ప్రయత్నంలో ఉంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కూడా ఈసారి బరిలోకి దిగే అవకాశాలున్నాయి. దీంతో చతుర్ముఖ పోటీలో విజయలక్ష్మి ఎవరిని వరించనుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

జిల్లా రాజకీయాల్లోనే నందికొట్కూరు అసెంబ్లీ నియోజక వర్గానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజక వర్గం నుంచి ప్రముఖ కమ్యూనిస్టు నేత చంద్ర పుల్లారెడ్డి పోటీచేసి గెలుపొందిన నియోజక వర్గం. అటు తర్వాత రాజకీయాల్లో చోటు చేసుకున్న పరిణామాలతో నందికొట్కూరు ముఠా కక్షలకు నిలయంగా మారింది. గతంలో ఇక్కడ ఎంఎల్ఏగా గెలిచిన మదూర్దు సుబ్బారెడ్డి ముఠా రాజకీయ చదరంగంలో తమ ప్రత్యర్థుల చేతిలో హతమవ్వగా, ఇక ఇదే నియోజక వర్గంలో గౌరు వెంకట్‌రెడ్డి జంట హత్య కేసులో ముద్దాయిగా జైలుకు వెళ్లారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హాయంలో గౌరుకు క్షమాభిక్ష ప్రసాదించడం, రాష్ట్ర వ్యాప్తంగా వీటిపై దుమారం రేగడంతో ఈ నియోజకవర్గం దేశ రాజకీయాల్లో ప్రముఖంగా నిలిచింది.

ఈ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు 14 సార్లు ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ ఎనిమిది పర్యాయాలు, తెలుగుదేశం మూడుసార్లు, సిపిఐ ఓ మారు, వైకాపా ఒకసారి గెలుపొందగా, రెండుసార్లు ఇండిపెండెంట్‌లు విజయం సాధించారు. 1972లో ఇక్కడ మదూర్ధ్ సుబ్బారెడ్డి ఏక గ్రీవంగా గెలుపొందగా, అ తర్వాత బైరెడ్డి శేషయాన రెడ్డి మూడుసార్లు గెలిచారు.. అ తర్వాత శేషయాన రెడ్డి కుమారుడైన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి టిడిపి తరుపున 1989, 1994లో గెలుపొందారు. 2004లో గౌరు వెంకట్‌రెడ్డి సతీమణి గౌరు చరిత కాంగ్రెస్ నుంచి గెలిచారు. మొత్తంగా 2004 వరకు నందికొట్కూరు నియోజకవర్గ రాజకీయ పోరులో బైరెడ్డి, గౌరు కుటుంబాల ఆదిపత్యంలో ఉండేది. 2009లో ఈ నియోజకవర్గం ఎస్సిగా మారింది. అంత వరకు ఇక్కడ అధికారం దక్కించుకున్న కాంగ్రెస్, టిడిపిలను కాదని 2014లో వైకాపా కైవసం చేసుకుంది.

వైకాపా నుంచి వలస వచ్చిన మాండ్ర శివా నందారెడ్డికి టిడిపి నియోజక వర్గ బాధ్యతలు అప్పగించడంతో మాజీ ఎంఎల్ఏ లబ్బి అలకపాన్పు పట్టారు. అంతేకాదు మాండ్ర, లబ్బిల మధ్య తీవ్ర విభేదాలు నెల కొన్నాయి.ఈ పరిస్థితిలో టిడిపి జోడెద్దుల బండి ఒకేతాటిపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విభేదాలు వీడి సఖ్యతగా నడుచుకోవాలని ముఖ్య

టీడీపీలో కానరాని సఖ్యత

మంత్రి చంద్రబాబు స్వయంగా సర్దిచెప్పినా ఫలితం లేకుండా పోయింది. ఇంజనీరింగ్ పట్టభ ద్రుడు, తనకు ముఖ్యడిగా ఉన్న బండి జయరాజ్‌కు 2019 ఎన్నికల్లో టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో మాండ్ర ఉన్నారు. మరోవైపు మాండ్రతో విభేదాల నేపథ్యంలో లబ్బి వెంకట్‌స్వామి వైకాపా టికెట్ కోసం తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్టు వినికిడి. వీరితో పాటు దళిత తేజం పార్టీ అధ్యక్షులు జయసూర్య కూడ టిడిపి టికెట్ అశిస్తున్న వారిలో ఉన్నారు.

నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం అరు మండలాలు ఉన్నాయి. ఇందులో నందికొట్కూరు, మిడ్తూరు, పగిడ్యాల, జూపాడు మండలాలతో పాటు, పునర్విభజన అనంతరం అత్మకూరులోని పాములపాడు, కొత్తపల్లి మండలాలు వచ్చి చేరాయి. నియోజక వర్గంలో 1,80,197 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 89, 650 మంది ఉండగా మహిళలు 90. 540 మంది ఉన్నారు.

పట్టు కోసం వైకాపా

2014 ఎన్నికల్లో విజయం సాదించిన వైకాపా జిల్లా రాజకీయాల్లో చోటు చేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా డీలాపడింది. నియోజక వర్గంలో తిరుగులేని పార్టీగా టిడిపి అవిర్భవించింది. గత ఎన్నికల్లో వైకాపా విజయంలో కీలక పాత్ర పోషించిన మాజీ పోలీస్ అధికారి మాండ్ర శివానందారెడ్డితో పాటు కొంతమంది ఎంపిపిలు, జడ్‌పిటిసిలతో పార్టీ నుంచి బయటకు వచ్చి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అంతేకాకుండా జడ్పీ చైర్మన్ పదివిని టిడిపికి కట్టబెట్టడంతో వీరు కీలక పాత్ర వహించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా నందికొట్కూరులో వైకాపా డీలప డింది. ఫలితంగా సిట్టింగ్‌ఎంఎల్ఏ ఐజయ్యకు ఒంటరి పోరు తప్పలేదు. ఈ క్రమం లోనే మాజీ ఎంఎల్ఏ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్న కుమారుడు బైరెడ్డి సిదార్థ రెడ్డి వెకాపా తీర్థం పుచ్చుకొన్నారు. ఈయన ఎంఎల్ఏతో కలిసి నియోజక వర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో పాదయాత్ర, ఇతర కార్య క్రమాలను నిర్వహిస్తు తిరిగి పార్టీకి పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైకాపా సీటుకు సిట్టింగ్ ఎమ్మెల్యే ఐజయ్యతోపాటు రిటైర్డ్ పోలీసు అధికారి అర్ధర్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈయన చంద్రబాబు, రోశయ్యతో కోట్ల విజయ భాస్కర రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వైఎస్‌అర్‌లకు సెక్యూరిటీ అధికారి వ్యవహారించారు. 2014 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినా, పార్టీ ఐజయ్య వైపు దృష్టిసారించడంతో చివరి నిమిషంలో తప్పుకున్నారు. 2019లోనైన తనకు వైకాపా టికెట్ వస్తుందనే బలమైన నమ్మకంతో అర్ధర్ ఉన్నారు. ఈయనతో పాటు షాదాన్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్ బోనాల శరత్ బాబు టికెట్ రేసులో ఉన్నారు.

బైరెడ్డి చేరిక కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా

మరోవైపు రాష్ట్ర విభజన క్రమంలో టిడిపిని వీడి అర్‌పిఎస్‌ను స్థాపించి భంగపడ్డ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని నందికొట్కూరులో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చే భగీరథ యత్నంకు పూనుకున్నారు. అయన చెరుకు అశోక రత్నంతో కలిసి నియోజక వర్గంను చుట్టేస్తున్నారు. వీరితో పాటు నియోజక వర్గ అధ్యక్షులు కాటేపోగు మల్లికార్జున టికెట్ రేసులో ఉన్నారు. వీరిద్దరిని కాదని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎస్‌సి వర్గంకు చెందిన తన పెంపుడు కుమార్తెను రంగంలోకీ దించే అలోచనలో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా నియోజక వర్గంలో మొదటి నుంచి మంచి పట్టు ఉనర్న బైరెడ్డి కాంగ్రెస్‌లో చేరి ఎలాగైన నందికొట్కూరులో పూర్వ వైభవం తెచ్చేందుకు విశ్వయత్నాలు చేస్తున్నారు.

కమలం కమిటీలు

ఎన్నికలకు 17 బృందాలతో ఖరారు

- రాజ్‌నాథ్ మేనిఫెస్టో, జైట్లీ ప్రచారం
- దత్తాత్రేయ, రామ్‌మాధవ్‌లకు చోటు

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు భారతీయ జనతాపార్టీ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం 17 వేర్వేరు కమిటీలను నియమించింది. ఈ మేరకు సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హోంమంత్రి రాజ్‌నాథ్‌ను మేనిఫెస్టో కమిటీకి, ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీని ప్రచార కమిటీకి సారథులుగా ప్రకటించారు. కేంద్రమంత్రులు జైట్లీ, నిర్మలా సీతారామన్, రవిశంకర్ ప్రసాద్, పీయుష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మేనిఫెస్టో కమిటీలో 20మంది కీలక సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాంమాధవ్‌కు మేనిఫెస్టో కమిటీలో చోటు దక్కింది. సామాజిక సమన్వయ కమిటీకి ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, విదేశాంగమంత్రి సుష్మాస్వరాజ్‌కు ప్రచార సామాగ్రి నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. తెలంగాణకు చెందిన సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయకు సామాజిక సమన్వయ కమిటీలో అవకాశం లభించింది. ఏప్రిల్ - మే మధ్య లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. నరేంద్రమోడీని మరోసారి ప్రధాని గెలిపించుకోవాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. మీడియా కమిటీ - రవిశంకర్ ప్రసాద్, ప్రవాస్ కమిటీ- అవినాశ్ రాయ్ ఖన్నా, సోషల్ మీడియా - శ్యాంజాజు, ప్రబుద్ద సమ్మేళన్- ప్రకాశ్ జవదేకర్, ఎన్నికల పరిశీలన కమిటీ - భూపేంద్ర యాదవ్, కార్యాలయ నిర్వహణ- అరుణ్ సిన్హా సాహిత్య వితరణ - శ్యాంజాజు, భాజపా పరివార్-అవినాశ్ రాయ్, కమల్ జ్యోతి - అనిల్ జైన్, మన్‌కీబాత్- అరుణ్‌సిన్హా బైక్ ర్యాలీ -సంజీవ్ చౌరాసియా తదితరులకు కీలక బాధ్యతలు కట్టబెట్టారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం


చెట్టు...పక్షి...భవబంధం!

బంధాల గ్రంథాలు పఠిస్తేనే
అనుబంధాల భాష్యాలు
అర్థమయ్యేది!
బంధాల ప్రబంధాలు లిఖిస్తేనే
జన్మ బంధాల భవబంధాలు
వెలుగుచూసేది!
బంధాల గంధాలు పూయిస్తేనే
మనసుల మకరందాలు
ఊటలై ఊరేది!
భావాల లావాలు పెల్లుబికితేనే
మనోభావాల ఉద్వేగాలు
సునామీలయ్యేది!
మనోగతాల శూన్యాన్ని
ఛేదిస్తేనే
జీవనవెలుగులు
విరబూసేది!
బాధ్యతల బాహువుల్లో
ఇమిడిపోతేనే
మనసుల మధ్య
వారధి నిర్మితమయ్యేది!
ఇవేవీ మాటలకందేవి కావు
మనసులకే చిక్కుకునేవి!
చెట్టుమీద పక్షిని చూస్తే
ఎవరికేమీ కానట్టే ఉంటుంది!
చెట్టుతో బంధమే లేనట్టుంటుంది
ఖాతరు చేయనట్టే కనిపిస్తుంది
కాని తాను నిల్చున్న కొమ్మకు
లోలోన రుణపడి ఉంటుంది!
ఆ భావనతోనే చెట్టుతో కన్నా
కొమ్మతో సన్నిహితమౌతుంది
చెట్టు విలువ తెలీదని కాదు!
చెట్టుకున్న చేతులు ముఖ్యమని
వాటి అవసరమింకా ఎక్కువని!
ఆ కొమ్మల రెమ్మల్నే
గూడుగా మల్చుకుంటుంది
ఆ రెమ్మలకున్న ఆకుల్నే
ఆహారం చేసుకుంటుంది!
చెట్టుతో నాకేమిటనుకుంటే
వీటికి దగ్గర కాగలదా?
బంధాల అస్తిత్వాన్ని
గుర్తించకుంటే
చెట్టుమీద నిలవగలదా!
నేనైనా నువ్వయినా
ఉన్నవారితోనే ఉన్నదంతా
అనుకుంటేనే జీవన ఆదరువు!
బాహుబంధాలైనా...రక్తసంబంధాలైనా
సుమగంధాలైనా...మకరందాలైనా
మనలో నుంచే పుట్టుకు రావాలి!
మనుషుల విలువలు తెలిస్తేనే
ఆ ఉరవడి వెల్లువలై వచ్చేది!

- వయ్యస్సారెస్
9000013367



కవితల ప్రత్యేకం



మా మొలగొలుకులు

నెల్లూరు సీమమట్టిలో
ఏ తియ్యందనాలు ఉబికి వెల్లువలై
మొలకొలుకులై మొలకెత్తాయో ఏమోకాని
సత్తువనిచ్చే వరిపైరు మొలగొలుకులు!
నెల్లూరు తీపిజ్ఞాపకం మొలగొలుకులు
మొలగొలుకు వెన్నులతో
మాగాళ్లలో రాజసం ఉట్టిపడేది
నెల్లూరు మొలగొలుకులకు
మనిషిని మైమరపించే గుణం ఉండేది
ధైర్యాన్ని నింపే గొప్ప సుగుణం ఉండేది
పెన్నమ్మ నీటి మహిమ ఏపాటిదో
తెలియదు కాని
మొలగొలుక్కు తీపిని తెచ్చిపెట్టింది
మొలగొలుకుల అన్నాన్ని
నెల్లూరు చేపల పులుసుతో కలిపితింటే
స్వర్గమే భువిపై నాట్యం చేసేది
నెల్లూరు మొలగొలుకులకు
తెలుగువారి గోంగూర పట్టిస్తే
ఆ రుచి చెప్పనలివయ్యేది కాదు
పంటచేలు కల్లాంలో తిరిపెంగ ఇచ్చే
మొలగొలుకులు
బిచ్చగాళ్ల పాలిట సంక్రాంతులయ్యేవి!
మళ్లీ మొలగొలుకు పంట విస్తరిస్తే
సన్నాలు సన్నబడిపోతాయి
నెంబర్లు నెంబర్లాట ఆడేస్తాయి
నెల్లూరు 'పైరు'గాలికి ఏ సృజన తేమ
తగిలిందో ఏమోకాని తిక్కన చేత
మహాభారతాన్ని తెనిగింపజేశాయి
అమరజీవి గుండెల్లో త్యాగం నింపి
ఆంధ్రరాష్ట్రానికి బాటలు వేసాయి
ఓ జానెడు వెన్ను వరిపై ఊరేగినట్లు
ఊగుతుంటే-
నెల్లూరు పెద్దారెడ్డి కోడలేమో
డాబు చూపించినట్టు బడాయిపోయేది
మొలగొలుకు
మరో వెన్ను పచ్చపచ్చగా పైకి వస్తుంటే
రైతు కుటుంబాలు
మమతల మాగాణులయ్యేవి
నెల్లూరుకూ మొలగొలుక్కు
అనుబంధం ఇప్పటిదా?
బండ్ల మీద బస్తాలై మొలకొలుకులు
కులుకుతూ ఇంటికి వస్తుంటే
ధాన్యలక్ష్మి నడచి వస్తున్నట్టుండేది
నేలతల్లి స్తన్యంలో తీపిని మొలగొలుకు
గ్రోలిందేమో ఆ అద్భుత రుచి
అంగిట్లోకి జారి అమృత్వాన్ని అందించే మొలగొలుకు
రండి మళ్లీ మనం మొలగొలుకులవుదాం
చక్కగా కాసిన మాగాణులవుదాం
మొలకెత్తే కలుపును పీకేసి
స్వచ్ఛ నెల్లూరు బాటలు వేద్దాం!

- చిన్ని నారాయణరావు
9440202942

చైతన్య మోహం



మిత్రమా!
నేను కలల ముక్కల్ని ఏరుకొంటూ
జీవించడం మొదలపెట్టా
ఆశ శిరస్సు మీద
కాంతిమేకులు దింపుతోంది!
నీ కంఠస్వరం
ఎప్పుడూ లేనంత తియ్యగా
రగిలే అరణ్యాలు సెగగా
జీవితాన్ని భయపెడుతూ
చైతన్య మోహంతో
మిరుమిట్లు గొలుపుతుంది
ఎవరో కవాతు చేస్తున్న దృశ్యం
నా చెవుల్లోంచి, కళ్లలోంచి
కదిలిపోతుంటుంది
పులిపంజా నీడలో పాడిన పాట
దేశమంతా వ్యాపిస్తోంది
ఇప్పుడు నీకు ప్రతి చౌరస్తా కొత్తదే
వెతుకులాట కూడా కొత్తదే!

- యేటూరి నాగేంద్ర
7416665323

అసూయ

నువ్వొక మహావృక్షమైతే కావచ్చు
మొక్కలను కూడా ఎదగనివ్వు
ఎవరో పాదు చేసి, ఇన్ని నీళ్లు పోస్తుంటే
ఏడ్చి ఏడ్చి పాడు చేస్తావెందుకు?
ఏదో ఒకనాడు నువ్వు మోడువైతే
తీగెలా నిన్నల్లుకొని పచ్చదనం పులుముతుంది

నువ్వొక మహాసంద్రమైతే కావచ్చు
పొంగే వాగులను కుంగదీయకు



ఎండిన బీళ్లను చల్లబరుస్తుంటే
కుళ్లి కుళ్లి ఏడుస్తావెందుకు?
నీ మనసుకు పట్టిన మలినాన్ని
ఎప్పుడో ఒకప్పుడు కడిగి పారేస్తుంది

ఈ ప్రపంచమొక ప్రశాంత రంగస్థలం
ప్రవేశం నీ ఒక్కడి జన్మ హక్కు కాదు
పరిమళించే పువ్వులు, పారే సెలయేళ్లు
పరిచయం అవసరం లేని నీ సహచరులు
చేతనైతే చేయూతనిచ్చి చేరదియ్యి
చెలిమికి దూరమైతే చెదపురుగవుతావు

- బలభద్రపాత్రుని ఉదయ శంకర్
9494536524

కొత్త సన్నివేశం

అందరిలా బతకడం మాకెట్టా కుదిరుద్ది
మా జాతి అంగుట్లో
శవాక్షరాలు రాయబడ్డాయిగా
వేదంసాక్షిగా మా బతుకులు గిరిగీయబడ్డాయిగా



నీ కలంపోటు ఓ తీర్పై
మా గాయాలను కెలుకుతుంది
కత్తి మారణాయుధమైన చరిత్రలో
చిత్రంగా కలం కూడా
మా కుత్తుకలపై కత్తికడుతున్న
కొత్త సన్నివేశమిప్పుడు చూస్తున్నాం

జంతువులకు రాజపూజ్యాలు
ఆపాదించబడుతున్న కర్మభూమిలో
దాని పేడకడి దగ్గర
మా ప్రస్థానాన్ని పాతరేసుకుంటున్నాం


మీలా పంచభక్ష్యాలు మాకెట్టా వస్తాయి
మీలా పట్టుపరుపులు మాకెట్టా వస్తాయి
మీలా మీకుమల్లె
మా తాతలు లౌక్యం తెలియనోళ్లు
కాలికీ మెడకీ ముళ్లేసి
బతుకు వడుపు తెలుసుకోనోళ్లు
మీతో మాకెట్టా సాపత్యం

మేము గంజిమెతుకుల్లో
పచ్చిమిరపకాయ నంజుకుంటాం
పచ్చిపులుసులో

- కంఠ బంగార్రాజు
8500350464

నిరీక్షణ

అదో మారుమూల గ్రామం
కొన్ని వందల యేళ్ల కిందటి వటవృక్షం
నేనప్పుడో బచ్చాగాడిని
ఇప్పుడది మహావటవృక్షం
అయ్యి ఉంటుంది
స్వర్గం నుంచి
నిచ్చెనలు వేసినట్లు
వ్రేలాడే ఊడలు పట్టుకుని
ఊగినప్పుడే తెలుస్తుంది



కుహూ...కుహూ...రవాలతో
కోకిలలు కూసిన తీయని
స్వరామృత రసరాగాలు
ఇప్పటికీ నా చెవులలో
మారుమ్రోగుతూనే ఉన్నాయి.

ఈ యాంత్రిక నగర
రణగణధ్వనుల మధ్య
చిక్కుకున్న నాకు
ఇప్పుడా దృశ్యం
కళ్లల్లో సుళ్లు తిరుగుతుంటే
మరోసారి
ఆ మహావటవృక్షాన్ని
దర్శించుకోవాలన్న తపన
అనుక్షణికం
కలవరపరుస్తూనే ఉంది
ఆ రోజుకై నా నిరంతర నిరీక్షణ

- కె. హరనాథ్
9703542598

కవి కలం




అతని కవితలలో
ఏమిటా 'ఘోష'లు
బతుకుపోరులో
జనం 'గోస'లు
***
తన కవితల నిండా
ప్రజల ఆవేదనే!
జనగళమే
ఆ కవి కలం!!
***
తన కవితాశరం
ఎదను తాకింది
ఐనా మదిలో
మధుర భావనే
***
మనుషులకే
కులమతాలు
కలాలకుండవు
ఏ కమతాలు
***
కత్తితోనే కాదు
కలంతోను కొయ్యొచ్చు
కుత్తుకలను
పదాల్లో పదునుంటే!

- సిరా (సింగారపు రాజయ్య)
9945744332

పల్లెతల్లి

మనోమాలిన్యం కడిగేయి
మనసవుతుంది
మరకలు లేని
కాగితం



వెలితి కుండకే
కాదు మిత్రమా!
వెర్రి వాగుడుకూ
నిలకడుండదు.
అలలు జోకొడుతుంటే
హాయిగా, నిద్రపోతోంది
నదీ ఒడ్డున
నావ.

మమకారం మాటల్లో
ఉందా? మనిషివే!
సాయం చేతల్లో
ఉందా? మహాత్ముడివే!

పల్లె హాయిగా
నిద్రపోతోంది
చల్లగాలే కదా
జోలపాడే తల్లి

- ఎ. నాగాంజనేయులు
9959017179

నాన్న

నాన్న
ప్రపంచం మొత్తం
చూడగల్గుతున్నాను
నాన్నభుజం
ఎవరెస్టు శిఖరం!




పాదాలు జారుతున్నా
నిలబడి ఉన్నా
నాన్న చేయి భవితకు భరోసా!

చిట్టిపాదాలు
నాట్యం నేర్చుకుంటున్నాయి
నాన్న గుండె
నటరాజ నిలయం!

- డా॥ పెంకి. విజయ్‌కుమార్
9553392949

మరీచికలు



రంగూ వాసనా సరే
గులాబి ముల్లు
రుచి తెలుసా!

పాము ప్రాణం
చీమల
గుంపులో!

మరిపిస్తే
ఆగేవి ఎక్కిళ్లు
వెక్కిళ్లు ఆగవు


చావూ
ఓ అసమాపక క్రియే
యోధుడికి

అలలు
కడలి పిల్లడు రాసే
ఇంపోజిషన్.

-కర్లపాలెం హనుమంతరావు
8142283676

చెట్టు-పిట్ట-కవిత

పాట నేర్పి
పిట్ట ఎగిరిపోయింది



అటుకొన్ని ఇటు కొన్ని
ఆకులు రాల్చని కొమ్మలతో
ఆకాశం చీలినచోట నిలబడ్డది
ఒంటరిగా చెట్టు

చెట్టుకింద
తపతపరెక్కలాడిస్తూ
నీడలు

- నవీన్‌కుమార్
9951979399

దిశ

స్కూల్ బయట గాలిపటాలు
ఎగురవేస్తున్న చిన్న పిల్లవాడిని
హిమాలయాలు ఎక్కడున్నాయని అడిగాను?

పిల్లవాడన్నాడు అక్కడే అక్కడే
ఎక్కడైతే తన గాలిపటం ఎగురుతోందో
అక్కడే హిమాలయాలున్నాయని...



నేను స్వీకరించాను...
నాకు తొలిసారి తెలిసొచ్చింది
హిమాలయాలెక్కడున్నాయి అన్నది...

-హిందీమూలం: కేదార్నాథ్ సింగ్
తెలుగు:అఖిలాశ
7259511956

అత్తాకోడలు

పాతరోజులకి
నవవధువు ప్రొద్దునే అత్త చేతికిచ్చెను కాఫీ!
కొత్తకోడలు మురియ కాసులబేరెట్టె అత్తమ్మ!
కట్నపు తాలూకు బాకీకై పట్టుబట్టక, పతితో
పరవశముగా షికారుకెళ్లగ అనుమతించె!


ఇప్పటికి-
నవవధువు ప్రొద్దునే అత్తచేతికిచ్చెను కాఫీ!



కొత్తకోడలు మురియ కాసులబేరెట్టె అత్తమ్మ!
పతిమురిసి సహధర్మచారిణి ప్రేమను గని
పరవశమున షికారునకు గొనిపోయెన్ సతిన్!

- రవి పెంట్రాల

నల్లమొహం



ఒక స్వేదవాగు
సముద్రం నుంచి వేరుపడి
ఉప్పు వాము వరకు ప్రవహిస్తుంది
అలల కాళీ నడకన
దారంతా నీటి తడి
నేల గుండెని తాకి
దాహం తీరుస్తుంది తృప్తిగా...

కయ్యల నిద్రపొయ్యే
సముద్రం కరడు గట్టిపోతుంది
అయినా సముద్రపు పొగరు తగ్గదు
కణికలు కణికలుగా
నిప్పు కణికంత కిర్రెక్కి
ఉప్పగా నవ్వుతుంది
ఉప్పు రైతు రౌతులా
ఊపిరి పీల్చుకుంటాడు
ఎండలో కారిన చెమట తుడిచి...

నిప్పుకు పట్టదు కానీ
పరాయీకరణ నీడలో
ఉప్పుకు చెదపట్టింది
పారిశ్రామీకరణ దాడిలో
ఉప్పు కయ్య నల్లమొహమేసింది...!!

- డాక్టర్ పెరుగు రామకృష్ణ
9849230443

సాహిత్య వార్తలు

కొలకలూరి విశ్రాంతమ్మ పరిశోధన పురస్కారం-2019

ప్రతిష్ఠాత్మకమైన కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం-2019కిగాను ముద్రిత పరిశోధనకు ప్రదానం చేయాలని నిర్ణయించాము. జనవరి2016 నుంచి 2018 వరకు ముద్రితమైన పరిశోధన గ్రంథాలను రచయితలుగానీ, ప్రచురణ కర్తలుగానీ మూడేసి ప్రతుల చొప్పున పంపగోరుచున్నాము. ఒకే రచయిత ఒకటి కంటే ఎక్కువ గ్రంథాలు ఎన్నయినా పంపవచ్చు. పురస్కారం పదివేల నగదు, శాలువ, మెమొంటో ప్రదానం చేస్తాం. చివరితేది 20-1-2019. ఫిబ్రవరి 26, 2019న హైదరాబాద్‌లో జరిగే సభలో పురస్కార ప్రదానం చేస్తాం. ముద్రిత గ్రంథాలు పంపవలసిన చిరునామా: డా. కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్, ఆంగ్ల శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-517502, ఆం.ప్ర.

- డా. కొలకలూరి సుమకిరణ్
9963564664

కొలకలూరి భాగీరథీ విమర్శ పురస్కారం-2019

ప్రతిష్ఠాత్మకమైన కొలకలూరి భాగీరథీ పురస్కారం-2019కిగాను ముద్రిత విమర్శకు పురస్కారం ప్రదానం చేయాలని నిర్ణయించాము. జనవరి 2016నుంచి డిసెంబరు 2018 వరకు ముద్రితమైన విమర్శ గ్రంథాలను రచయితలుగానీ, ప్రచురణ కర్తలు గానీ మూడేసి ప్రతుల చొప్పున 20-1-2019లోగా పంపాలని కోరుతున్నాము. ఒకే రచయిత ఒకటి కంటే ఎక్కువ గ్రంథాలనైనా పంపవచ్చు. పురస్కారంగా పదివేల నగదు, శాలువ, మెమొంటో26-2-2019న హైదరాబాద్‌లో జరిగే సభలో ప్రదానం చేస్తాం. గ్రంథాలు పంపవలసిన చిరునామా-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆంధ్రాచార్యులు, తెలుగు శాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి-517502.

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
9441923172

నాగభైరవ పురస్కారానికి విమర్శ గ్రంథాలకు ఆహ్వానం

డా॥ నాగభైరవ కోటేశ్వరరావు ప్రతిభా పురస్కారానికి 2014 జనవరి నుంచి 2018 డిసెంబర్‌లోపు ప్రచురించబడిన సాహితీ విమర్శ గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. ఒకే రచయిత రాసిన విమర్శ గ్రంథాలు లేదా విమర్శ వ్యాస సంపుటాలు మాత్రమే పరిశీలింపబడతాయి. నాలుగు ముద్రిత ప్రతులను 2019 జనవరి 31లోపు అందేలా పంపాలి. ఉత్తమ సంపుటికి ఫిబ్రవరి 24న నెల్లూరులో జరిగే 10వ నాగభైరవ అవార్డు సభలో బహుకరించబడతాయి. సంపుటాలు పంప వలసిన చిరునామా: చిన్నినారాయణరావు, ప్రధమ కార్యదర్శి, డా॥నాగభైరవ అవార్డు కమిటీ, డోర్ నెం. 27-1-171, శ్రీనికేతనమ్, ఆదిత్యనగర్, చిల్డ్రన్ పార్కు రోడ్, నెల్లూరు-524002, సెల్-9440202942

- చిన్ని నారాయణరావు- ప్రధాన కార్యదర్శి

బండ్లకు సహృదయ సాహితీ పురస్కారం

బండ్ల మాధవరావుకు రాసిన అనుపమకు ప్రధాన పురస్కారం, అనిల్ డ్యాని రాసిన ఎనిమిదవ రంగు, విల్సన్‌రావు కొమ్మవరపు రాసిన దేవుడు తప్పిపోయాడులకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. న్యాయ నిర్ణేతలుగా మాకినీడు విజయభాస్కర్, గుణలు వ్యవహరించారు.

-వేదుల శ్రీరామశర్మ- అధ్యక్షులు, సహృదయ సాహితి

కవి సంధ్య -జైనీ ఫౌండేషన్ కవితల పోటీ

మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిసంధ్య సాంస్కృతిక సంస్థ జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో కవితల పోటీ-2019 నిర్వహిస్తున్నది. కవిత్వంలో కొత్త తరాన్ని ప్రోత్సహించడం ఈ కవితల పోటీ ప్రధాన ఉద్దేశం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరసగా 3000/-, 2000/-, 1000/-మరియు పది మంచి కవితలకు 500/- నగదు చొప్పున ఇవ్వబడతాయి. ఈ పోటీలో పాల్గొనదలచినవారు రూ. 200/-ఎంట్రీ ఫీజును ఎం.ఓ ద్వారా గానీ కవిసంధ్య అకౌంట్ నెం. 1557111-0000236/IFSCకోడ్...ANDB0001557కు గాని పంపాలి. పోటీలో బహుమతి పొందినవారి ఎంట్రీ ఫీజు కవిసంధ్య సంవత్సర చందాగా పరిగణించబడుతుంది. కవితలు పోస్టుద్వారాగానీ, కొరియర్ ద్వారాగానీ పంపాలి. కవితలు పంపడానికి చివరితేది 30, జనవరి 2019, చిరునామా-దాట్ల దేవదానం రాజు, ఉపాధ్యక్షులు, కవిసంధ్య, 8-1-048, జక్రియనగర్, యానాం-533404, తూ.గో.జిల్లా,ఎ.పి. సెల్.నెం. 94401105987

- దాట్ల దేవదానం రాజు
కన్వీనర్- కవితలపోటీ

ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి డా॥సి. భవానీదేవి ఎంపిక

ఆకాశవాణి, ప్రసారభారతి జాతీయస్థాయిలో ప్రతిఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి ప్రసారం చేసే జాతీయ కవి సమ్మేళనంలో భాగంగా 2019 సంవత్సరానికి జాతీయ కవిసమ్మేళనంలో తెలుగు కవిగా ప్రసిద్ధ కవయిత్రి, రచయిత్రి డా. సి.భవానీదేవి 'అమ్మ నిజం చెప్పదు' కవిత ద్వారా ఎంపిక అయ్యారు. 2019 జనవరి 10వ తేదీన చెన్నైలో జాతీయస్థాయి కవిసమ్మేళనంలో పాల్గొంటారు.

కావ్యపరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్యపరిమళం' పరంపరలో భాగంగా 11వతేదీన సాయంత్రం 6గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో డా॥ దాశరథి కృష్ణమాచార్య "అగ్నిధార" కావ్యంపై దేశపతి శ్రీనివాస్ ప్రసంగం ఉంటుంది. డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

- డా॥ఏనుగు నరసింహారెడ్డి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

రక్షణ మంత్రి రాజీనామా చేయాలి





● హెచ్ఏఎల్‌కు లక్ష కోట్ల కాంట్రాక్టు పత్రాలు చూపించాలి ● మోడీని కాపాడేందుకు రక్షణ మంత్రి ప్రయత్నాలు: రాహుల్ ● ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: నిర్మలా సీతారామన్ ● లక్ష కోట్ల ఒప్పందం జరగలేదు: హెచ్ఏఎల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ సాక్షిగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ విషయంలో అబద్ధాలు చెప్పారని, సభ్యులందరినీ తప్పుదోవ పట్టించారని, వెంటనే ఆమె తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్ష కోట్లకు సంబంధించిన ఆర్డర్లు హెచ్ఏఎల్‌కు ఇచ్చినట్టు నిర్మలా సీతారామన్ చెప్పారని, అలా అయితే వాటికి సంబంధించిన పత్రాలను పార్లమెంట్‌లో సమర్పించాలని అన్నాడు. శుక్రవారం లోక్‌సభలో రాఫెల్ విషయమై రెండు గంటల పాటు చర్చ జరుగుతున్న సమయంలో హెచ్ఏఎల్‌కు పైప్‌లైన్ విషయంలో రూ.1లక్ష కోట్ల ఆర్డర్ ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ తమకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఆర్డర్ కూడా రాలేదని హెచ్ఏఎల్ చెప్పుకొస్తున్నది. మోడీ ప్రభుత్వం తప్పులను కప్పిపుచ్చుకోవడానికి అనేక తప్పుడు ప్రకటనలో చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. లక్ష కోట్ల ఆర్డర్ కోసం హెచ్ఏఎల్ వేచి చూస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని కాపాడాలనే ఆలోచనతోనే నిర్మలా సీతారామన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా హెచ్ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఆర్డర్ ఇచ్చామని చెప్పినందున దానికి సంబంధించిన డాక్యుమెంట్‌లు సోమవారం చూపించాలని డిమాండ్ చేశాడు. సూటు, బూటు వేసుకున్న వారికే మోడీ కాంట్రాక్టులు ఇస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఏఎల్‌ను ఆదుకోవడం లేదని, అందుకే వేతనాలు, ఇతర ఖర్చుల కోసం రూ.1000 కోట్ల అప్పు చేయాల్సి వచ్చిందని రాహుల్ విమర్శించారు. హెచ్ఏఎల్ చరిత్రలో ఇది మొదటి సారి అని ఎద్దేవా చేశారు.

వార్తను రాహుల్ పూర్తిగా చదవాలి

రాహుల్ విమర్శలను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు. రాహుల్ చేసిన కామెంట్లపై ట్విట్టర్ వేదికగా స్పందించారు. రాహుల్‌కు మళ్లీ ఏ, బీ, సీ, నుంచి తెలియజేయాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. వార్తను పూర్తిగా చదవకుండా న్యూస్‌క్లిప్పింగ్‌ను పోస్టు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. ముందు వార్తను పూర్తి చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ రక్షణ శాఖపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, 2014 నుంచి 2018 మధ్య కాలంలో రూ.26,570 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌పై సంతకాలు చేయడం జరిగిందని, మరో రూ.73,000 కోట్ల పైప్‌లైన్ కాంట్రాక్ట్ ఉందని, ఈ విషయమై సంప్ర దింపులు జరుగుతున్నాయని, దీనిపై సంతకం చేయాల్సి ఉందని మాత్రమే చెప్పామని వివరించారు. రక్షణ శాఖపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న రాహుల్, పార్లమెంట్‌లో నిల్చొని క్షమాపణ చెప్పాలని లేదా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా కూడా మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రక్షణ మంత్రి అబద్దాలు చెప్పారనే విషయం తేటతెల్లమైందని అన్నారు. హెచ్ఏఎల్‌కు రూ.1లక్ష కోట్ల కాంట్రాక్టు అందించినట్టు చెబుతున్నారని, కానీ కంపెనీ మాత్రం తమకు ఒక్క రూపాయి ఆర్డర్ కూడా రాలేదని ప్రకటించిందని, దీనిపై ఏం సమాధానం చెబుతారని నిర్మలా సీతారామనుద్దేశించి ప్రశ్నించారు. కాంట్రాక్టుపై సంతకాలు చేయకుండానే ఎలా ప్రకటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రక్షణ మంత్రి ప్రకటనపై హెచ్ఏఎల్ ఉన్నతాధికారి స్పందిస్తూ.. ఇప్పటి వరకు ఎలాంటి ఆర్డర్‌లు రాలేవని, ఎందుకంటే కాంట్రాక్టులపై ఇంకా సంతకాలు కాలేవని చెప్పుకొచ్చాడు. ఈ విషయమై వాటాదారులకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వివరించారు. రూ.లక్ష కోట్ల కాంట్రాక్టు వచ్చిందనే విషయాన్ని నమ్మొద్దని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని చెప్పుకొచ్చాడు.



కష్టపడితేనే ఉన్నతస్థానం

● కలాం, కైలాష్ సత్యార్థిలను యువత ఆదర్శంగా తీసుకోవాలి ● స్వర్ణ భారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: జీవితంలో కష్టపడి ఇష్టపడి పని చేసినప్పుడే ఉన్నత స్థానాలకు ఎదగగలుగుతామని, ఆ వాస్తవాన్ని నేటి యువత జీర్ణించుకుని ముందుకు సాగాలని ఉపరాష్ట్ర పతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. పూర్వ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి సాధారణ కుటుంబాల నుంచి వచ్చి కఠోర పరిశ్రమ చేసి సమున్నత స్థానాలకు చేరుకున్నారని, అలాంటి మహనీయులను విద్యార్థి లోకం ఆదర్శంగా చేసుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఆదివారం విజయవాడ నగర శివారులోని ఆత్కూరు గ్రామంలో ఉన్న 'స్వర్ణ భారత్ ట్రస్ట్' మూడో వార్షికోత్సవంలో వెంకయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ సాగుతున్న స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు అనతి కాలంలోనే దేశ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందంటూ అందుకు కారకులైన నిర్వాహకులను ఆయన అభినందించారు. శాస్త్రవేత్తగా, అధ్యాపకుడిగా అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవ, 18 వేల మంది బాల కార్మికులను బానిసత్వం నుండి విముక్తి చేసిన కైలాష్ సత్యార్థి మన దేశానికి గర్వకారణమన్నారు.

యువత మూడు 'డి'ల నుండి స్ఫూర్తి పొందాలి : సత్యార్థి

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ, నేటి యువత మూడు 'డి'ల నుండి స్ఫూర్తి పొందుతూ అదే సమయంలో మూడు 'సీ'ల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డ్రీం, డిస్కవర్, డూ.. ఈ మూడింటిని అందిపుచ్చుకుంటూ, కథేషన్ (కరుణ), కరేజ్(ధైర్యం), కన్విక్షన్(పట్టుదల) గురించి తెలుసుకుని ఆ దిశగా అడుగులు వేయాలని యువతకు హితవుపలికారు.

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న డిఫెన్స్ రీసర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డిఆర్‌డిఒ) జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశ రక్షణ రంగం స్వయం సమృద్ధి సాధించే దిశగా రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. కైలాస్ సత్యార్థి దంపతులను, సతీష్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిని ఘనంగా సత్కరించారు. జాతీయ రైస్ మిల్లర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులు వెంకయ్యనాయుడును గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పత్తిపాటి పుల్లారావు, పార్లమెంట్ సభ్యుడు కె.హరిబాబు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తదితర అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.

నిండు ప్రజాస్వామ్యం... సగం తీర్పు!

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలకు ఓటేస్తున్నారు. 2014 లోక్‌సభ గణాంకాలను పరిశీలిస్తే, అధికార ప్రతిపక్షాలైన బీజేపీ (17.7కోట్లు), కాంగ్రెస్(10.6కోట్లు)కు పోలైన ఓట్లు, ఈవీఎం మీటదాకా చేరని ఓట్లు చెరిసమానంగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. దీన్నిబట్టి సగం తీర్పుతోనే నిండు ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని భావించక తప్పదు. ఈ భూమ్మీద మరే ఇతర ప్రజాస్వామ్య దేశంలో లేనంతమంది ఓటర్లు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నారు. కానీ, ప్రభుత్వాన్ని, సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే బృహత్తర బాధ్యతను నిర్లక్ష్యం చేస్తుండటం ప్రజాస్వామ్యానికి చేటుతెచ్చే పరిణామంగా మేధావులు అభివర్ణిస్తున్నారు.

20 ప్రజాస్వామ్య దేశాల తీర్పుతో సమానం..

భారత్ తర్వాత అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన దేశం అమెరికా. ఇక్కడ 2016లో జాతీయ ఎన్నికలు జరిగాయి. అప్పుడు 18.3 కోట్ల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. అమెరికాను మినహాయిస్తే, ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ ర్యాంకు కలిగిన 20 ప్రజాస్వామ్య దేశాల్లోని మొత్తం ఓటర్ల సంఖ్య 28.2 కోట్లు. ఇందులో జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, ద.కొరియా వంటి దేశాలున్నాయి. ఈ లెక్కలతో పోల్చిచూస్తే, పోలింగ్‌కు దూరంగా ఉంటున్న 28 కోట్ల ఓటర్ల విలువ తక్కువేమీకాదు. సదరు 20 దేశాల్లో ప్రభుత్వాల ఎంపికకు ఇది సమానం.

ఎందుకిలా జరుగుతోంది?

రాజ్యాంగం ప్రసాదించిన మిగతా హక్కులు, బాధ్యతల విషయంలో జాగురూకతతో ఉండే వయోజనులు ఓటు హక్కు పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? ఓటేయక పోవడాన్ని తేలిగ్గా ఎందుకు తీసుకుంటున్నారు? అనే ప్రశ్నలకు విభిన్న సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇందులో ఉపాధి వలసలు ప్రధాన కారణం. 2011 జనగణన వివరాల మేరకు 45.4 కోట్ల మంది ఉపాధి, వ్యాపార, విద్య కోసం సొంత ఊళ్లు విడిచి వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లినట్లు స్పష్టమవుతోంది. వీరిలో 2కోట్ల మంది ఏడాదిగా, 7.2 కోట్ల మంది నాలుగేళ్లు అంతకు మించి సొంత ప్రాంతాలను వీడినట్లు సమాచారం. మరికొంత మంది పోలింగ్ బూత్‌వరకు చేరుకోలేని బద్ధకస్థితిలోను, వ్యవస్థపట్ల నిర్లిప్తతోను ఉండటం మరొక కారణం.


నిర్లక్ష్యం వీడాలి?

వలస వెళ్లినప్పటికీ, ఇతర పౌర ప్రాయోజిత వివరాలు, పత్రాల విషయంలో చూపే శ్రద్ధ ఓటు పట్ల చూపడం లేదన్నది వాస్తవం. ఫోన్‌నంబర్, బ్యాంకు ఖాతా, ఆధార్ చిరునామా, వంటగ్యాస్ వంటి వాటిని తామున్న చోటకు బదలీ చేయించుకుంటున్నారు. కానీ, ఓటు విషయంలో ఈవిధమైన ముందుజాగ్రత్త చూపడం లేదు. దేశంలో ఎక్కడకు వెళ్లినా, మునుపటి ఓటును రద్దుచేయించుకుని కొత్త ఓటు నమోదు చేయించుకోవాలి. అయినా పోతే పోయిందిలే? ఓటే కదా? వేయకుంటే ఏమిటి? అనుకునే మూర్ఖపు ధోరణులు కొనసాగుతుండటం దురదృష్టకరం.

గత లోక్‌సభ ఎన్నికల నాటికి 1.3 కోట్ల మంది ఎన్నారైలు, 1.2 కోట్ల ఆర్మీ ఓటర్లు ఉన్నారు. దేశీయంగా వలస ఓటర్లతో పోల్చితే వీరి సంఖ్య చాలా స్వల్పం. ఎన్నారైలకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రయత్నిస్తున్న, మన నాయకాగ్రగణ్యులు భారీ సంఖ్యలో ఉన్న వలస ఓటర్లపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈసీ కూడా ఈ దిశగా ప్రత్యామ్నాయ చైతన్య కార్యక్రమాలు చేపట్టి, నిండు ప్రజాస్వామ్యాన్ని నిండుతీర్పుతో ప్రజలు ఆశీర్వదించేలా చూడాలని కోరుకుందాం.

ఆధార్‌తో రూ.90 వేల కోట్ల ఆదా

● 2 పథకాలు తీసుకురావొచ్చు: జైట్లీ



న్యూఢిల్లీ : ఆధార్‌తో దేశ ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని, ఎన్‌డీఏ హయాంలో దీనికి ఎంతో ప్రాధాన్యత కల్పించామని, గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతోనే పథకాలు పేదల దరి చేరలేవని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ చెప్పుకొచ్చారు. ఆధార్‌తో ఏడాదికి రూ.90వేల కోట్లు ఆదా అవుతున్నాయని, ఈ డబ్బుతో ఆయుష్మాన్ భారత్ వంటి మరో 3 కొత్త పథకాలు అమలు చేసేందుకు వీలవుతుందని తెలిపారు. నిరుపేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఎన్‌డీఏ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌ను తీసుకొచ్చింది. స్వ ప్రయోజనాల కోసమే యూపీఏ ప్రభుత్వం ఆధార్‌ను తీసుకొచ్చి నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. 'ఆధార్ ప్రయోజనాలు - నేడు ఎక్కడున్నాయి..?' అనే టైటిల్‌తో జైట్లీ ఫేస్‌బుక్ వేదికగా ఓ పోస్టు చేశారు. 2018 మార్చి వరకు ఆధార్‌తో రూ.90వేల కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. ఏడాదికి సుమారు రూ.77వేల కోట్లు ఆధార్‌ను ఉపయోగించడంతో ఆదా అవుతున్నాయని ప్రపంచ బ్యాంకు తెలియజేసిందని, ఆధార్ గేమ్ ఛేంజర్ అని వివరించారు. కాంగ్రెస్ న్యాయవాదులు మాత్రం ఆధార్‌ను తీసుకురావడాన్ని సవాల్ చేస్తూ కోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు. ఆధార్ ద్వారా రూ.1,69,868 కోట్లు బదలీ చేయడం జరిగిందన్నారు. ఈ తరహా టెక్నాలజీని కేవలం భారత్‌లోనే ఉపయోగించడం జరుగుతోందన్నారు.

పాక్ మాజీ అధ్యక్షుడి ఆస్తులు జప్తు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో కృత్రిమ బ్యాంకు అకౌంట్ల ద్వారా వేల కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరిగిన కేసుని విచారిస్తున్న సంయుక్త దర్యాప్తు బృందం(జేఐటీ) శనివారం పాక్ మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ, ఫర్యాల్ తల్‌పూర్, జర్దారీ అండ్ ఓమ్ని గ్రూప్స్‌ల అన్నీ ఆస్తులను జప్తు చేసింది.

అవినీతి రహిత సమాజం నిర్మిస్తాం

● మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు



పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన రాష్ట్ర నేత రావెల కిషోర్‌బాబు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో అవినీతి రహితమార్పే లక్ష్యంగా జనసేన పార్టీకి ఉద్యమిస్తుందని మాజీ మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర నేత రావెల కిషోర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని రూపు మాపి, అవినీతికి ఆస్కారంలేని ప్రజా ప్రభుత్వాన్ని జనసేన పార్టీ ఏర్పాటు చేసి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో జనసేన అనూహ్యమైన విజయాన్ని సొంతం చేసుకోబోతుందన్నారు. ఇందుకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. రోజు రోజుకు పార్టీకి ప్రజా మన్ననలు అధికమయ్యాయని అన్నారు. వాడవాడలా పార్టీ జెండా ఆవిష్కరణలు జరుగుతున్నాయని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఆదివారం గుంటూరు జిల్లాలోని నల్లచెరువు 7వ లైన్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున జనసైనికులు ప్రజల్లోకి చొచ్చుకెళ్లి,పార్టీని క్షేత్రస్థాయిలో మరింతగా విస్తరింపజేసేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు.

ఐటీ దాడుల్లో రూ.11 కోట్ల ఆస్తులు స్వాధీనం

బెంగళూరు: కర్నాటక సినీ నిర్మాతలు,నటుల ఇళ్లు, ఆఫీసుల్లో జరిపిన సోదాల్లో రూ.11 కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఐటీ శాఖ తెలిపింది. ఈ దాడులతో లెక్కచూపని డబ్బు రూ.109 కోట్లుగా తేలినట్లు స్పష్టం చేసింది. ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు సినీ నటులు శివరాజ్ కుమార్,పునీత్ రాజ్ కుమార్,సుదీప్,యశ్, నిర్మాతలు సి.ఆర్ మనోహర్,రాక్‌లైన్ వెంకటేశ్, విజయ్‌కిరిగండూర్‌ల ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించినట్లు ఐటీ అధికారులు తెలియజేశారు. రూ.2.85 కోట్ల నగదు.. 25.3 కిలీల బంగారం కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.కర్నాటక, గోవా రాష్ట్రాల్లోని ఐదు ప్రాంతాల్లో సర్వే చేసి 21 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామన్న ఐటీ అధికారులు ఇందుకోసం 180 మంది ఐటీ సిబ్బందిని వినియోగించిటనట్లు తెలియజేశారు.



ఎరిక్సన్ బకాయిలు తీరుస్తా:అనిల్ అంబాని

ముంబై : పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన రిలయన్స్ కమ్యూనికేషన్ ఛైర్మన్ అనిల్ అంబానీ స్విడిష్ టెలికం దిగ్గజం ఎరిక్సన్‌పై ఆదివారం ధ్వజమెత్తారు. సంచలనాల కోసం మీడియాను వినియోగించుకొని బకాయిలు రాబట్టుకోవాలనుకుంటోందని అనిల్ మండిపడ్డారు. దీంతో బ్యాంకుల ప్రయోజనాలు కూడా కొత్త దెబ్బతింటాయని చెప్పారు.ఎరిక్సన్ చెల్లించాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లిస్తానని, తమ స్పెక్ట్రమ్ అమ్మకాలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వాటి అనుమతి లభించిన వెంటనే ఎరికసన్‌కు బకాయిలు పూర్తిగా చెల్లిస్తానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గత శుక్రవారం నాడు ఎరిక్సన్ తమకు రావాల్సిన బకాయిలు రూ.550 కోట్లు చెల్లిస్తామని ఆర్ కామ్ హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోలేదని సుప్రీంకోర్టు కెక్కారు. తమ బకాయిలు చెల్లిం చే వరకు అనిల్ అంబానీని సివిల్ జైల్లో పెట్టా లని కోర్టును కోరారు. అలాగే అంబానీని, రిలయన్స్ టెలికం లిమిటెడ్ ఛైర్మన్ సతీష్ సెథి, రిలయన్స్ ఇన్ ఫ్రాటెల్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ చాయ విరానీని దేశం నుంచి పారిపోకుండా హోంమంత్రిత్వశాఖకు ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును ఎరిక్సన్ కోరింది. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ.. ఇటీవల ఎరికసన్ కోర్టులో వేసిన ధిక్కార పటిషన్ నోటీసు తమకు అందలేదని, ఈ విషయం మీడియాలో ప్రముఖంగా చోటుచేసుకుందన్నారు. కావాలని ఎరిక్సన్ మీడియాకెక్కి రాద్ధాంతం చేస్తోందన్నారు. ఇప్పటి వరకు సుప్రీంకోర్టు ఎరిక్సన్ లేవనెత్తిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఆయన తెలిపారు. ఎరిక్సన్ తాజా లేవనెత్తిన అంశంతో ఆర్‌కామ్‌కు నిజాయితీగా రుణాలు ఇచ్చిన 38 బ్యాంకులు వాటిలో 17 పీఎస్‌యు బ్యాంకులు 13 విదేశీ బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

ఆర్థిక వ్యవస్థకు చమురు సెగ

● పెరిగిపోతున్న ధరతో..ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు ● వృద్ధిరేటుపై ప్రభావం

● ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడి





ముంబై : ఇటీవల కాలంలో ముడిచమురు ధరలు తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకోవడం పట్ల రిజర్వుబ్యాంకు ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై ప్రభావం చూపుతుందని.. ముఖ్యంగా కరెంటు ఖాతాలోటు పెరిగిపోవడంతో పాటు ద్రవ్యోల్బణం, వృద్ధిరేటుకు గండిపడుతుందని ఆర్‌బీఐ తాజా అధ్యయనంలో హెచ్చరించింది.

దేశీయ ఇంధన అవసరాలకు 80 శాతం వరకు దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, ముడిచమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపతుందని నివేదికలో వివరించింది. ధరలు పెరిగితే ప్రధానంగా కరెంటు ఖాతాలోటు పెరిగిపోతుంది. ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో పాటు ద్రవ్యలోటు పెరుగుతుందని ఆర్‌బీఐ నివేదికలో వివరించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ముడిచమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో 12 శాతం వరకు పెరిగాయి.

గత ఏడాది ద్వితీయార్థంలో ముడిచమురు ధరలు పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ పెరగడమేనని తేల్చి చెప్పింది. దీంతో పాటు గ్లోబల్ వృద్ధిరేటు క్రమంగా పెరుగుతుందన్న అంచనాతో పాటు ప్రపంచంలోని కొన్ని దేశాల్లో ఏర్పడినే రాజకీయ సంక్షోభాల వల్ల ముడిచమురు సరఫరా తగ్గిందని దీంతో ధరలు పెరిగాయని పేర్కొంది. అయితే నవంబర్ నెల ద్వితీయార్ధం నుంచి ముడిచమురు ధరలు తగ్గడం ప్రారంభమైందని, అయినా ఇప్పటికి ఒడిదుడుకులు కొనసాగుతున్నాయని నివేదికలో వివరించింది.

ముడిచమురు ధరలు పెరిగితే కరెంటు ఖాతాలోటుపై ఒత్తడి పెరుగుతుందని, (క్యాడ్.. దేశంలోకి వచ్చే విదేశీ మారకద్రవ్యం.. దేశం నుంచి తరలిపోతున్న విదేశీ మారకద్రవ్యానికి మధ్య వ్యత్యాసమే క్యాడ్.. లేదా కరెంటు ఖాతాలోటు) అని గుర్తించుకోవాలి. క్యాడ్ పెరగడమే కాకుండా జీడీపీ వృద్ధిరేటుపై ప్రభావం చూపుతుంది. ముడిచమురు ధరలు పెరగడంతో జీడీపీలో క్యాడ్ నిష్పత్తి పెరుగుతుందని.. ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన 'ముడి చమురు ధరల ప్రభావం క్యాడ్, ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు' అనే నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను రిజర్వుబ్యాంకు చెందిన ఆర్థికవేత్తలు అధ్యయనం చేశారు.


ఒక వేళ ముడిచమురు ధరలు పీపా 85 డాలర్లకు చేరితో జీడీపీ వృద్ధిరేటుపై 43 బేసిస్ పాయింట్ల ప్రభావం చూపుతుందని, చమురు బిల్లు ఏకంగా 106.4 బిలియన్ డాలర్లు చేరుతుందని, ఈ మొత్తం చూస్తే దేశ జపీడీలోకి 3.61 శాతానికి చేరుతుందని నివేదికలో వివరించింది.

ముడిచమురు ధర పీపాకు 10 డాలర్లు పెరిగితే అదనంగా 12.5 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడుతుంది. దీని ప్రభావం దేశ జీడీపీపై 43 పాయింట్ల ఉంటుందని పేర్కొంది. ప్రతి పీపా పది డాలర్లు పెరిగితే జీడీపీలో క్యాడ్ నిష్పత్తి 43 పాయింట్లు పెరుతుందని నివేదికలో తెలిపింది.

ద్రవ్యోల్బణంపై ప్రభావం : తాజా అధ్యయనంలో ఒక వేళ ముడిచమురు ధరలు పెరిగితే దాని ప్రభావం ద్రవ్యోల్బణంపై పడుతుందని, ధరలు పెరిగితే అదే నేరుగా వినియోగదారుడిపై ప్రభావం చూపుతుందని వెల్లడించింది. తమ అంచనా ప్రకారం తక్కువలో తక్కువ పీపా పది డాలర్లు పెరిగి.. పీపా 65 డాలర్లకు చేరితే ద్రవ్యోల్బణం 49 బేసిస్ పాయింట్లు పెరుగుతుందని అంచనా వేసింది. ఒక వేళ పీపా 55 డాలర్లు పెరిగితే ద్రవ్యోల్బణం 58 బేసిస్ పాయింట్లు పెరుగుతుందని వెల్లడించింది.

ఒక వేళ ధరలు పెరిగినా.. వినియోగదారుడిపై పడకుండా ప్రభుత్వమే భరిస్తే.... ఉదాహరణకు పీపాకు 10 డాలర్లు పెరిగితే దాని ప్రభావం ద్రవ్యలోటుపై 43 బేసిస్ పాయింట్లు ప్రభావం చూపుతుందని తెలిపింది. ఒక వేళ ముడిచమురు ధరలు పెరిగినా.. వాటిని వినియోగదారుడిపై రుద్దకుండా ప్రభుత్వమే భరిస్తే ద్రవ్యలోటు భారీగా పెరిగిపోతుందని వివరించింది. అయితే ప్రభుత్వం ఎంత వరకు భరిస్తుందనే దానిపై వాస్తవ ద్రవ్యోల్బణం.. ద్రవ్యలోటు ఆధారపడి ఉంటుందని, (పన్నుల్లో మార్పులు - సబ్సిడీ) తదితర అంశాలపై కూడా ఆధారపడి ఉంటుందని ఆర్‌బీఐ తాజా అధ్యయనంలో వివరించింది.

ఆంధ్రాబ్యాంక్ బిజినెస్ కరస్పాండెట్ల నియామకం



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఆంధ్రాబ్యాంకు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి 1,600 బిజినెస్ కర్పస్పాండెట్లను (బీసీ)లను నియమించుకుంది. వీరి ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగణాల్లో మారుమూల ప్రాంతాల్లో కూడా బ్యాంకు సేవలను విస్తరిస్తుంది. వాటిలో భాగంగా ఖాతాలు తెరిపించడం, ఇంటివద్దనే బ్యాంకింగ్ సేవలందించడం, ఏటీఎం సేవలందించడం, మొండిబకాయిలు వసూలు చేయడం తదితర అంశాలను బీసీలు చూస్తారు. కాగా బ్యాంకు 2010 నుంచి ఫైనాన్షియల్ ఇంక్లూజెన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తాజాగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మైక్రో ఎటీఎంలు/ కియాస్క్ సేవలందిస్తోంది. ఈ బీసీలు ఆర్థికసేవలతో పాటు ఆర్థికేతర లావాదేవీలను కూడా చూస్తారు. ఉదాహరణకు బ్యాంకు మొండి బకాయిలు వసూలు చేయడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత స్కీంలలో పేర్లు నమోదు చేయించడం, బ్యాంకు కొత్త వ్యాపారాలకు విస్తృత ప్రచారం కల్పించడం తదితర అంశాలను కూడా బీసీలు చేపడతారు. దీంతో పాటు ప్రభుత్వం పథకాలు.. ఆధార్‌తో మొబైల్, పాన్‌కార్డు అనుసంధానం చేయించడం, బీమా పాలసీ అమ్మకా లు, బ్యాంకుల్లో వచ్చే కొత్త స్కీంల గురించి ఎప్పటికప్పుడూ ఖాతాదా రులకు వాటిపై అవగాహన కలిగించడం తదితర పనులు వీరు చేపడతారు.

2018 మ్యూచువల్ ఫండ్స్ ఆస్తులు

రూ. 1.24 లక్షల కోట్లు పెరిగాయి

న్యూఢిల్లీ : రోజు రోజుకు మ్యూచువల్‌ఫండ్స్‌కు ఆదరణ పెరుగుతోంది. 2018లో ఏకంగా రూ.1.24 లక్షల కోట్ల ఆస్తులు పెరిగాయి. సిప్ నుంచి పెట్టుబడులు పెరగడంతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో ఎంఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టడమే దీనికి కారణం. అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) కింద గత ఏడాది ఏకంగా రూ.1.24 లక్షల కోట్లు పెరిగి డిసెంబర్ చివరి నాటికి ఎంఎఫ్ ఆస్తులు రూ.23.61 లక్షల కోట్లకు ఎగబాకాయి. అంతకు ముందు అంటే డిసెంబర్ 2017 చివరి నాటికి ఇవి రూ.22.37 లక్షల కోట్లుగా నమోదైందని అసోసియేషన్ ఆఫ్ మ్యుచువల్‌ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్‌ఐ) గణాంకాలు తెలియజేస్తున్నాయి. అయితే 2017లో పోల్చుకుంటే 2018లో ఏయూఎం తగ్గినట్లే భావించాల్సి ఉంటుంది. 2017లో మ్యుచువల్‌ఫండ్స్‌లోకి ఏకంగా 5.4 లక్షల కోట్లు అదనపు పెట్టుబడులు రావడంతో 32 శాతం వృద్ధి కనిపించింది. పెట్టుబడులు తగ్గడానికి మార్కెట్లు ఒడిదుడుకులకు గురికావడంతో పాటు ఐఎల్‌అండ్ఎఫ్ఎస్ డిఫాల్ట్‌తో పాటు ఎన్‌బీఎఫ్‌సీ రంగం నగదు కటకట ఏర్పడ్డం తదితర అంశాలే కారణాలని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.

బ్యాంకుల్లో కొలువులే కొలువులు



న్యూఢిల్లీ : ప్రభుత్వరం గానికి చెందిన బ్యాంకుల్లో రాబోయే రోజుల్లో పెద్దెత్తున రిటైర్మెంట్‌ల ద్వారా పెద్ద మొత్తంలో ఖాళీలు ఏర్పడు తున్నాయి. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్‌లో నియామకాలు చేపట్టబోతోంది. ఖాళీల విషయానికి వస్తే 95 శాతం ఖాళీలు జీఎం స్థాయిలో ఉంటే, 75 శాతం డిప్యూటీ జీఎం స్థాయిలో ఉంటాయి. 58 శాతం అదనపు జీఎం స్థాయిలో ఉంటాయని వీరంతా 2019-20 నాటికి రిటైర్మెంట్ అవుతారు. వీరితో పాటు క్లరికల్, ప్రొబేష నరీ ఆఫీసర్, స్పెషలిస్టు ఆఫీసర్ హోదాల్లో కూడా ఖాళీలు ఏర్పడతాయని ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సొనల్ సెలక్షన్ నుంచి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక ప్రకారం బ్యాంకు కొలువులకు అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడానికి ప్రధాన కారణం. పని ఒత్తడి ఎక్కువ కావడంతో పాటు పనిగంటలు ఎక్కువ, దీని తగ్గట్టు జీతాలు / ఇన్సెంటివ్ ప్యాకేజీ ప్రోత్సహకరంగా లేకపోవడంతో బ్యాంకు ఉద్యోగాలు ఆకర్షణీయంగా లేవని గత వారం పార్లమెంటుకు సమర్పించిన పార్లమెంటరీ ప్యానెల్ నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్యానెల్‌కు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం వీరప్పమొయిలీ నేతృత్వం వహించారు. పీఎస్‌యు బ్యాంకులో సమీప భవిష్యత్తులో పెద్దమొత్తంలో ఖాళీలు ఏర్పడ్డం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

విదేశీ పీఎస్‌యు బ్యాంకుల్లో కోత

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన విదేశీ బ్రాంచీల కోతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే కొన్ని నెలల్లో 69 బ్రాంచీలను మూసివేసి ఖర్చును తగ్గించుకోవాలనుకుంటోంది. గతేడాది 216 పీఎస్‌యు బ్యాంకులను మూసివేయాలని ప్రభుత్వం అధ్యయనం చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. సమీక్ష తర్వాత ఇప్పటికి 35 విదేశీ బ్యాంకులను మూసివేయడం జరిగింది.. త్వరలోనే మరో 69 బ్యాంకులను మూసివేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. లాభదాయకం కానీ బ్యాంకులను మూసివేయడంతో పాటు ఒకే నగరంలో పలు బ్రాంచీలు ఉండి లేదా ఒకే నగరంలో దగ్గర దగ్గరగా బ్రాంచీలు ఉంటే కూడా బ్రాంచీలను మూసివేయాలని నిర్ణయించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. జనవరి 31,2018 నాటికి విదేశాల్లో 165 పీఎస్‌బీ బ్యాంకులు పనిచేస్తున్నాయి. దీంతో పాటు అనుబంధ బ్యాంకులు, భాగస్వామ్యంతో చేపట్టిన రెప్రజెంటెటివ్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. అత్యధికంగా ఎస్‌బీఐకి 52 బ్రాంచీలు ఉంటే, బ్యాంకు ఆఫ్ బరోడాకు 50, బ్యాంకు ఆఫ్ ఇండియాకు 29 బ్రాంచీలున్నాయి. బ్రిటన్‌లో 32, హాంకాంగ్, యూఏఈలో చెరో 13, సింగపూర్‌లో 12 బ్రాంచీలు పనిచేస్తున్నాయి. 2016-17 లో మొత్తం 41 బ్రాంచీలు నష్టాలను చవిచూశాయి. అన్నీ ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు ఉదాహరణకు అలహాబాద్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్‌బరోడా, బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనెరాబ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు, ఇండియన్ ఒవర్‌సీస్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకులకు విదేశాల్లో బ్రాంచీలున్నాయి. ఈ బ్యాంకులన్నీ కలిసి ఒక నోట్ తయారు చేసి విదేశాల్లో బ్రాంచీలను తగ్గించుకోవాలనే నిర్ణయానికి వచ్చాయని చెబుతున్నారు.

షిండ్లేర్ ఆర్ అండ్ డీ హబ్



ముంబై : స్విస్‌కు చెందిన ఎస్కలేటర్, ఎలివేటర్ దిగ్గజం షిండ్లేర్ భారత్‌లో గ్లోబల్ మాన్యూఫ్యాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు కంపెనీ అధికారి తెలియజేశారు. షిండ్లేర్ గత 20 సంవత్సరాల నుంచి భారత్ మార్కెట్లో వ్యాపారాలు కొనసాగిస్తోంది. ఇక్కడే పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి.. డిజిటైజేషన్‌తో పాటు డేటా ఎనలిటిక్స్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. కాగా ప్రభుత్వం వివమానాశ్రయాలతో పాటు మెట్రో, రైల్వేలపై పెద్దమొత్తంలో వ్యయం చేస్తుండటంతో దీన్ని అవకాశంగా తీసుకొని తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆలొచిస్తున్నట్లు కంపెనీ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అశోక్ రామచంద్రన్ చెప్పారు. అలాగే రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌తో పాటు వాణిజ్య సెగ్మెంట్‌లో కూడా ఎలవేటర్స్, ఎస్కలేటర్స్‌పై పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో ఎలివేటర్స్‌లు, ఎస్కలేటర్స్ ఏడాదికి 80వేల యూనిట్ల డిమాండ్ ఉంటుందని.. వాటిలో 10వేల యూనిట్లు మాన్యువల్‌గా వినియోగించే లిఫ్టులున్నాయన్నారు.

ఈ 70వేల యూనిట్లే కాకుండా అసంఘటితరంగంలో కూడా ఎలవేటర్స్ అమ్మకా లు జరుగుతున్నా యని, రాబోయే సంవత్సరాల్లో దీని మార్కెట్ సైజు లక్ష యూనిట్లకు చేరుతుందని రామచంద్రన్ అభిప్రాయ పడుతున్నారు. స్థానికంగా అమ్మకాలు పెంచుకోవడానికి పూనేలో ఉన్న ప్లాంట్‌ను మరింత మెరుగు పరుస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏడాదికి 10వేల యూనిట్లను ఉత్పత్తి చేయడం జరుగుతోందన్నారు. ఇక ఎగుమతుల గురించి వివరిస్తూ.. భారత్ నుంచి బంగ్లదేశ్, శ్రీలంకకు ఎగుమతి చేస్తున్నామని.. ఇక నుంచి మధ్యప్రాచ్య దేశాలతో పాటు ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు చేయనున్నట్లు ఆయన వివరించారు. స్కిల్ ఇండియా లో భాగంగా యూనివర్శిటీ ట్రెయినింగ్ సెంటర్‌తో పాటు ఉద్యోగులతో పాటు ఇతరులకు నాణ్యత ప్రమాణాలతో పాటు భద్రతపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

లౌరేటి నుంచి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ డియాన్ ఎక్స్



న్యూఢిల్లీ : లండన్‌కు చెందిన లౌరెటి ఆటోమెటివ్ కార్పొరే షన్ భారత్ మార్కెట్లో 2021 నాటికి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ డియాన్ ఎక్స్‌ను విడుదల చేయాలనే ఆలోచనలో ఉంది. దీనికి కోసం పుదుచ్చేరి ప్లాంట్‌పై 370 మిలియన్ డాలర్లు లేదా రూ.2,577కోట్లు పెట్టుబడులు పెట్టి తయారీప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏడాదికి 10వేల యూనిట్లను ఉత్పత్తి చేయాలనే ఆలోచనలో ఉంది. 2023 నాటికి వీటిని 20వేల యూనిట్లకు విస్తరిస్తుంది. పుదుచ్చేరిలోని విడిభాగాలను ఉత్పత్తి చేయడంతో పాటు స్థానికంగానే అసెంబ్లింగ్ చేస్తుంది. 2021 మూడవ త్రైమాసికం నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభిస్తుందని లౌరెటి ఆటోమొటివ్ కార్పొరేషన్ సీఈవో మార్కస్ పాలేట్ చెప్పారు. ఇక ఫీచర్ల విషయానికి వస్తే సింగిల్ చార్జితో 540 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. భారత్ మార్కెట్‌తో పాటు యూరోపియన్ మార్కెట్ కోసం 2021లోనే ఒకేసారి రెండు మార్కెట్లో విడుదల చేస్తుం ది. ఈ కారు ధర గురించి అడిగినప్పుడు సువూరు రూ.40 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. కేవలం 5.4 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీనికి అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేసినట్లు సీఈవో వివ రించారు. సింగిల్ చార్జీతో 540 కిలోమీటర్లు ప్రయా ణిస్తుందా లేదా అని ఈ ఏడాది ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తుంది. 12 చార్జీలతో మొత్తం 6,000 కిలోమీ టర్లు ప్రయాణి స్తుందా లేదా అని చూస్తున్నామని, ముఖ్యంగా లెహ (జమ్ము -కాశ్మీర్) నుంచి చెన్నై తమిళనాడు వరకు దారి మధ్యలో ఉండే నగరాల ద్వారా ఈ కారును పరీక్షిస్తామని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభు త్వాల సహకారంతో చార్జింగ్ స్టేషన్‌లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కేంద్రప్రభు త్వం దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపుదిద్దుతుందని తమ కంపెనీ కూడా దీనికి చేయూనిస్తుందని మార్కస్ చెప్పారు. ప్రస్తుతం లౌరెటి ఆపరేషన్ డిజైన్, ఆర్‌అండ్‌డి, ప్రొటోటైపింగ్ బ్రిటన్, స్పెయిన్‌లో చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ వారం మార్కెట్

ఫలితాలు గణాంకాలు కీలకం

ముంబై : ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే.. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఫలితాల బోణి మొదలుకానుంది. ముందుగా టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలతో క్యూ3 ఫలితాల సీజన్ మొదలవుతుంది. దీంతో పాటు అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు దేశీయ మార్కెట్లను ముందుకు నడుపుతాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక దేశ సూక్ష్మ ఆర్థిక గణాంకాల విషయానికి వస్తే ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కీలకం కానున్నాయి. ఈ వారంలోనే తయారీరంగానికి చెందిన పీఎంఐ గణాంకాలతో పాటు పారిశ్రామికోత్పత్తి గణాంకాలు, ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి. దీంతో మార్కెట్లు ఒడిదుడకులకు గురయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 10వ తేదీన జీఎస్టి కౌన్సిల్ సమావేశం జరగనుంది. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి, ముడిచమురు ధరలు, విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో పెట్టే పెట్టుబడులు మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఈ వారంలోనే పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడనున్నాయి. దీని ప్రభావం మార్కెట్లపై ఖచ్చితంగా ఉంటుంది. చైనా -అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నాయని వార్తలు రావడంతో గత శుక్రవారం నాడు గ్లోబల్ మార్కెట్లు పుంజుకున్నాయి. ఈ వారం ప్రారంభంలో అమెరికా అధికారులు చైనాకు పర్యటించి ముఖాముఖి వాణిజ్య చర్చలు మొదలుపెడతారు. ఇరు దేశాల అధ్యక్షులు, ట్రంప్, జిన్‌పింగ్ వాణిజ్య యుద్ధానికి తెరదించుతామని ఒక అంగీకారానికి వచ్చారు. కాగా గత వారం సెన్సెక్స్ 381.62 పాయింట్ల వరకు నష్టపోయింది.

రూ. 83వేల కోట్లు వెనక్కి

● 2018లో విదేశీ పెట్టుబడులు

● ముడి చుమురు ధరలు, రూపాయి పతనమే కారణం



న్యూఢిల్లీ : విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌పీఐ)లు 2018లో దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి రూ.83వేల కోట్లు తరించుకు పోయారు. అంతకు ముందు ఏడాది రికార్డుస్థాయిలో రూ.2 లక్షలకోట్ల వరకు దేశీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాయి. అమెరికా సెంట్రల్ బ్యాంకు .. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు పెంచడం, గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, డాలర్ మారకంతో రూపాయి బలహీన పడ్డం తదితర కారణాల వల్ల ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపస oహరించారు. ఈ ఏడాది 2019 విషయానికి వస్తే పెట్టుబడులు పరిమితి స్థాయిలోనే రావచ్చునని మార్కెట్ విశ్లేషకులు చెబుతు న్నారు. ఎందు కంటే వచ్చే వేసవిలో జరిగే ఎన్నికల తర్వాత కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడే వరకు పరిస్థితులు ఇలానే ఉండవచ్చునని వారు అభిప్రాయప డుతు న్నారు. విదేశీ పోర్టుపో లియో ఇన్వె స్టర్లు గత ఏడాది మొత్తానికి రూ.83,146 కోట్లు దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి తరలించుకు పోయారు. వాటిలో రూ.33,533 కోట్లు ఈక్విటీ మార్కెట్ నుంచి రూ.49,593 కోట్లు డెట్ మార్కెట్ నుంచి ఉపసంహరించినట్లు డిపాజిటర్స్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎఫ్‌పీఐ పెట్టుబడుల విషయానికి వస్తే 2002 తర్వాత ఈ స్థాయిలో పెట్టుబడులు తరలిపోవడం ఇదే మొదటిసారి. ఇక విదేశీ ఇన్వెస్టర్ల విషయానికి వస్తే 2017లో రూ.51వేల కోట్లు పెట్టుబడులు పెడితే.. 2016లో రూ.20,500 కోట్లు, 2015లో రూ.17,800 కోట్లు, 2014లో రూ.97వేల కోట్లు, 2013లో రూ.1.13 లక్షల కోట్లు రూ.2012లో 1.28 లక్షల కోట్లు దేశీయ మార్కెట్లో పెట్టబడులు పెట్టాయి. అంతకు ముందు అంటే 2011లో ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు తరలించుకుపోగా.. అంతకు ముందు 2008లో కూడా పెద్ద మొత్తంలో షేర్లు విక్రయించి తమ పెట్టుబడులు తరలిచుకుపోయినట్లు రికార్డులు చెబుతున్నాయి. డెబిట్ మార్కెట్ విషయానికి వస్తే 2016లో రూ.43,600 కోట్లు ఉపసంహరించుకోగా.. అటు తర్వాత 2017లో రూ.1.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు తరలించాయి. 2018 ప్రారంభంలో పెద్దమొత్తంలో పెట్టుబడులతో మొదలుపెట్టినా.. తర్వాత తర్వాత పరిస్థితులు మారిపోవడంతో ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించారు. గ్లోబల్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలికానికి క్యాపటిల్ గెయి న్ టాక్స్‌ను ప్రవేశపెట్టడం తదితర కారణాల వ ల్ల విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్ల నుంచి క్రమంగా పెట్టుబడులను ఉపసంహరించడం మొదలు పెట్టారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

స్థానిక ఎన్నికలకు
చొరవ తీసుకోండి

• పవన్‌కు లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్ వినతి



అమరావతి, ఆంధ్రప్రభ : స్థానిక సంస్థల బలోపేతానికి చొరవ తీసుకోవాలని లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ సభ్యులు ఆదివారం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనీ లేనిపక్షంలో ప్రత్యేక అధికారుల పాలన రద్దు చేసి,ఎన్నికల నిర్వహణ వరకు సర్పంచ్‌లను, పాలక వర్గాన్ని ఆపద్ధర్మంగా కొనసాగించాలని కోరారు. 73వ రాజ్యాంగ సవరణను అమలు డిమాండ్‌ను అన్ని పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని అన్నారు. ఈ డిమాండ్‌తో ఏర్పాటు చేయనున్న సదస్సుకు రావాల్సిందిగా చాంబర్ సభ్యులు పవన్‌కల్యాణ్‌ను ఆహ్వానించారు. పవన్‌కల్యాణ్‌ను కలిసిన వారిలో లోకల్ గవర్నమెంట్స్ చాంబర్ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు, పీకే రంగారావు, జి.వీరభద్రాచారి, అమరా సర్వదేవుళ్లు, టి.విజయకుమార్, పి.లక్ష్మయ్య, సూర్యచంద్రరావు, గంటా కృష్ణ దాసిర సత్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

సీఎం సభను తలపించిన
లోకేష్ జన్మభూమి సభ

• ఆస్తుల పంపిణీ, శ్రీసిటీ పర్యటన • పార్టీ శ్రేణులు, జిల్లా యంత్రాంగం బిజీబిజీ



తిరుపతి, ప్రభన్యూస్ : రాష్ట్ర ఐటి శాఖమంత్రి నారా లోకేష్ ఆదివారం పిచ్చాటూరులో జరిగిన జన్మభూమి సభలో పాల్గొన్నారు. అటుతర్వాత శ్రీసిటీలో జరిగిన కార్యక్రమాల్లోను పాల్గొన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో జిల్లా టిడిపి నేతలు, అధికార యంత్రాంగం అమితోత్సాహం చూపారనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ నెల 2వ తేదీన కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన, జన్మభూమి సభ ఏర్పాట్లు, రుణాల పంపిణీ, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాట్లు, కాలినడకన పలకరింపులు, హంగూ హంగామా, అధికారదర్పం ఏవిధంగా అయితే ఒక రాష్ట్రముఖ్యమంత్రికి పాటించారో, అంతకు మించి ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్‌పై ఆధరాభిమానాలు చూపించారు. లోకేష్ పిచ్చాటూరులో కాలు మోపింది మొదలు ఆయనకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం స్వాగత సత్కారాల్లో పూర్తిగా మునిగి పోయారు. లోకేష్ జన్మభూమి సభలో కూడా తన ప్రసంగంలో దాదాపుగా చంద్రబాబు లాగానే రాష్ట్రానికి అన్యాయం జరిగింది, ఈ రాష్ట్రాన్ని దుష్ట చతుష్టయం నాశనం చేయాలని చూస్తోంది. వారి భరతం పడతామంటూ అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఈసభకు జనం కూడా అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. సభా వేదిక కూడా దాదాపుగా కుప్పంలో ఏవిధంగా అయితే జన్మభూమి మాఊరు సభను ఏర్పాటు చేశారో అదే రీతిలో ఏర్పాటు చేయడం, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం ఓ ప్రత్యేకతను సంతరించు కుంది. పిచ్చాటూరు సభ అనంతరం శ్రీసిటీలో జరిగిన పారిశ్రామిక వేత్తల సమావేశంలోనూ ఓ సెల్‌ఫోన్ కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలోను లోకేష్ పాల్గొన్నారు. ఇక్కడ కూడా లోకేష్‌కు భాజా భజంత్రీలతో అపూర్వ ఘన స్వాగతాలు లభించాయి.

నేడు తిరువూరులో లోకేష్ పర్యటన!

• పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుంకుస్థాపన

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర పంచా యతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం కృష్ణా జిల్లా తిరు వూరు నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10గంటలకు తిరువూరు నియోజక వర్గానికి చేరుకోనున్న మంత్రి లోకేష్ అక్కడ ఏర్పాటైన అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించను న్నారు. అనంతరం తిరువూరు నియోజక వర్గంలోని ముష్టికుంట్ల గ్రామానికి చేరుకొని అక్కడ సీసీ రోడ్లు, నూతన గృహాలను ప్రారంభించి ఆగ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే 'జన్మభూమి-మావూరు' కార్యక్రమంలో పాల్గొనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మంత్రి లోకేష్ దాదాపు రూ.35కోట్ల వ్యయంతో నిర్మించిన పిఠాపురం సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని, పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఉప్పాడ సెంటర్ వద్ద జరిగే బహిరంగ సభలో మంత్రి లోకేష్ ప్రసంగించనున్నారు. ఈసభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ దగ్గరుండి పరిశీలిస్తున్నారు.

జలగన్న..
అవినీతి పుస్తకం

ట్విట్టర్‌లో మంత్రి లోకేష్



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రతిపక్షనేత జగన్‌పై మంత్రి లోకేష్ ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. 420, 840 కలిసి తమ అవినీతి పుత్రిక సైడెరెక్షన్‌లో జగన్-కసాంఐ దొంగలు అనే పుస్తకం వేశారని తెలిపారు. మహామేత హయాంలో జలగన్న దోచుకున్న లక్ష కోట్లతో నిర్మించిన అవినీతి సామ్రాజ్య వ్యాపారాల్లో వచ్చిన లాభం, వడ్డీలు లెక్కేసుకొని పుస్తకం వేశారని లోకేష్ దుయ్యబట్టారు. ఐదు సంవత్సరాల రాష్ట్ర బడ్జెట్ కంటే ఎక్కువ అవినీతి జరిగింది అంటున్న జలగన్న కేర్ ఆఫ్ అడ్రెస్ త్వరలో పిచ్చాసుపత్రి కాబోతుందని ట్వీట్ చేశారు.

చంద్రబాబుతో
హాస్య నటుడు అలీ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రముఖ సినీ హాస్య నటుడు అలీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఏకాంతంగా సమావేశమయ్యారు. ఆదివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చిన ఆయన సుమారు అర్ధగంట పాటు సీఎం చంద్రబాబుతో ఏకాంతంగా చర్చించారు. ఈ సందర్భంగా తాను వైకాపాలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని అలీ ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. విశాఖ ఎయిర్‌పోర్టులో వైకాపా అధినేత జగన్‌ను యాదృచ్ఛికంగా కలిశానే కానీ దీనిలో ఎలాంటి రాజకీయ కోణం లేదని తెలిపారు. ఇది ఇలా ఉంటే సినీనటుడు అలీ చంద్రబాబుతో భేటీకి ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కూడా సమావేశమయ్యారు. అయితే ఆయన ఎక్కడా కూడా మీడియాతో మాట్లాడకుండానే వెళ్ళిపోయారు. ఒకేరోజు ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో అలీ భేటీ కావడం చర్చాంశనీయంగా మారింది. ముస్లిం సామాజిక వర్గం అధికంగా ఉన్న గుంటూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసే ఆలోచనలో అలీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మూడు పార్టీల అధినేతలతో ఆయన ఏకాంతంగా సమావేశమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

'భాజపాతో
చేతులు కలిపిన జగన్'

అనంతపురం రూరల్, ప్రభ న్యూస్: ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా మోసం చేసిన భారతీయ జనతా పార్టీతో తన పై ఉన్న కేసులను మాఫీ చేయించుకునేందుకు స్వార్ధపూరిత అజెండాతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతులు కలిపారు. ఆయన్ను నమ్మితే నట్టేట మునిగినట్లేనని రాష్ట్రసాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం వస్తుందని వైఎస్ జగన్ పగటి కలలు కంటున్నారన్నారు. కోడి కత్తి కేసును కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించడం పై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి బిజేపికి తొత్తుగా వ్యవహరిస్తూ.. ఆంధ్రప్రదేశ్ పతనానికి పాటుపడుతున్నారన్నారు. అందుకే ఆయన్ను జగన్ విజయసాయిని రాజ్యసభ సభ్యునిగా చేశారన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ఎమ్మెల్సీ శమంతకమణి, ఎంఎస్ రాజు, దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ
పారిశ్రామిక పార్కులు

• ముసాయిదా సిద్ధం చేసిన ఈడీబీ • ఎగుమతులకు ఊతమిచ్చేలా పరిశ్రమల ఏర్పాటు
• ఎకరాకు రూ.27 లక్షల రాయితీకి నిర్ణయం • 300 ఎకరాల్లో పార్కుల ఏర్పాటుకు డీపీఆర్‌లు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేలా మరో కొత్త విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకురానుంది. ప్రైవేటు రంగంలోనూ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేలా ముసాయిదాను సిద్ధం చేసింది. పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేలా ఆర్థికాభివృద్ధి బోర్డు విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించింది.

రాష్ట్రాన్ని పరిశ్రమల కేంద్రంగా మార్చేందుకు మరో ముందడుగు పడింది. ప్రభుత్వ రంగంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుతోపాటు ప్రైవేటు రంగంలో కూడా ఈ విధానాన్ని అమలుచేసేలా కొత్త విధానానికి రూపకల్పన చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డు (ఈడాబీ) దీనికి సంబంధించిన ముసాయిదా సిద్ధం చేసింది. ప్రైవేటు రంగం నుండి పారిశ్రామిక పార్కులకు రావల్సిన పెట్టుబడులపై భాగస్వాములందరితోనూ ఈడీబీ చర్చించింది. ఈ పార్కుల్లో ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనతోపాటు ఎగుమతులకు ఊతమిచ్చేలా పరిశ్రమలను ఏర్పాటుచేయాలన్నది లక్ష్యం. ఈ అంశంపై పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ప్రైవేటు పరిశ్రమల ప్రతినిధుల సలహాలను ఈడీబీ తీసుకుంది. మహీంద్ర లైఫ్ స్పేస్, హిరందానిగ్రో, ఇండోని స్పేస్, తిస్మాన్ స్పియర్ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఎకరా ప్రాంతంలో అభివృద్ధిచేసే ఖర్చులో 25 శాతం ఆర్థిక సాయం చేయడంతోపాటు గరిష్టంగా రూ. 30 కోట్ల వరకూ పరిశ్రమలకు చెల్లించేసి ప్రోత్సహించేలా ముసాయిదా తయారుచేశారు. ప్రైవేటు సంస్థలు అభివృద్ధిచేసే పారిశ్రామిక పార్కులకు పారిశ్రామిక ప్రాంగణం బయట కల్పించే మౌలిక సదుపాయాల కోసం ఎకరాకు గరిష్టంగా రూ. 27 లక్షల రాయితీ కూడా ఇవ్వాలని తీర్మానించారు. భూమి కొనుగోళ్లకోసం చెల్లించే రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీని వంద శాతం తిరిగి చెల్లించాలని ఈ ముసాయిదాలో పొందుపరచారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులో ఏర్పాటయ్యే అన్ని యూనిట్లకు ప్రస్తుత పథకాల నుండి వచ్చే అన్ని రాయితీలను వర్తింపజేయాలని తీర్మానించారు. ముసాయిదాను మంత్రి మండలిలో ఆమోదింపజేసి కొత్త ఏడాది నుండే అమల్లోకి తేవాలని ఈడీబీ భావిస్తోంది. చైనా, వియత్నాం, తైవాన్ తరహా పారిశ్రామిక విధానాన్ని అనుసరిస్తూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో పరిశ్రమలను ఆకట్టుకునేలా దీని రూపకల్పన జరిగింది. రంగాలవారీగా, సెక్టార్లవారీగా పార్కులను ఏర్పాటు చేయాలన్నది ఈడీబీ లక్ష్యం. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఆహారశుద్ధి, ఫార్మా రంగాలకు ముసాయిదాలో అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. 300 ఎకరాల్లో ప్రైవేటురంగంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు కొన్ని సంస్థలు ఇప్పటికే డీపీఆర్‌లు సమర్పించాయి. పారిశ్రామిక పార్కుల్లో 40 శాతం పరిశ్రమలకు, 20 శాతం ప్రాంతాన్ని నివాస, వాణిజ్య అవసరాలకు వినియోగించుకునే అవకాశం కల్పించేలా ముసాయిదా రూపొందింది ఏకగవాక్ష విధానంలో 21 రోజుల్లోనే అన్ని అనుమతులు మంజూరు చేయనున్నారు.

పాలసీ : పారిశ్రామిక రంగంలో సుస్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థూల రాష్ట్రీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని ఆర్థిక ప్రగతిలో వేగవంతం చేయడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 2015-20ను తీసుకొచ్చింది.

లక్ష్యాలు

- జీఎస్‌డీపీలో 20.7 శాతం ఉన్న పారిశ్రామిక వృద్ధి శాతాన్ని 2020 నాటికి 25 శాతానికి చేర్చడం.
- జీఎస్‌డీపీలో తయారీ రంగంలో ఉన్న 9.95 శాతాన్ని 2020 నాటికి 15 శాతానికి పెంచడం.
- 2020 నాటికి రూ. 2 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం.
- 2020 నాటికి 10 లక్షల ఉద్యోగాలను కల్పించడం.
- రాష్ట్రప్రభుత్వం మరియు పెట్టుబడి దారుల మధ్య పీపీపీ భాగస్వామ్యంతో పారిశ్రామిక ప్రగతిని అభివృద్ధిచేసి ప్రపంచ స్థాయి పారిశ్రామిక పార్కును ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడం.
- ప్రైవేటు పారిశ్రామిక అభివృద్ధిలో సుస్థిరమైన అభివృద్ధి సాధించడం
- ప్రత్యేకమైన పాలసీల ద్వారా పారిశ్రామిక అవసరాలకోసం కేటాయించిన లేదా కేటాయించబడిన ప్రాంతాల్లో సాధారణ సౌకర్యాలతో
- మౌలిక సదుపాయాలను కల్పించడం, భవనాలను నిర్మించడం.
- పారిశ్రామిక ఉద్యానవనాలుగా అభివృద్ధి చేయడానికి సరైన భూమిని ఎంచుకునేందుకు ఒక ప్రత్యేక ప్రయోజన కదలికను సృష్టించడం.
- ఈ పారిశ్రామిక పార్కుల్లో కనీసం రూ. 200 కోట్ల పెట్టుబడులు పట్టాల్సి ఉంటుంది.
- కనీసం 100 ఎకరాల్లో ఈ పార్కులను ఏర్పాటు చేయనున్నారు. కేటాయించిన స్థలంలో 10 పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
- 33 శాతం నివాస ప్రాంతాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మిగిలిన 33 శాతం భూమి గ్రీనరీగా ఉండాలి.
- స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో కూడా పెట్టుబడులను ఆహ్వానించే ఏర్పాట్లు చేస్తున్నారు.

హైకోర్టుకు ఈ - ఆటోల గోల్‌మాల్ !

• రూ.50 కోట్ల అక్రమాలు జరిగాయంటూ పిటిషన్ • వివరాలు సమర్పించాలని సాంఘిక సంక్షేమ శాఖకు ఆదేశాలు • అక్రమాలను వెలికితీసిన 'ఆంధ్రప్రభ'

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరించే సుమారు రూ. 200 కోట్ల విలువ గల ఈ-ఆటో రిక్షాల కొనుగోలు పలు మలుపులు తిరుగుతున్నది. కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరిగాయని కొందరు హైకోర్టును ఆశ్రయించటం అధికార యంత్రాంగంలో కలకలం సృష్టించింది. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి, తస్మదీయ కంపెనీకి కట్టబెట్టారని ఆరోపిస్తూ కొనుగోళ్లపై విచారణ జరపాలని కోరుతూ చిన్న, మధ్యతరహ పరిశ్రమల యజమానులు హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. వీరి పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు సమాధానం చెప్పాల్సిందిగా సాంఘిక సంక్షేమశాఖ అధికారులను ఆదేశించింది. ఈ-ఆటోల వ్యవహారంపై ''ఆంధ్రప్రభ'' ధారావాహిక కథనాలు ప్రచురించిన విషయం విధితమే. హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేసిన ఎంఎస్ఎంఈలు ఆంధ్రప్రభ కథనాలను కోర్టుకు పొందుపరచటం విశేషం. ఆంధ్రప్రభ వరుస కథనాలు అధికార యంత్రాంగంలో ప్రకంపనలు సృష్టించాయి. దీంతో రెండుసార్లు టెండర్లను రద్దుచేసి, మూడోసారి టెండర్లను పిలిచారు. మూడోసారి జరిగిన టెండర్లలో కూడా అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆంధ్రప్రభ బట్టబయలు చేసింది. అయినా అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరించటంతో టెండర్‌లో పాల్గొన్న ఎంఎస్ఎంఈలు జరిగిన అక్రమాలపై హైకోర్టును ఆశ్రయించారు. అదేవిధంగా ఈ-రిక్షాలను అధిక ధరలకు కొనుగోలు చేయటం వలన తమపై ఆర్థికంగా పెనుభారం పడుతుందని లబ్ధిదారులు, ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులు కూడా హైకోర్టును ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే ఈ-ఆటోల కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసి, కేంద్ర నిఘా సంస్థలతో విచారణ జరపాలని కోరినట్లు తెలుస్తోంది. వీరితోపాటు జాతీయ సఫాయి కర్మకారుల అభివృద్ధి కార్పొరేషన్ నుంచి ఈ-రిక్షాల కొనుగోళ్లకు నిధులు వస్తున్న నేపథ్యంలో బీజేపీ నేతలు కూడా కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదు చేసి నిఘా సంస్థలతో విచారణ జరిపించాల్సిందిగా కోరనున్నట్లు తెలియవచ్చింది. కాగా రాష్ట్రంలోని ఎస్సీ కార్పొరేషన్‌కు కేంద్రం నుంచి సఫాయి కర్మచారి ఫైనాన్స్ కమిషన్ ద్వారా విడుదల చేసిన 200 కోట్లు, జాతీయ షెడ్యూల్డ్ కులాల ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మంజూరు చేసిన 1000 కోట్ల నుంచి కొనుగోలు చేయనున్న వాహనాల లావాదేవిల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ వీటిపై కూడా దర్యాప్తు జరిపి ఆ సొమ్మును నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలావుండగానే ఈ-ఆటోల ధరలు ఎక్కువగా ఉన్నాయని కృష్ణా, తూర్పు గోదావరి, విశాఖ, జిల్లాల అధికారులు ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేయటానికి నిర్ణయించిన రూ. 2.44 లక్షలు ధరను చూసి ఆటోల కొనుగోలుకు విముఖత చూపుతున్నారు. లక్షా 85 వేల ఆటోను 2.44 లక్షలకు కొనుగోలు చేయటం పట్ల సుమారు 50 కోట్ల రూపాయాలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లోని దళిత యువతకు జీవనోపాధి కల్పించేందుకు స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ పథకం కింద ఇళ్ల నుంచి చెత్త సేకరించేందుకు ఈ-ఆటోలు పంపిణీ చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినా, ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. తొలుత చిత్తూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల అధికారులు ఈ పథకంలో భాగంగా లబ్ధిదారుడికి ఈ ఆటోను అందజేసి వారు చెత్త సేకరించినందుకు నెలకు రూ. 16 వేలు వేతనం అందజేయాలని నిర్ణయించారు. ఎస్సీ కార్పొరేషన్ అందజేసే ఆటోలకు 50శాతం లేదా సబ్సిడీ లక్ష మించకుండా అందజేయనున్నారు. తొలుత లెడ్





ఫైల్ ఫోటో

యాసిడ్ బ్యాటరీతో చిత్తూరు జిల్లాకు 1.09లక్షలు, కృష్ణాజిల్లా 1.19 లక్షలు, పశ్చిమ గోదావరి 1.16 లక్షల వ్యయంతో ఆటోలను కొనుగోలు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత చిత్తూరు జిల్లాలో జన్మ భూమి సందర్భంగా కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ-ఆటోలను పంపిణీ చేశారు. ఈ- టెండర్‌లో సుమారు 50 కోట్ల రూపాయాలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. టెండర్‌లో జరిగిన అక్రమాలను ఎంఎస్ఎంఈలు మంత్రి నక్కా ఆనంద్‌బాబు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్ దృష్టికి తీసుకొచ్చిన ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.

రాష్ట్రప్రభుత్వం చిన్న, మధ్య తరహ పరిశ్రమల ఉత్పత్తులకు 20శాతం ప్రాధాన్యత ఇవ్వాలన్న నిబంధన ఉన్నా ఎస్సీకార్పొరేషన్ అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన కెనటిక్ గ్రీన్‌కు ఈ-ఆటోల టెండర్‌ను కట్టబెట్టారని కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఎంఎస్ఎంఈ కేపీ రావు ఆంధ్రప్రభకు చెప్పారు. అలాగే ఈ టెండర్‌ను కెనటిక్ గ్రీన్‌కు ఇవ్వాలనే ఉద్దేశంతోనే నియమావళిని రూపొందించారని ఆరోపించారు.

గుండె చెదిరింది...
తమిళనాడులో పెను విషాదం

• 11 మంది తెలంగాణ అయ్యప్పభక్తుల దుర్మరణం
• మరో ఐదుగురికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం • మృతులంతా యువకులే... మెదక్‌లో మరణఘోష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమిళనాడులో జరిగిన రోడ్డుప్రమాదంలో తెలంగాణకు చెందిన 11మంది భక్తులు దుర్మరణం పాలయ్యారన్న వార్త అందరినీ కలచివేసింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదం గురించి తెలిసి రాష్ట్రం నివ్వెర పోయింది. అందరి గుండె చెదిరిపోయింది. మృతు లంతా మెదక్ జిల్లాలోని నాలుగు గ్రామాలకు చెందినవారిగా గుర్తించారు. నిన్నమొన్నటిదాకా శరణుఘోష మధ్య.. ఆధ్యాత్మిక వాతావరణంతో ఆ ఊళ్లు కళకళలాడాయి. కానీ ఆదివారం ఆ కళ తప్పింది. అయ్యప్ప దర్శనం చేసుకుని తిరిగివస్తున్న తమవాళ్లంతా రోడ్డుప్రమాదంలో మరణించారని తెలియడంతో ఆ పల్లెలు మరణఘోషతో విలవిల లాడాయి. తమిళనా డులోని పుదుకొట్టై వద్ద అయ్యప్ప భక్తులు వెళతున్న వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొన్న ఘటనలో 11 మంది అయ్యప్ప భక్తులు మృతి చెందారు. వీరంతా ఏపీ-20 టీడీ 6809 రిజిస్ట్రేషన్ కలిగిన వ్యాన్‌లో ప్రయాణించారు. నాలుగు రోజుల క్రితం వీరు వ్యాన్‌లో బయల్దేరి వెళ్లారు. వ్యాన్ డ్రైవర్‌తో సహా మొత్తం 16 మంది అయ్యప్ప స్వాములు అయ్యప్ప దర్శనం కోసం శబరిమలై ఆలయాన్ని సందర్శించి తిరిగివస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతులంతా తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లా వాసులుగా గుర్తించారు. పుదుకొట్టైసమీ పంలోని



జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో ఏడుగురు మృతి చెందగా పుదుకొట్టై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఒక్కరు మినహా అందరూ పాతికేళ్లలోపవారే.

మృతుల వివరాలు...

మృతులు మెదక్ జిల్లా నర్సాపూర్, హత్నూర్ మండలాల్లోని ఖాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట, మంగాపూర్ గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులుగా గుర్తించారు. మృతులను నాగరాజు(35), మహేష్(28), కుమార్(22), శ్యామ్(22), ప్రవీణ్(22), సురేష్(25), కృష్ణ(35), సాయి(22), ఆంజనేయులు(25), వ్యాన్ డ్రైవర్ మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలిని జిల్లా కలెక్టర్ గణేష్ పరిశీలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుమయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురు క్షతగాత్రులు వెంకటేశ్వర్లు, రాజీ, నరేష్బా, మాగోలి శ్రీశైలంలుగా పోలీసులు గుర్తించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి విజయ్‌భాస్కర్ బాధితులను పరామర్శించారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

• ఉపముఖ్యమంత్రి కె.ఈ కృష్ణమూర్తి



మద్దికెర, ప్రభన్యూస్ : గర్భంలో ఉన్న శిశువు నుంచి మహాప్రస్థానానికి సాగనంపేంత వరకు అన్ని వర్గాల ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి పారదర్శకంగా పథకాలు అమలు పరుస్తున్న ఘనత టీడీపీకే దక్కిందని ఉప ముఖ్యమంత్రి కె ఈ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మద్దమ్మ కుంటలో జలహారతి కార్యక్రమానికిఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, జిల్లా కలెక్టర్ సత్యనారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా డిప్యూటీ సీఎం జలహారతిఇచ్చారు. అనంతరం మద్దికెర మెయిన్ బజారులో జరిగిన బహిరంగ సభలో హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం 125 పథకాలు పక్కాగా అమలు చేస్తుందన్నారు. రాష్ట్రం విడిపోయినపుడు లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికి సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజీ పడలేదన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం, సీసీ రోడ్లు, పక్కాగృహాలు, మురుగుదొడ్లు తదితర పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. చేతివృత్తుల వారికి పనిముట్లను ఆదరణ పథకం కింద ఇవ్వడం జరిగిందన్నారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి జన్మభూమి, మా ఊరు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కేంద్రం రాష్ట్రంలో వెనుకబడిన వారికి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పి మాట తప్పినప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కష్టంగా ఉన్నప్పటికి ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నారన్నారు. తనయుడు కేఈ శ్యాంబాబును వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు.

ఆకాశవీధుల్లో అమరావతి విహంగాలు

• ఏటేటా పెరుగుతున్న ప్రయాణికులు • 5.5 మిలియన్లకు చేరిక • కొత్త సర్వీసుల కోలాహలం • సింగపూర్ సర్వీసుకు ఆదరణ భేష్ • ఆపరేషన్స్‌లో దేశంలో 2వ స్థానం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన రంగం దినదినాభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల నుండి సాధారణ తరగతిలో ప్రయాణించిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 51,300 మంది ప్రయాణీకులు విమాన ప్రయాణం చేయగా అందులో ఏప్రిల్ నుండి నవంబరు మధ్య 47,050 మంది ప్రయాణించారు. రాష్ట్ర విభజన సమయంలో అంటే 2013-14 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.1 మిలియన్ పెర్సన్స్ పర్ యానమ్ (ఎంపీపీఏ)గా ఉన్న విమానయాన ప్రయాణీకుల సంఖ్య 2018-19 ఆర్థిక సంవత్సరానికి 5.5 ఎంపీపీఏకు చేరింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీ కూడా ఊహించని విధంగా పెరగడం మూలంగానే ఇది సాధ్యపడింది. రాష్ట్రం ఏర్పడిన సమయంలో 7 ఎంపీపీఏగా ఉన్న కనెక్టవిటీ ఇప్పుడు 15 ఎంపీపీఏకు పెరిగింది. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో



ప్రభుత్వం చేయూత

విమానయాన రంగాన్ని అభివృద్ధి పరచేందుకు గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విమానయాన రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం ఇక్కడి నుండి అనేక ప్రాంతాలకు విమాన సర్వీసులను నడిపేందుకు అటు విమానయాన సంస్థలతోనూ, ఇటు విమానయాన శాఖతోనూ పలు ధఫాలుగా సంప్రదింపులు జరిపి విజయం సాధించింది. అంతేకాకుండా రాష్ట్రప్రభుత్వం విమానాలకు వాడే ఇంధనం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయిల్ (ఏటీఎఫ్)పై విధించిన పన్నును 16 శాతం నుండి 1 శాతానికి తగ్గించింది. ఇది దేశంలోనే ప్రప్రథమంగా నిలచింది. రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన సివిల్ ఏవియేషన్ పాలసీ విమానయాన రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అన్ని విమానాశ్రయలను అభివృద్ధి పరచేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ఇండియా (ఏఏఐ)కు ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం భూ కేటాయింపులు చేసింది. విజయవాడ విమానాశ్రయానికి రూ. వెయ్యి కోట్ల విలువైన 700 ఎకరాల భూమిని కేటాయించింది. అలాగే రాజమండ్రి విమానాశ్రయ అభివృద్ధికి రూ. 300 కోట్ల విలువైన 857 ఎకరాల భూమిని, తిరుపతి విమానాశ్రయలను అభివృద్ధికి రూ. 200 కోట్ల విలువైన 725 ఎకరాల భూమిని, కడప విమానాశ్రయ అభివృద్ధికి రూ. 40 కోట్ల విలువైన 50 ఎకరాల భూమిని కేటాయించింది. వీటితోపాటు రూ. 130 కోట్లతో విజయవాడ విమానాశ్రయంలో నూతన టెర్మినల్‌ను కూడా ఏర్పాటు చేసింది. మరో రూ. 660 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమైంది. తిరుపతి విమానాశ్రయంలో రన్‌వే విస్తరణతోపాటు కొత్త టెర్మినల్ భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. రాజమండ్రి విమానాశ్రయంలో రన్‌వే విస్తరణ పనులు దాదాపు పూర్తి అయ్యే దశకు చేరుకున్నాయి. కాకినాడ విమానాశ్రయంలో కూడా ఈ పనులు చురుకుగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కనెక్టవిటీ పథకాన్ని ప్రవేశపెట్టకముందే రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన ఏవియేషన్ పాలసీ ద్వారా ఏపీ రీజినల్ ఏర్‌పోర్టు డెవలప్‌మెంట్ ఫండ్ (ఏపీఆర్ఏడీఎఫ్)ను ఏర్పాటు చేసుకుంది. ఈ నిధులతో ప్రాంతీయ అనుసంధానం ఏర్పాటు చేసుకుని కడప విమానాశ్రయం నుండి రాకపోకలను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా తీర్చిదిద్దుతామని చెప్పి ఇచ్చిన హామీని విస్మరించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అంతర్జాతీయ సర్వీసులను తీసుకొచ్చేందుకు స్వంత నిధులను వెచ్చించింది.

విమానయాన ప్రయాణీకు సంఖ్య పెరిగిన అంశాన్ని ఈ రెండు అంశాలు ధృవీకరి స్తున్నాయి. అంతేకాకుండా ఈ నాలుగున్నరేళ్లలో విమానయాన రంగం 38 శాతం వృద్ధి సాధించింది. ఇది జాతీయ వృద్ధిరేటు (సీఏజీఆర్) శాతంతో పోలిస్తే రాష్ట్రంలో స్థూల వృద్ధిరేటు 12 శాతం ఎక్కువగా నమోదైం ది.దేశవ్యాప్తంగా ప్రయాణించే ప్రయాణీ కుల్లో ఏపీ నుండి ప్రయాణిం చేవారి సంఖ్య 1.7 శాతం ఉంది. దీంతో దేశంలోనే అత్యధి కంగా విమాన యానం చేసే రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో నిలచింది. అంతర్జాతీ య విమాన రవాణా రంగం లెక్కల ప్రకారం ప్రతి 100 అమెరికన్ డాలర్ల వ్యయం స్థానిక ఆర్థిక వ్యవ స్థకు 325 అమెరికన్ డాలర్ల ప్రయోజ నాన్ని చేకూర్చుతుంది.అంతేకాం కుండా విమానయాన రంగంలోని ప్రతి 100 ఉద్యోగాలు స్థానిక ఆర్థిక వ్యవస్థలో 610 కొత్త ఉద్యోగాల కల్పనకు దోహద ఎడ నున్నాయి. ఏపీలోని విమానాశ్రయాల్లో 4 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. రాష్ట్ర స్థూల ఆదాయం (జీడీజీ)లో విమానయాన రంగ ఆదాయం 1.2 శాతంగా నమోదైంది. కొత్తగా ఏర్పడిన

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు పబ్లిక్ ఆపరేషనల్ విమా నాశ్రయాలు ఉన్నాయి. వీటిలో విశాఖపట్టణం, విజయవాడ, రాజమండ్రి, తిరు పతి ఉండగా మరో ప్రైవేటు విమానాశ్రయం అనంతపురం జిల్లా పుట్టపర్తిలోఉంది. కడప జిల్లాలో మరో నాన్ ఆపరేషనల్ ఏర్‌పోర్టు కూడా ఉంది. రాష్ట్రంలోని విశాఖ విమానాశ్రయం నుండి మాత్రమే నిన్నమొన్నటి వరకూ అంతర్జాతీయ సర్వీసులు నడిచాయి. తాజాగా విజయవాడ విమానాశ్రయం నుండి నేరుగా సింగపూర్‌కు ఇటీవలే అంతర్జాతీయ సర్వీసును ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విమానాశ్రయాల్లో బోయింగ్ వంటి పెద్దపెద్ద విమానాలు దిగేందుకు అవసరమైన సదుపాయాలు లేవు. సహజంగా అంతర్జాతీయ సర్వీసులుగా నడిచే విమానాలన్నీ బోయింగ్ 747, 777, ఎయిర్ బస్ ఏ 330 వంటివిగా ఉంటాయి. అంతేకాకుండా ఇక్కడున్న విమానాశ్రయాల్లో ఏర్పాటు చేసిన టెర్మినల్స్ కూడా వచ్చివెళ్లే ప్రయాణీకుల సంఖ్యకు అనుగుణంగా లేవు. కానీ, ఇప్పుడు నాలుగేళ్ల తరువాత రాష్ట్ర రాజధాని అమరావతి మొట్టమొదటి సారిగా సింగపూర్‌కు తొలి అంతర్జాతీయ విమానాన్ని ప్రారంభించడం ద్వారా వార్తల్లాకెక్కింది. గతంలో ఉన్న టెర్మినల్స్‌ను ఆధునీకరించడంతోపాటు రన్‌వే విస్తరణ పనులు చేపట్టడంతోనే ఇది సాధ్యమైంది. ఇప్పుడు ఏర్పాటు చేసిన నూతన టెర్మినల్స్ ద్వారా కోడ్ డీ, కోడ్ ఈ వంటి బోయింగ్ 787, ఏ 321 వంటి విమానాలు ఇక్కడ లాండ్ అయ్యే అవకాశం కలి గింది. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టిలో విమాన యాన రంగం కీలక పాత్ర పోషి స్తోంది. రాష్ట్రానికి విమాన ప్రయాణీకుల సంఖ్య పెరగ డంతో అనేక మందికి ఉపాధి అవకా శాలు లభించాయి. అంతేకా కుండా పర్యాటక రంగంగా కూడా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

నూతన విమానాశ్రయాలు

విజయనగరం జిల్లాలోని భోగా పురం విమానాశ్రయాన్ని గ్రీన్ ఫీల్డ్ ఏర్‌పోర్టుగా నిర్మించనున్నారు. రూ. 2,302 కోట్లతో 2,700 ఎకరాల్లో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. నెల్లూరు జిల్లాలోని దగదర్తి విమానాశ్రాయాన్ని కూడా గ్రీన్ ఫీల్డ్ విమానాశ్ర యంగా నిర్మించనున్నారు. రూ. 224 కోట్లతో 1,399 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయ నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టును ఎస్‌సీఎల్ టర్బో కన్సార్టియం కంపెనీకి దక్కింది. 2020 మధ్య నాటికి ఈ విమానాశ్రయం వినియోగంలోకి రానుంది. ప్రస్తుతం ఈ విమానా శ్రయ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ. 110 కోట్లతో 1,010 ఎకరాల్లో నిర్మాణం పూర్తయింది. ఈనెలలో 8న విమానాశ్రయం ప్రారంభించనున్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఎయిర్ స్ట్రిప్‌ను రూ. 60 కోట్లతో 700 ఎకరాల్లో నిర్మిస్తు న్నారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. 2019 నాటికి ఈ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో హెలిపాడ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో స్థలాలను గుర్తించారు. ప్రభుత్వ స్థలాలు లేని ప్రాంతాల్లో ప్రైవేటు భూములు కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

అభ్యంతరకర పోస్టింగ్‌లపై ఫిర్యాదు!



అమరావతి, ఆంధ్రప్రభ: సోషల్ మీడియాలో అభ్యంతరక పోస్టులపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆదివారం విజయవాడ కృష్ణలంక సీఐకి ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థుల మీద, ప్రభుత్వాలను కించపరిచేరీతిలో, కులాలను అగౌరవపరిచేరీతిలో పోస్టింగ్లు పెడుతూ రాక్షసానందం పొందుతున్నారని, తాజాగా ఏపీ హైకోర్డు న్యాయమూర్తి జస్టిస్ గంగారాం ఫోటోలు మార్ఫింగ్ చేసి అందరు జడ్జీలు కూర్చున్నట్లుగా, దళితుడైనందున గంగారాం నిలబడినట్లు అభ్యంతరకర పోస్టులు పెట్టారని మండిపడ్డారు. ఇటువంటి చర్యలకు ఎవ్వరూ పాల్పడకుండా వారిపై వెంటనే చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని వర్లరామయ్య సీఐని కోరారు. గతంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక కులానికి అభీష్టంగా మాట్లాడినట్లు మార్ఫింగ్ పోస్ట్ విషయంలో కూడా వర్ల రామయ్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

సీమ రైతులను ఆదుకున్న చంద్రబాబు

• మంత్రి పరిటాల సునీత



అమరావతి, ఆంధ్రప్రభ: రాళ్ల సీమగా ఉన్న రాయలసీమను పచ్చని పంట పొలాలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, సెర్ఫ్ శాఖమంత్రి పరిటాల సునీత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా, కనగాపల్లి మండలం, బాలేపాళ్యం గ్రామాల సమీపంలోని రైతుల వ్యవసాయక్షేత్రంలో వేరుశెనగ పంటలను మంత్రి పరిశీలించారు. పంట పొలమంతా కలియ తిరుగుతూ తన అనుభూతిని మంత్రి రైతులతో పంచుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంత్రిగా తీరక లేకుండా గడుపుతూ పంట పొలాల మధ్యకు రాగానే కలిగే ఆనందం, సంతృప్తి మరేదానిలో రాదన్నారు. హంద్రీనీవా ద్వారా నీళ్లు రావడంతో జిల్లాలో భూగర్భ జలాలు బాగా పెరిగాయని, దీనితో రైతులు పంట పొలాల్లో బోర్లు వేయించుకొని పంటలు పండించుకొని ఆనందంగా ఉన్నారని తెలిపారు. పనులు లేక వలసలు పోతున్న ఈప్రాంత ప్రజలు కృష్ణా జలాల రాకతో సొంత పొలాల్లో పంటలు పండించుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. నిరంతరం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు అండగా ఉంటామని రైతాంగం చెబుతోందని స్పష్టంచేశారు.

పోలవరాన్ని పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే

• ప్రపంచ రికార్డుతో నూతన అధ్యాయానికి శ్రీకారం: నవయుగ ఎండీ శ్రీధర్
• పోలవరం ప్రాజెక్టు సందర్శనలో ఢిల్లీ మీడియా • గిన్నిస్ రికార్డ్ పనులను పరిశీలించిన జర్నలిస్టులు



పోలవరం, ఆంధ్రప్రభ : ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకంగా గోదావరి నదిపై నిర్మితమవుతున్న పోలవరం ప్రాజెక్ట్ గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకోవడం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గర్వకారణమని ఢిల్లీ మీడియా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గిన్నిస్ రికార్డ్ పనులను చూసేందుకు ఏపీ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఢిల్లీ నుంచి వివిధ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు ఆదివారం పోలవరం చేరుకున్నారు. జర్నలిస్టులు ప్రవీణ్ కుమార్, ప్రదీప్, వెంకటేష్, ఆచార్య శరత్ చంద్ర, గోపీకృష్ణ, మదార్, రామకృష్ణ, స్వరూప పొట్లపల్లి, సీఎం ఓఎస్డీ తేలప్రోలు శ్రీనివాసరావు, ఢిల్లీ ఐ అండ్ పీఆర్ ప్రత్యేకాధికారి జయరావు ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టును సందర్శించారు.. పట్టిసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, మోడల్ హౌస్, స్పిల్ వే, గిన్నిస్ రికార్డు కాంక్రీట్ పనులను జర్నలిస్టుల బృందం సందర్శించింది. నవయుగ ఎండీ శ్రీధర్, ఇంజనీర్లు బాలకృష్ణ, పరమానందం, గౌరీశంకర్ జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. నవయుగ ఎండీ శ్రీధర్ ఆంధ్రప్రభతో మాట్లాడుతూ 6 వేల మంది కార్మికులతో రెండు షిఫ్టులలో నిరంతరాయంగా పనులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 24 గంటల్లో 34 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేయనునట్లు అంచనా వేస్తున్నట్టు ఎండీ శ్రీధర్ తెలిపారు. రాత్రి 9 గంటలకే పాత రికార్డును బ్రేక్ చేయడం గొప్ప అనుభూతి అన్నారు. ఈ రికార్డు నవయుగ కంపెనీకి చెందుతుందని, ఏపీ ప్రభుత్వం, అధికారుల సహకారం మరువలేనిదని కొనియాడారు. తమ సంస్థ వివిధ రాష్ట్రాలలో ప్రాజెక్టుల నిర్మాణ పనులు చేపడుతుందని, మిగతా రాష్ట్రాల కంటే తెలుగు రాష్ట్రాలు చిత్తశుద్ధితో పని చేస్తున్నాయని తెలిపారు. రాత్రి సమయంలో నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని గిన్నిస్ రికార్డ్ కాంక్రీట్ పనులను పరిశీలించారు. అనంతరం ఆంధ్రప్రభతో మాట్లాడుతూ... 1941 నుంచి ప్రాజెక్టు పనులు జరుగుతున్నా ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసే గొప్ప అవకాశం చంద్రబాబుకు దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం ప్రాజెక్టు విషయంలో ప్రత్యేక శ్రద్ధతో పనులు పూర్తి చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ గిన్నిస్ రికార్డును సాధించే పనులను దగ్గరుండి పరిశీలించడం ఎంతో సంతోషాన్నిచిందని జర్నలిస్టులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన వార్తల కవరేజ్ లో తలెత్తే అనేక సందేహాలకు ఈ స్టడీ టూర్ లో సమాధానాలు దొరికాయని అన్నారు. లక్షల ఎకరాలకు నీరందించే పోలవరం ప్రాజెక్ట్ రైతుల పాలిట వరప్రదాయిని అని కొనియాడారు.

నేటి నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయం

అమరావతి, ఆంధ్రప్రభ: వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20కు గాను విద్యుత్ ఛార్జీలను నిర్ణయించేందుకు రాష్ట్రవ్యాప్తం గా ప్రజాభిప్రాయ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ జీ భవానీప్రసాద్ తెలియజేశారు. ఈమేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.. రాష్ట్రం విద్యుత్ వినియోగాన్ని పెంచడంతోపాటు ఆర్థిక సాధికారత పెంపొందించేందుకు ఏపీఈ ఆర్‌సీ ఇటువంటి కార్యక్రమాలను చేపట్టనున్నామన్నారు. అంతేకాకుండా చివరి విద్యుత్ వినియోగదారుడికి కూడా నాణ్యమైన నిరంతరాయ విద్యుత్తును సరసమైన ధరల్లో అందించేందుకు నిరంతర కృషి జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగా జనవరి 7 నుండి ఫిబ్రవరి 19 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నట్లు వివరించారు. ఏపీలో జనవరి 7న విశాఖపట్టణంలోనూ, 8న విజజయవాడ, 9న తిరుపతిల్లో ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా జనవరి 18, 25, ఫిబ్రవరి 1 తేదీల్లో హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలోనూ ఈ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తామన్నారు. వినియోగదారులే తమకు ప్రథమ ప్రాధాన్యమన్నారు. వారిచ్చే సూచనలు, సలహాలను ఆచరిస్తూ విద్యుత్ ఛార్జీల పెంపు, సరఫరా తదితర అంశాల్లో ఇప్పటికే విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నామని చెప్పారు.

అమెరికాలో మహబూబాబాద్ విద్యార్థిపై కాల్పులు

• దుండగుల దాడిలో యువకుడికి గాయాలు



మహబూబాబాద్, ప్రభన్యూస్ :అమెరికాలో మానుకోట విద్యార్థిపై కాల్పులు జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబాబాద్ పట్టణానికి చెందిన పూస సాయికృష్ణ అనే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థిపై అమెరికాలో ఈ నెల మూడున కాల్పులు జరిగినట్లు సాయి క్రిష్ణసమీప బంధువు శివానంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేఖరులతో మాట్లాడారు. స్థానిక వేణుగోపాల స్వామి గుడి దేవాలయ సమీపంలో నివాసముంటున్న పూస ఎల్లయ్య, శైలజ దంపతులకు ఇద్దరు సంతానం సాయి కృష్ణతో పాటు మరో కూతురు ఉంది. సాయి క్రిష్ణ నాలుగు సంవత్సరాల క్రితం ఉన్నత విద్యకోసం అమెరికాకు వెళ్లాడు. యుఎస్ఏలోని మిచిగాన్ రాష్ట్రంలోని లారెన్స్ టెక్ యూనివర్సిటీలో ఎంఎస్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. నెల రోజుల క్రితం ఆయన ఉద్యోగంలో చేరారు. ఈ నెల మూడున ఓ రెస్టారెంట్ వెళ్లి పార్సిల్ తీసుకుని ఇంటికి తిరిగి వెళ్లుతుండగా అక్కడ గుర్తు తెలియని వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపారు. అనంతరం అగంతకులు కారుతో పాటు గుర్తింపు పత్రాలు అపహరించుకు పోయినట్లు తెలిసింది. దుండగులు జరిపిన కాల్పుల్లో సాయి క్రిష్ణ కుడి బుజంపై బుల్లెట్ గాయం అయినట్లు తెలిపారు. ఈ విషయమై పూర్తి సమాచారం కోసం అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమారుడిని చూసేందుకు అమెరికా వెళతామని ప్రభుత్వం తమకు సహకరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఎన్.టి.ఆర్. కథానాయకుడులో వెంకటేశ్వర స్వామిగా బాలకృష్ణ



అఖిల్

మిస్టర్ మజ్ను హార్ట్ బ్రేక్ సాంగ్

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం మిస్టర్ మజ్ను. వెంకీ అట్లూరి దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, ఎల్ఎల్‌పి పతాకాలపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా చిత్రీకరణ పూర్తికావచ్చిన ఈ చిత్రం మిగిలిన పనులు పూర్తిచేసి, ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకువి వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించి ఏమైనదో...పలుకు మరచినట్టు...పెదవికేమైనదో...టైటిల్ సాంగ్‌ను విడుదలచేయగా...అద్భుతమైన స్పందన లభించినట్లు చిత్రబృందం తెలియజేసింది. కాగా ఈ చిత్రంలోని హార్ట్ బ్రేక్ సాంగ్ నాలో నీకు...నీలో నాకు ఇక సెలవేనా...ప్రేమ కానీ ప్రేమ వదులుకుంటున్నా...అంటూ సాగే సాహిత్యాన్ని ఆదివారం విడుదల చేసినట్లు వారు తెలిపారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది తదితరులు ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: ధనుష్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్.



కైరా అద్వాని

బాలీవుడ్

బాద్‌షా షారుక్‌ఖాన్ కొత్త చిత్రానికి సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. భారీ అంచనాల మధ్య భారీ బడ్జెట్‌తో

కొత్త చిత్రం పనిలో

రూపొందిన జీరో చిత్రం ఆయనకు నిరాశనే మిగిల్చింది. ఆశించినంతగా ఆ చిత్రం బాక్సాఫీసు వద్ద కలెక్షన్లను రాబట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో తన కొత్త చిత్రంతోనైనా ఆయన ప్రేక్షకాభిమానులను మెప్పించాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తున్న సంగతి వేరుగా చెప్పనక్కరలేదు. వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు బయోపిక్‌లు చేసేందుకు మొగ్గుచూపుతున్న నేపథ్యంలో షారుక్‌ఖాన్ కూడా రాకేష్‌శర్మ బయోపిక్‌లో నటించేందుకు సన్నద్ధమవుతున్నారు. అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా రాకేష్‌శర్మ అందరికీ సుపరిచితమే. మొదట ఈ చిత్రానికి సారే జహాసే అచ్చా అనే టైటిల్‌ను ఈ చిత్రానికి అనుకున్నా...ఇప్పుడు దానిని సెల్యూట్‌గా మార్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అనురాగ్ బసు దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని రోనీ స్క్రూవాలా, సిద్ధార్థ్‌రాయ్‌కపూర్ సంయుక్తంగా నిర్మించబోతున్నారు. ఇదిలావుండగా...ఈ చిత్రంలో షారుక్ ఖాన్ సరసన ఫాతిమా సనా షేక్‌ను ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు బాలీవుడ్ వర్గాల భోగట్టా. గతంలో దంగల్, థగ్స్ ఆఫ్ హిందుస్థాన్ వంటి సినిమాలలో ఫాతిమా సనా షేక్ నటించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఫాతిమా కూడా ఇలాంటి సినిమాలలో అవకాశం రావడం అరుదు అని...ఆ అవకాశం నాకు లభిస్తే అంతకంటే కావాల్సింది ఇంకేముంది అని అంటోందట..



ఫాతిమా సనా షేక్


షారుక్ ఖాన్

బన్ని సరసన?

బాలీవుడ్ భామలు టాలీవుడ్‌లో నటిం చడం కొత్తేమీ కాదు. కాకపోతే ఎప్పుడో ఓ సినిమాలో నటించి... మళ్లీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంటుంటారు. అయితే కైరా అద్వాని ఇందుకు భిన్నంగా తెలుగులో వరు స సినిమాలకు పచ్చజెండా ఊపుతోం ది. మహేష్‌బాబు సరసన భరత్ అనే నేను చిత్రంలో కథానాయికగా నటిం చడం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన ఆమె అంతకుముందు కొన్ని బాలీవుడ్ సినిమాలు చేసింది. తెలు గులో నటించిన తొలి చిత్రమే ఘన విజయం సాధించడంతో ఆమె ఆనం దానికి అవధులు లేకుండాపోయా యి. అయితే ఆ సినిమా విడుదలకు ముందే రామ్‌చరణ్ సరసన వినయ విధేయ రామ చిత్రంలో నటించే అవ కాశాన్ని అందిపుచ్చుకుంది. సంక్రాం తికి విడుదల కానున్న ఆ సినిమా కూడా తన కెరీర్‌ను మరింత మలుపు తిప్పుతుందని కైరా ఎంతో నమ్మకం గా ఉంది. ఇప్పుడు ఆ రెండో సినిమా విడుదల కాకమునుపే ఇంకో భారీ సినిమాలో ఆమెకు అవకాశం లభిం చినట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. అల్లు అర్జున్ సరసన నటించే అవకా శం ఆమెను వెతుక్కుంటూ వచ్చిం దని...దీంతో ఆమె క్రేజ్ మరింతగా పెరగనుందని అంటున్నారు.

నా పేరు సూర్య... చిత్రం తర్వాత నూత న చిత్రం కోసం అల్లు అర్జున్ కొంత గ్యాప్ తీసుకున్నారు. ఎవరి దర్శక త్వంలో ఆయన నటించనున్నారనే అంశానికి ఎట్టకేలకు తెరపడింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్నారన్న వార్త వెలువడగానే...ఆయన సరసన కథానాయిక ఎవరన్న అంశంపై కైరా అద్వాని అయితే బావుంటుందన్న ఆలోచన చిత్రబృందానికి వచ్చిందని అంటున్నారు. ఆ మేరకు కథానా యికగా ఆమెను ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నారట. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని క్రి యే షన్స్ సంస్థ లు సంయుక్తంగా నిర్మిం చబోయే ఈ చిత్రం షూటింగ్ ఈ నెల లోనే ఆరంభం కానుంది.

నెలాఖరుకు సూపర్ 30



హృతిక్ రోషన్

బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ నటిస్తున్న కొత్త చిత్రం సూపర్ 30. వికాస్ బాల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విద్యావేత్త ఆనంద్ కుమార్ జీవిత కథతో ఈ సినిమా తెరకెక్కింది. పాట్నా నగరానికి చెందిన ఆనంద్...సూపర్ 30 అనే కార్యక్రమం ద్వారా అత్యంత ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఎంపిక చేసి వాళ్లకు ఐఐటీ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి దాకా సూపర్ 30 ద్వారా ఎందరో పేద విద్యార్థులు ఐఐటీలో ప్రవేశం పొందారు. ప్రపంచంలో ఎందరినో ఆలోచింపజేసింది ఆనంద్ కుమార్ కృషి. సమాజం పట్ల ఆయనకున్న సేవాదృక్పథం ఇప్పుడు బాలీవుడ్‌ను ఆకర్షించింది. ఈ నేపథ్యంతోనే సూపర్ 30 రూపొందింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సూపర్ 30లో నటించడంపై హృతిక్ స్పందిస్తూ....మన జీవితాల్లో అత్యంత గొప్ప విషయం సేవ. సమాజానికి, మన తోటి మనుషులకు సాయం చేయడం అనేది అత్యుత్తమం. నా పిల్లలకు ఇదే విషయాన్ని చెప్పాలని ప్రయత్నిస్తుంటాను. రేపు నేను వాళ్లకు ఇవ్వబోయే అసలైన ఆస్తి సేవా దృక్పథమే అనుకుంటాను. ఈ సామాజిక సేవ మన చుట్టూ సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. తద్వారా ప్రపంచాన్ని మార్చే శక్తినిస్తుంది. అన్నారు. ఈ నెల 25న సూపర్ 30 విడుదలకు సిద్ధమవుతోంది.

వండర్ వుమెన్ అవ్వాలని ఉంది...!

హాలీవుడ్‌లో సూపర్ హీరో చిత్రాలంటే కథానాయకులే గుర్తొస్తారు. తొలిసారి ఓ నాయికను సూపర్‌హీరోగా చూపిస్తూ రూపొందిన చిత్రం వండర్ ఉమెన్. డీసీ కామిక్స్ రచన ఆధారంగా దర్శకుడు పాటీ జెన్‌కిన్స్ ఈ చిత్రాన్ని రూపొందించారు. వార్నర్ బ్రదర్స్ సంస్థ పంపిణీ చేసిన వండర్ ఉమెన్..ప్రపంచ వ్యాప్తంగా వసూళ్లు కొల్లగొట్టింది. పెట్టుబడికి ఏడింతల లాభాలను తీసుకొచ్చింది. ఈ చిత్ర స్ఫూర్తితో మరింతమంది హాలీవుడ్ నాయికలు సూపర్‌హీరో చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నారు. తామూ సూపర్ హీరోలు అవ్వాలని ఉవిళ్లూరుతున్నారు. ఇలాంటి వాళ్లలో ముందుగా స్పందించింది రాచెల్ వైజ్. మమ్మీ చిత్రాలు చూసిన వాళ్లంతా ఈ నాయికను అభిమానిస్తారు. ఈ నాయిక ప్రస్తుతం సూపర్ హీరో కావాలనుకుంటోంది. ఈ విషయంపై రాచెల్ మాట్లాడుతూ...చిన్న చిత్రాలు చేసే ఉద్దేశంలో నాలో ఉన్నా...భారీ చిత్రాల్లో భాగమయ్యేందుకు ఆత్రుతగా ఉన్నాను. నాయిక ప్రధాన చిత్రాలు చేయాలనే ఆశ ఎక్కువగా కలుగుతోంది. ఎవరైనా అవకాశం ఇస్తే సూపర్ హీరోగా నటిస్తాను. వండర్ వుమెన్ చూశాక అలాంటి చిత్రాన్ని చేయాలనే కోరిక పెరిగింది. అని చెప్పింది.



రాచెల్ వైజ్

నదియా నటన హైలైట్‌గా దేవి

గతంలో కథానాయికగా పేరు తెచ్చుకున్న నదియా ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా ముఖ్యపాత్రలలో మెరుస్తున్న సంగతి తెలిసిందే. రీఎంట్రీలో దృశ్యం, అత్తారింటికి దారేది వంటి సినిమాలు ఆమెకెంతో



పేరు తెచ్చిపెట్టాయి. తెలుగుతో పాటు తమిళ ప్రేక్షకులకు సుపరిచితమైన ఆమె ప్రధాన పాత్రలో నటించిన తిరక్కు వరతకయ అనే తమిళ చిత్రం ఇప్పుడు తెలుగులో దేవి పేరుతో అనువాదమైంది. మహిళా దర్శకురాలు తులసీదాస్ దర్శకత్వం వహించారు. కె.కె.ఆర్. క్రియేషన్స్ పతాకంపై కె.ప్రియభారతి సమర్పణలో కర్రి సత్యనారాయణరెడ్డి, కె.కృష్ణ సబ్బిళ్ళ వెంకట్‌రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందులో నదియా స్పెషల్ సి.బి.ఐ. అధికారిగా నటించింది.. సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో సాగే చిత్రమిది. ఓ మర్డర్ మిస్టరీని ఛేధించే క్రమంలో పరిశోధన అధికారిగా నదియా అద్భుతమైన నటనను కనబరిచింది. హారర్ సన్నివేశాలు, గ్రాఫిక్స్ హైలైట్‌గా నిలుస్తాయి. పాత్రధారులతో పాటు దర్శక, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు సైతం అంతా మహిళలే రూపొందించిన ఈ చిత్రం తమిళంలో మంచి విజయాన్ని సాధించింది. ఇలాంటి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలన్న సదుద్దేశ్యంతో మేం అనువదించాం. ఆద్యంతం ఆసక్తిదాయకంగా సాగే ఈ చిత్రంలో ఐదు పాటలున్నాయి అని చెప్పారు. ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో కోవై సరళ, ఇనియా, శోభికామోహన్ తదితరులు నటించగా...ఈ చిత్రానికి మాటలు: శ్రీసాయి, పాటలు: కల్లూరి శేఖర్, సంగీతం: ఎం.జి.శ్రీకుమార్, కెమెరా: సంజీవ్ శంకర్.

క్రీడాప్రభ

ఆస్ట్రేలియా ఎదురీత

ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను నిలువరించిన భారత్ బౌలర్లు

- తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకే ఆలౌట్
- ఫాలో ఆన్ ఆడుతూ 6/0



చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఓటమిని తప్పించుకోవడానికి ఎదురీదుతోంది. ఫాలో ఆన్ ఆడుతూ.. ఇంకా 316 పరుగుల వెనకబడ్డది. ఆటకు నేడు చివరిరోజు కావడంతో ఆస్ట్రేలియా ఓటమి తప్పించుకోవడానికి వికెట్లను కాపాడుకుంటూ చివరికంటా నిలిస్తే... మ్యాచ్ డ్రా అవుతుంది. లేకపోతే ఆసీస్ ఇన్నింగ్స్ ఓటమిని ఎదుర్కొంటుంది. ఈ టెస్ట్ డ్రా అయినప్పటికి సిరీస్ భారత్ వశమవుతుంది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1 లీడ్‌లో ఉంది. ఈ టెస్ట్‌ను గెలిచి ఆసీస్ సిరీస్‌ను డ్రా చేసుకుందామన్న ఆశలకు భారత బ్యాట్స్‌మెన్, బౌలర్లు గండికొట్టారు. ఆస్ట్రేలియాపై తొలి టెస్ట్‌ను ఆడుతున్న కుల్దీప్ యాదవ్ 5 వికెట్లు పడగొట్టి ఆ జట్టు పతనాన్ని శాసించాడు.

సిడ్నీ: నాలుగో టెస్ట్ ఆటకు వరుణుడు అడ్డంకిగా మారాడు. నాలుగోరోజైన ఆదివారం కూడా వెలుతురు సరిగాలే కపోవడం, రాత్రంతా వర్షం కారణంగా మైదానం చిత్తడిగా మారడంతో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఆసీస్ తన తొలి ఇన్నింగ్స్ ఓవర్ నైట్ స్కోరు 236/6తో బ్యాటింగ్ కొనసాగిస్తూ.. 300 పరుగులకు ఆలౌటయింది. దీనితో ఆస్ట్రేలి యా ఫాలో ఆన్ ఆడాల్సి వచ్చింది. కుల్దీప్ 5/99 వికెట్లు తీసి ఆసీస్ బ్యాటింగ్‌ను కూల్చడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగో రోజు ప్రారంభించగానే భారత్ కొత్త బంతిని తీసు కుంది. కమిన్స్ 25(44బంతులు, ఫోర్లు-6)ను ఆట ప్రారం భించిన కొద్ది సేపటికే షమీ క్లీన్ బౌల్డ్ చేయడంతో క్రీజులోకి మిచెల్ స్టార్క్ వచ్చాడు. అనంతరం ప్రమాదక రంగా మారు తున్న హ్యాండ్స్‌కోంబ్ 37(111 బంతులు, ఫోర్లు-5)ను బుమ్రా అద్భుతమైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. నాథన్ లియాన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. లియాన్ ఐదు బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే కుల్దీప్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగాడు. చివరి బ్యాట్స్ మన్‌గా హేజిల్‌వుడ్ క్రీజులోకి వచ్చాడు. హేజిల్‌వుడ్ 21(45 బంతులు, ఫోర్లు-2) పరుగులు చేసి కుల్దీప్ బౌలింగ్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యుగా ఔట్ కావడంతో ఆస్ట్రేలియా డీఆర్ఎస్ కోరింది. డీఆర్ఎస్‌లో హేజిల్‌వుడ్ ఔటయినట్లు తేలడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 300 పరుగుల వద్ద ముగిసింది. హేజి ల్‌వుడ్, మిచెల్ స్టార్క్‌లు కలిసి 10 వికెట్ భాగస్వామ్యానికి 42 పరుగులు జోడించారు. భారత్ కన్నా ఆస్ట్రేలియా ఇంకా 322 పరుగులు వెనకబడ్డది. భారత్ బౌలర్లలో షమీ 2/58, బుమ్రా 1/62, జడేజా 2/73, కుల్దీప్ 5/99 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా ఫాలో ఆన్ ఆడుతూ టీ సమయానికి వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా సొంత గడ్డపై ఫాలో ఆన్ ఆడటం 30 ఏళ్ల తర్వాత చోటుచేసుకుంది. ఆసీస్ చివరిసారిగా 1988లో ఫాలో ఆన్ ఆడింది. వెలుతురు సరిగా లేకపోవడంతో ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మెన్ మైదానం వీడారు. అనంతరం పలు దఫాలుగా పరిస్థితిని సమీక్షించిన అంపైర్లు చివరికి మిగిలిన ఆటను కూడా రద్దు చేయడంతో నాలుగో రోజు ఆట ముగిసింది. వర్షం, వెలుతురు సరిగా లేకపోవడంతో ఆదివారం కేవలం 25.2 ఓవర్ల పాటే ఆట సాగింది. ఆసీస్ 316 పరుగుల ట్రయల్స్‌లో ఉం ది. మార్కస్ హ్యారిస్ 2 పరు గులు, ఉస్మాన్ ఖవాజా 6 పరు గులతో క్రీజు లో ఉన్నారు. నాలుగు టెస్టుల ఈ సిరీస్‌లో భారత్ రెండు ఆస్ట్రేలియా ఒక టెస్ట్ గెలిచాయి. 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత్ చివరి టెస్ట్‌ను గెలిచినా, డ్రా చేసినా.. సిరీస్ భారత వశమవుతుంది. అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 31 పరుగులు తేడాతో గెలువగా, పెర్త్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా 146 పరుగుల తేడాతో విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్ట్‌లో భారత్ 137 పరుగులు తేడాతో గెలుపొందింది.

ఆసియా ఖండం వెలుపల భారత్ తొలి ఇన్నింగ్స్ అత్యధిక లీడ్‌లు

సంవత్సరం	దేశం	స్టేడియం	లీడ్	మ్యాచ్ ఫలితం
2006లో	వెస్టిండీస్‌పై	గ్రాస్ ఐస్‌లెట్	373 పరుగులు	డ్రా
2002లో	ఇంగ్లండ్‌పై	లీడ్స్	355 పరుగులు	గెలుపు
2016లో	వెస్టిండీస్‌పై	నార్త్ సౌండ్	323 పరుగులు	గెలుపు
2018-19	ఆస్ట్రేలియాపై	ఎస్‌సీజీ	322 పరుగులు	మ్యాచ్ కొనసాగుతోంది
2007లో	ఇంగ్లండ్	ఓవల్	319పరుగులు	డ్రా
2016లో	వెస్టిండీస్	కింగ్‌స్టన్	304 పరుగులు	డ్రా

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హ్యారిస్ (బి) రవీంద్ర జడేజా 79, ఖవాజా (సి)పుజారా (బి) కుల్దీప్ యాదవ్ 27, మార్నస్ లాబుస్‌చాగ్నె (సి) రహానే(బి) షమీ 38, షువాన్ మార్ష్ (సి) రహానే (బి) రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ సి అండ్ బి కుల్దీప్ యాదవ్ 20, పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (బి) బుమ్రా 37, టిమ్ పైన్ (బి) కుల్దీప్ యాదవ్ 5, పాట్ కమిన్స్ (బి) షమీ 25, మిచెల్ స్టార్క్ నాటౌట్ 29, నాథన్ లియాన్ ఎల్బీడబ్ల్యు (బి) కుల్దీప్ 0, జోష్ హేజిల్‌వుడ్ ఎల్బీడబ్ల్యు (బి) కుల్దీప్ 21, ఎక్స్‌ట్రాలు 11 మొత్తం 300 ఆలౌట్ (104.5 ఓవర్లు)

భారత్ బౌలింగ్: మహ్మద్ షమీ 19-2-58-2, జస్ప్రీత్ బుమ్రా 21-5-62-1, రవీంద్ర జడేజా 32-11-73-2, కుల్దీప్ యాదవ్ 31.5-6-99-5, హనుమ విహారి 1-0-2-0.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.